
'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 146

బుధవారం 16-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నాదల్ నంబర్ వన్..

మూడేళ్ల తరువాత మళ్లీ టాప్ ర్యాంక్ అందుకోనున్న స్పెయిన్ స్టార్ – స్పోర్ట్స్‌లో



1,700 కోట్ల జరిమానా

లక్ష్యాల మేరకు గ్యాస్ ఉత్పత్తి చేయని రిలయన్స్, బీపీలపై చర్యలు – బిజినెస్‌లో

చదువుకోరు.. శుభ్రంగా ఉండరు

మంత్రి ఆది అనుచిత వ్యాఖ్యలు

దళిత సంఘాల ఆగ్రహం..

- 70 ఏళ్లుగా రిజర్వేషన్లు అనుభవిస్తున్నా మార్పు లేదనడంపై మండిపాటు
- ఇటీవలే.. ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారన్న సీఎం చంద్రబాబు..
- అదే బాటలో మంత్రులు, ఇతర నేతలు..


జమ్మలమడుగులో డాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆది

సాక్షి, అమరావతి

వివక్ష పూరిత వ్యాఖ్యలు చేయడం, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల పట్ల అవమానకరమైన రీతిలో వ్యవహరించడం తెలుగుదేశం పార్టీ నేతలకు అలవాటుగా మారిపోయింది. ఆవు చేను మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? అన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే స్వయంగా కుల విద్వేష పూరిత వ్యాఖ్యలతో ఎస్సీలను కించపరుస్తున్న నేపథ్యంలో మంత్రులు, ఆ పార్టీ ఇతర నేతలు సైతం మరింత రెచ్చిపోతున్నారు. మంగళవారం దేశం స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్న సీహెచ్ ఆదినారాయణరెడ్డి అడ్డూ అదుపూ లేకుండా ఎస్సీలపై దారుణమైన వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీలను కించపరిచే వ్యాఖ్యలు చేశారు. 'దేశానికి స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లయినా దళితులు మారలేదు. వారికి పదేళ్లకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించారు. ఇపుడు అది ఏడు పదులు దాటి ఎనిమిదో పదిలోకి వెళ్తోంది. అయినా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. వారు చదువుకోరు.. శుభ్రంగా ఉండరం'టూ వివక్ష పూరిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యాఖ్యలు మంత్రి, టీడీపీ పెద్దలు, నేతల దురహంకారాన్ని తెలియచేస్తున్నాయనేందుకు తార్కాణంగా ఉన్నాయని దుయ్యబడుతున్నారు. గతంలో 'ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అంటూ దళితుల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీస్తూ మాట్లాడిన విషయం తెలిసిందే. 'మనం కోరుకుని పుట్టలేదు. నీవే కులంలో పుట్టావో నీకు తెలియదు. నువ్వు పుట్టాలని కోరుకున్నావా? ఎవరు మాత్రం ఎస్సీ కులంలో పుట్టాలని కోరుకుంటారు. అందరూ సంపన్న వర్గాల్లోనే పుట్టాలని కోరుకుంటారు. అందరూ రాజుల కులంలో పుడితే రాజ్యాన్ని ఏలవచ్చనుకుంటారు' అంటూ ఎస్సీలుగా పుట్టడమే పాపమన్నట్లు అవమానకర వ్యాఖ్యలు చేశారు. కులం మతం ప్రాంతాలను కొందరు రాజకీయ

మిగతా 3వ పేజీలో ▶

మళ్లీ స్వర్గధామం!



ఆత్మీయ ఆలింగనంతోనే అది సాధ్యం.. కశ్మీర్‌పై ప్రధాని మోదీ పిలుపు

కశ్మీర్ సమస్యకు ఆత్మీయ ఆలింగనమే పరిష్కారం. ఈ సమస్య దూషణలతోనో, లేక తూటాల ద్వారానో పరిష్కారమవదు. కశ్మీర్ ప్రజలను ఆత్మీయంగా కౌగిలించుకుని, వారితో మమేకమవడంతోనే సమస్య పరిష్కారమవుతుంది. అలా అని ఉగ్రవాదంపైనా, ఉగ్రవాదులపైనా మనం అనుసరించే కఠిన వైఖరిలో మాత్రం మార్పు ఉండదు.

నోట్ల రద్దుతో నల్లధనం ప్రవాహానికి, అవినీతికి అడ్డుకట్ట వేశాం. నల్లధనంపై పోరు కొనసాగిస్తాం. దేశాన్ని, పేదల్ని దోచుకున్నవారు ఈ రోజు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు.

13లో

కలసికట్టుగా సాగితేనే దేశంలో గుణాత్మక మార్పు సాధ్యం. 9 నెలల్లో మనం మంగళ్‌యాన్‌ను సుసాధ్యం చేశాం. 'చల్తా హై' ధోరణి వదిలిపెట్టాలి. బదల్ సక్తా హై (మార్చాలి) అన్న సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి. బాల గంగాధర్ తిలక్ నినాదమైన స్వరాజ్.. ఇప్పుడు సురాజ్ (సుపరిపాలన) కావాలి.

మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటపైనుంచి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

అర్చకుల జీతాల్లో కోత!

కనీస వేతనం రూ.10వేల నుంచి రూ.5వేలకు తగ్గింపు

అర్చకులు, ఉద్యోగుల పొట్టకొట్టనున్న కొత్త నిబంధన



సాక్షి, అమరావతి : ఆదాయం లేని ఆలయాల్లో పనిచేసే అర్చకులు, ఇతర ధార్మిక ఉద్యోగుల జీతాల్లో కోత విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్ణయం తీసుకుంది. నెలకు రూ.10వేల కనీస వేతనం అందజేసేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి కనీస వేతనాన్ని సగానికి సగం తగ్గిస్తూ తాజాగా నిర్ణయించింది. దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ అధ్యక్షతన జులై 6న కమిషనర్ కార్యాలయంలో జరిగిన అర్చక సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకోగా, ఆ సమావేశ మినిట్స్‌ను రెండు రోజుల క్రితమే విడుదల చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో 23,834 ఆలయాలు ఉండగా, అందులో 20,672 ఆలయాలు ఏడాదికి రెండు లక్షలు.. అంతకంటే తక్కువ ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ ఆలయాల్లో

మిగతా 2వ పేజీలో ▶

హామీలన్నీ నెరవేర్చాం

రైతు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం



- స్వాతంత్య్ర సమరయోధుల పింఛన్‌ను పెంచుతున్నాం: సీఎం చంద్రబాబు
- ఇకపై రాష్ట్ర పండుగలా ఏరువాక జరగాలి

- వివరాలు 6లో

చుక్క నీరు లేకుండా జాతికి అంకితం

- ఎనిమిది నెలల్లోనే పురుషోత్తపట్నం పూర్తి చేశామంటూ చంద్రబాబు గొప్పలు
- సీఎం ప్రారంభించాక 2 మోటార్లను ఉత్తినే 35 నిముషాలు నడిపి ఆపేసిన అధికారులు
- పట్టిసీమ ఎత్తిపోతల తరహాలోనే.. మళ్లీ మళ్లీ ప్రారంభించే ఎత్తుగడ

- వివరాలు 5లో

మంగళవారం తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఓటమి భయంతోనే వందల కోట్ల పంపిణీ

చంద్రబాబుపై జగన్ మండిపాటు

- కార్పొరేటర్ల నుంచి చిన్నాచితక లీడర్లందరినీ కొనుగోలు చేస్తున్నారు
- ప్రతి సామాజిక వర్గానికి ఎర, బుజ్జగింపులు.. లొంగకపోతే బెదిరింపులు
- ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు కాబట్టే నంద్యాలలో బాబుకు ఈ పరిస్థితి
- ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి కేసు నుంచి బయట పడేందుకు మోదీ కాళ్లు పట్టుకున్నారు
- చంద్రబాబు చేసిన మోసానికి, అన్యాయానికి, అధర్మ పాలనకు వ్యతిరేకంగా ఓటు వేయండి
- ధర్మ పోరాటంలో నంద్యాల ప్రజలు న్యాయం వైపు నిలబడాలని జగన్ పిలుపు

2లో


నంద్యాలలోని బొమ్మలసత్రంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇదం జగత్



...ముందు పార్టీ చూపించమంటున్నారు.. తర్వాత పగ్గాల సంగతట!

చండీగఢ్‌లో బాలికపై అత్యాచారం

పంద్రాగస్టు వేడుకలకు వెళ్తుండగా దారుణం 13లో



బ్లూవేల్‌పై నిషేధం

తక్షణం లింక్‌లను తొలగించాలని ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం 13లో

బోరు బావిలో పసి 'ప్రాణం'


మంగళవారం గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో బాలుడు పడిపోయిన బోరుబావి (ఇన్‌సెట్‌లో చిన్నారి చంద్రశేఖర్ ఫైల్)

- ఆడుకుంటూ బోరుబావిలోకి జారిపడిన రెండేళ్ల బాలుడు
- 13 అడుగుల లోతులో ఇరుక్కున్న చిన్నారి
- ఆక్సిజన్ అందిస్తూ సహాయక చర్యలు చేపట్టిన జిల్లా యంత్రాంగం
- 20 అడుగుల లోతు వరకు సమాంతరంగా గుంత తవ్విన సిబ్బంది

2లో

నోళ్లు తెరుచుకున్న బోరు బావులు చిన్నారుల ప్రాణాలతో ఆడుకుంటూనే ఉన్నాయి. ఎన్ని ఘటనలు జరిగినా వీటి నోళ్లు మాత్రం మూయించలేకపోతున్నారు. అక్కడ బోరు బావి ఉందని, అది అపాయమని తెలియని చిన్నారులు.. ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ వాటి బారిన పడుతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో ఓ పసి 'ప్రాణం' బోరుబావిలో పోరాడుతోంది.


నంద్యాలలోని గాంధీనగర్ ఎస్సీ కాలనీలో శాంతికపోతం ఎగురవేస్తున్న వైఎస్ జగన్

నంద్యాలలో..

జాతీయ జెండా ఎగురవేసిన జగన్

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నంద్యాలలో అభిమానులు, పార్టీ శ్రేణుల మధ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నంద్యాలలోని బొమ్మల సత్రంలో తాను విడిది చేసిన గృహానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగన్ ఉప ఎన్నిక ప్రచారానికి బయలుదేరడానికి ముందుగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఉభయ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అక్కడి నుంచి ప్రచారానికి బయల్దేరి వెళ్లారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనసభలో పార్టీ ఉపనేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ముఖ్య నేతలు కోలగట్ల వీరభద్రస్వామి, బాలినేని శ్రీనివాసరెడ్డి, కె.పి.సారథి, నంద్యాల ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


నంద్యాలలోని జ్ఞానాపురం కాలనీలో వైఎస్ జగన్‌కు హారతి పడుతున్న మహిళలు

ఓటమి భయంతోనే వందల కోట్ల పంపిణీ

చంద్రబాబుపై జగన్ మండిపాటు

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'మూడున్నరేళ్లుగా తాను చేసిన మోసాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో తనపై ఉన్న వ్యతిరేకతను దృష్టి మళ్లించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ నంద్యాలలో వందల కోట్ల రూపాయల పంపకాలు జరుపుతున్నారు.. ఎలాగైనా ఉప ఎన్నికలో గెలవాలన్న దుర్బుద్ధితో ప్రతీ సామాజిక వర్గానికి ఎర వేస్తున్నారు.. బుజ్జగింపులకు దిగుతున్నారు.. ఈ రెండింటికీ లొంగకపోతే బెదిరింపులకూ పాల్పడుతున్నారు.. భవనాలు కూల్చేస్తూ అభివృద్ధి అంటూ ఫోజులు కొడుతున్నారు.. మళ్లీ పాత టేప్ రికార్డర్ ఆన్ చేసి అవే మోసపూరిత వాగ్దానాలు.. అబద్ధాలు వల్లె వేస్తున్నారు.. ప్రత్యేక హోదాపై ఢాంబికాలు పలికి.. చివరకు ఓటుకు కోట్లు కేసు నుంచి బయటపడేందుకు మోదీ కాళ్లు పట్టుకున్నారు.. హోదాను తాకట్టు పెట్టి ప్రజల ఉజ్వల భవిష్యత్తుతో చెలగాటం ఆడారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఏడవ రోజు మంగళవారం బొమ్మలసత్రం జంక్షన్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో గాంధీనగర్, ఎస్సీ కాలనీ, గాంధీనగర్ చౌరస్తా, ఇస్లాంపేట, మూలసాగరం, జ్ఞానాపురం, వైఎస్ ప్రభుదాస్‌రెడ్డి వీధి మీదుగా విశ్వాసపురం పెద్ద చర్చి రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా మూలసాగరం వద్ద జగన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..


మంగళవారం నంద్యాలలోని మూలసాగరం శివాలయం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మోసం చేయడమే చంద్రబాబు నైజం..

''రైతుల రుణాలన్నీ పూర్తిగా మాఫీ కావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలి.. బ్యాంకుల్లో పెట్టిన బంగారం బయటకు రావాలంటే బాబు సీఎం కావాలి.. డ్వాక్రా అక్క చెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ కావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలి.. జాబు రావాలంటే బాబు రావాలి.. అంటూ ఎన్నికల ముందు మోసపూరిత వాగ్దానాలు గుప్పించిన చంద్రబాబు నైజంలో ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఎటువంటి మార్పు రాలేదు. రూ.86,612 కోట్ల రైతు రుణాల్లో ఒక్క రూపాయి మాఫీ కాలేదు. ఇచ్చింది వడ్డీకే సరిపోలేదు. పైగా అపరాధ వడ్డీ కింద ఈ మూడేళ్లలో రూ.45 వేల కోట్ల భారం రైతుల నెత్తిన పడింది. చంద్రబాబు మాటలు నమ్మి రైతులు నేడు బ్యాంకు గడప ఎక్కలేని పరిస్థితి వచ్చింది. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రాలేదు. రూ 5 వేల కోట్లతో ఏర్పాటు చేస్తామన్న ధరల స్థిరీకరణ నిధి సంగతి అటకెక్కించారు. ఫలితంగా పసుపు, మినుము, వేరుశనగ, కంది పంటలకు గిట్టుబాటు ధర లేదు. మిర్చి పంట వేసే ధైర్యమూ లేకుండా పోయింది. డ్వాక్రా అక్క చెల్లెమ్మల రుణాలకు సంబంధించిన రూ.14 వేల కోట్లలో ఒక్క రూపాయి మాఫీ కాలేదు. రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఇలా 38 నెలల్లో ప్రతి ఇంటికీ నిరుద్యోగ భృతి కింద రూ.76 వేలు బాకీ పడ్డారు. పేదల జీవితాలతో చెలగాటం ఆడారు. పక్కా ఇళ్లు కట్టిస్తానని చెప్పి.. ఒక్క ఇల్లూ కట్టివ్వకుండా మోసం చేయడమే తన నైజం అని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు.

ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు..

రాష్ట్ర విభజన వల్ల ఎంతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా దక్కితే మేలు జరుగుతుంది. ప్రజల భవిష్యత్తు బాగుంటుంది. కేంద్రం ఐదేళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామంటే కాదు.. కాదు.. పదిహేనేళ్ల పాటు ఇవ్వాలంటూ పట్టుబట్టిన చంద్రబాబు.. ఓటుకు కోట్లు కేసు కోసం దానిని కేంద్రానికి తాకట్టు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో తన దుర్మార్గ పాలనలో సంపాదించిన అవినీతి సొమ్మును పక్క రాష్ట్రం తెలంగాణలో ఖర్చు చేస్తూ.. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నంలో అడ్డంగా దొరికిపోయారు. వీడియో.. ఆడియోల్లో ఆయన బాగోతం బహిర్గతం కావడంతో ఈ కేసు నుంచి బయట పడేందుకు ప్రధాన మంత్రి మోదీ కాళ్లు పట్టుకున్నాడు. అధికారం కోసం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలే కాదు.. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో కర్నూలు జిల్లా అభివృద్ధి కోసమంటూ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. కర్నూలులో ఎయిర్ పోర్టు, స్విమ్స్ స్థాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మైనింగ్ కళాశాల, ఉర్దూ విశ్వవిద్యాలయం, అవుకులో ఇండస్ట్రియల్ హబ్, ఆదోని, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్, అపెరల్ పార్కులు, బెంగళూరు – హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్, గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తానంటూ ఇలా అనేక హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్కటీ అమలు కాలేదు.

విశ్వసనీయతే నాకున్న ఆస్తి..

చంద్రబాబు మాదిరిగా నా దగ్గర డబ్బుల్లేవు. నా దగ్గర ముఖ్యమంత్రి పదవి లేదు. నా దగ్గర పోలీసుల బలం లేదు. చంద్రబాబు మాదిరిగా లేనిది ఉన్నట్టుగా.. ఉన్నది లేనట్టుగా చూపించే టీవీ చానళ్లు నా దగ్గర లేవు. ప్రియతమ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోతూ ఇచ్చిన ఇంత పెద్ద కుటుంబమే నాకున్న ఆస్తి. నాన్న గారు చేసిన ఆ సంక్షేమ పథకాలు ఇంకా మీ గుండెల్లో బతికే ఉండటం నాకున్న ఆస్తి. జగన్ అబద్ధం ఆడడు. జగన్ మోసం చేయడు. జగన్ మాట ఇస్తే తప్పడు. జగన్ ఏదైనా చెబితే చేస్తాడు అన్న విశ్వసనీయతే నాకున్న ఆస్తి. విలువలతో కూడిన రాజకీయాలు చేయడమే నాకున్న ఆస్తి. నవరత్నాలతో జగన్ కూడా ప్రతీ పేదవాడి ఇంట్లో వెలుగులు నింపుతాడు.. వాళ్ల నాన్న మాదిరిగానే పేదల కోసం తపిస్తాడు అన్న ప్రజల నమ్మకమే నాకున్న ఆస్తి. దేవుడి దయ, మీ ఆశీస్సులే నాకున్న ఆస్తి.''

లౌక్యంగా ఓటు వేయండి..

''చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నుంచి మద్యం షాపుల దాకా.. మట్టి నుంచి ఇసుక దాకా.. గుడి భూముల నుంచి విశాఖ, రాజధాని భూముల దాకా దేనినీ వదిలిపెట్టలేదు. లంచాల రూపంలో రూ.లక్షల కోట్లు దోచుకున్నాడు. ఇప్పుడా డబ్బులో కొంత నంద్యాల ఉప ఎన్నిక కోసం ఖర్చు చేయడానికి వస్తున్నారు. చంద్రబాబు పంపిన డబ్బు మూటలతో దెయ్యాలు మీ ఇంటికి వస్తాయి. చేతిలో రూ.5 వేలు పెట్టి.. ఆ తర్వాత జేబులో నుంచి దేవుడి పటం తీసి చేతిలో పెట్టి.. దేవుడి మీద ప్రమాణం చేయించుకుని మరీ డబ్బులు ఇచ్చే కార్యక్రమం చేస్తాయి. ఏ దేవుడు కూడా పాపానికి ఓటు వేయమని చెప్పలేదు. పాపానికి ఓటెయ్యండి అని చెప్పేది దెయ్యాలు మాత్రమే. కాబట్టి దెయ్యాలతో గొడవ పడకుండా మనసులో దేవుణ్ణి తలచుకోండి. ధర్మంవైపే మేముంటామని అనుకుని లౌక్యంగా న్యాయానికి, ధర్మానికి ఓటు వేయండి. ధర్మ పోరాటంలో న్యాయం వైపు నిలబడండి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి మీ దీవెనలు, ఆశీస్సులు అందించి గెలిపించండి'' అని జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో ఎన్నో హామీలిచ్చి మోసం చేసినట్లే.. రాబోయే రోజుల్లో చంద్రబాబు ఇంటికో కారు, కేజీ బంగారం ఇస్తానంటారని.. రాజకీయ నాయకులు మాట మీద నిలబడకపోతే ప్రజలు కాలర్ పట్టుకుని నిలదీస్తారనే భయం కలిగినప్పుడే ఈ వ్యవస్థలో మార్పు వస్తుందన్నారు. నంద్యాల ప్రజలు చంద్రబాబు మోసానికి, అన్యాయానికి, అధర్మానికి వ్యతిరేకంగా ఓటు వేసి.. మోసం చేస్తే ఒప్పుకునేది లేదన్న సంకేతం ఇవ్వాలని కోరారు.


మూలసాగరం శివాలయం వద్ద ప్రసంగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి

> ఇప్పుడు నంద్యాలలో ఉప ఎన్నిక రాగానే చంద్రబాబుకు ప్రజలు గుర్తొచ్చారు. మళ్లీ పాత టేప్ రికార్డర్‌ను ఆన్ చేసి ఇదివరకటి లాగానే అవే మోసపూరిత వాగ్దానాలు, అవే అబద్ధాలు చెబుతున్నారు. ప్రతీ సామాజిక వర్గానికి అన్యాయం చేశారు కాబట్టే ఓటమి భయంతో వందల కోట్ల రూపాయల పంపకాలు జరుపుతున్నారు. కార్పొరేటర్లు మొదలు చిన్నా చితక లీడర్లను.. నీ రేటెంత? అంటూ కొనుగోలు చేస్తున్నారు. లొంగకపోతే బెదిరింపులకు దిగుతున్నారు.

సమస్యలు వింటూ... సాంత్వన చేకూరుస్తూ...

- నంద్యాలలో జగన్ పర్యటనకు విశేష స్పందన
- మహిళల ఆదరణ అపూర్వం

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక సమరంలో వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరగకుండా నియోజక వర్గం అంతటా రెట్టించిన ఉత్సాహంతో పర్యటిస్తున్నారు. ఇరుకైన వీధుల్లోకి సైతం వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకంగా మారిన ఈ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి మద్దతుగా ఆయన ఈ నెల 9 నుంచీ నియోజక వర్గంలోనే ఉండి నిర్విరామంగా ప్రచారం సాగిస్తున్నారు. పేద, గిరిజన మురికివాడల్లో తిరుగుతూ అక్కడి ప్రజల కష్టసుఖాలనూ తెలుసుకుంటున్నారు. తమ సమస్యల గురించి వారు వివరిస్తున్నప్పుడు శ్రద్ధగా వింటూ వారికి సాంత్వన చేకూరుస్తూ ముందుకు కదులుతున్నారు. 'మంచి రోజులు వస్తాయ్...' అని వారికి భరోసా ఇస్తున్నారు. ఇక రానున్నది పేదల సంక్షేమ రాజ్యమేననే సందేశాన్ని ఇస్తున్నారు. మూడేళ్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాగిస్తున్నది అప్రజాస్వామిక, అవినీతి, ఆటవిక పాలన అని జగన్ ఎండగడుతున్నారు. బేషరతుగా రుణాలను రద్దుచేస్తానని చెప్పి రైతులను, డ్వాక్రా మహిళలను మోసగించారని దుయ్యబడుతున్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ టోపీ పెట్టారని విమర్శిస్తున్నారు. జగన్ విమర్శలు చేస్తున్నప్పుడు జనం నుంచి విశేష స్పందన లభిస్తోంది. అభివృద్ధిపై టీడీపీ చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ ప్రజల నుంచే సమాధానాలు రాబట్టడం అందరినీ ఆకర్షిస్తోంది.

వెల్లువెత్తుతున్న అభిమానంతో పర్యటన ఆలస్యం

నంద్యాల, గోస్పాడు మండల్లాలోని 35 గ్రామాలకుగాను, 30 గ్రామాలను జగన్ ఇప్పటికే చుట్టేశారు. పట్టణంలో అనేక వార్డులు, పురవీధుల్లో తిరుగుతున్నారు. మిగిలిన వార్డులు, పుర వీధులు తిరిగే ఆలోచనతో ముందుకెళ్తున్నారు. ప్రతిరోజూ ఉ.9.30 నుంచి 10 గంటల మధ్య తన పర్యటనను ప్రారంభిస్తున్న జగన్ రాత్రి 8.30 నుంచి 9 వరకూ ప్రచారంలో పాల్గొంటున్నారు. అందరి ఆహ్వానాలను మన్నిస్తుండడంతో షెడ్యూలు ప్రకారం జరగాల్సిన పర్యటన గంటల కొద్దీ ఆలస్యంగా సాగుతోంది. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా నిరుపేదలు ఆహ్వానించినా వారింటికి వెళ్లి కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు.


ఇస్లాంపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న దస్తగిరిని పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఈ ప్రభుత్వం ఎవరికి ఏమొచ్చినా పట్టించుకోదు : జగన్

'ఈ ప్రభుత్వం ఎవరికి ఏమొచ్చినా పట్టించుకోదమ్మా.. చాలా బాధాకరం..' అంటూ ఓ పేద ముస్లిం కుటుంబం ఆవేదనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలుపంచుకున్నారు. మంగళవారం గాంధీనగర్‌లో వెళ్తున్నప్పుడు ఓ ఇరుకైన వీధిలో మదార్‌బీ అనే మహిళ జగన్‌కు రెండు చేతులూ జోడించి.. 'అన్నా.. మేం కష్టాల్లో ఉన్నామన్నా'... అంటూ ఏడ్చేసింది. అప్పటికే వాహనమెక్కిన జగన్ కిందకు దిగి వెనక్కి నడుచుకుంటూ ఆ పేదరాలి ఇంట్లోకి వెళ్లారు. తన భర్త దస్తగిరికి పక్షవాతం వచ్చి నాలుగేళ్లుగా మంచాన పడ్డారని ఆదుకునే వారు లేరని, ప్రభుత్వం పింఛను కూడా ఇవ్వలేదన్నారు. జగన్ ఆ ఇంట్లో కొద్దిసేపు కూర్చుని దస్తగిరి జబ్బేమిటో అడిగి తెలుసుకున్నారు. మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు. అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని పిలిచి ఎన్నికలు ముగిశాక ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని జగన్ కోరారు.

జగనన్నా.. నా ఓటు నీకే

కొందరు మహిళలు కాన్వాయ్‌కి అడ్డంగా నిలబడడంతో.. కారును నిలిపి జగన్ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. గుంపులో నుంచి ఓ మహిళ ముందుకొచ్చి.. జగనన్నా, నా ఓటు నీకే... ఇంతకు ముందు టీడీపీకి వేశాను... అంటూ చెప్పింది. పర్యటనలో ఓ చోట కొందరు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మహిళలు తమ వాడలో స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటుండగా జగన్ అదే సమయానికి అక్కడికి చేరుకున్నారు. ఆయన చేతికి మూడు పావురాలను ఇచ్చి మూడు మతాల సామరస్యానికి ప్రతీకగా ఎగురవేయాల్సిందిగా కోరగా జగన్ వాటిని ఎగురవేశారు. అలాగే, తాను బసచేసిన అతిథిగృహం వద్ద కూడా జగన్ శాంతికపోతాలను ఎగురవేశారు.

వైఎస్ అభిమాని బోయ పుల్లమ్మ

వైఎస్ రాజశేఖరరెడ్డికి వీరాభిమాని అయిన బోయ పుల్లమ్మ అనే మహిళ తమ ఇంట్లోకి రావాల్సిందిగా జగన్‌ను కోరగానే ఆమెను నిరాశపర్చకుండా అక్కడకు వెళ్లారు. దీంతో ఆ కుటుంబీకులు ఉబ్బితబ్బి బ్బయ్యారు. మరోచోట ఓ వృద్ధురాలిని జగన్.. అవ్వా, అని పలుకరించగా... మా ఓట్లన్నీ నీకే మనవడా! అంటూ ఆశీర్వదించింది. అంతకుముందు మంగళవారం ఉదయం 9.30కు ప్రారంభమైన జగన్ ప్రచారం రాత్రి 8.30కు ముగిసింది.

బోరు బావిలో పసి 'ప్రాణం'

> నరాలు తెగేలా ఉత్కంఠ.. కేవలం 13 అడుగుల లోతులో బాలుడు ఉన్నాడు.. పైనుంచి మాట్లాడే వారి మాటలకు స్పందిస్తున్నాడు.. బోరు బావికి సమాంతరంగా చకచకా గుంత తవ్వుతున్నారు.. మధ్యలో కాసేపు వరుణుడు.. అయినా పనులు ఆగలేదు.. అర్ధరాత్రికి నిలువునా తవ్వడం పూర్తయింది.. రెండు గుంతలను అనుసంధానం చేస్తూ మరో ఐదడుగులు తవ్వేస్తే చాలు.. దేవుడా దేవుడా ఈ పని త్వరగా పూర్తి కావాలి.. ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా, టీవీల ద్వారా వీక్షిస్తున్న లక్షలాది మంది ఒంటిపై వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.. ఆ బాలుడిని క్షేమంగా బయటకు తీసే సన్నివేశం చూడాలని కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు.



బోరు బావికి సమాంతరంగా గుంత తవ్వుతున్న సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) రోదిస్తున్న తల్లి అనూషను ఓదారుస్తున్న బంధువులు

వినుకొండ రూరల్/ సాక్షి, అమరావతి: రెండేళ్ల బాలుడు సరదాగా ఆడుకుంటూ బోరు బావిలో పడిపోయాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనుమర్లమూరి మల్లికార్జున్, అనూషల ఏకైక కుమారుడు చంద్రశేఖర్ మంగళవారం మధ్యాహ్నం తల్లితో కలసి పశువుల పాక వద్దకు వెళ్లాడు. తల్లి గేదెలను మేపుతుండగా.. బాలుడు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సమీపంలోని బోరుబావిలో పడిపోయాడు. కొంతసేపటి తర్వాత చందు కనిపించకపోవడంతో తల్లి వెతుకులాట ప్రారంభించింది. కనపించిన వారందరినీ ఆరా తీసింది. చివరకు సమీపంలోని బోరుబావి దగ్గరకు వెళ్లగా అందులో నుంచి బాలుడి మూలుగు వినిపించడంతో.. గ్రామస్తులు హుటాహుటిన పొక్లెయిన్ తెప్పించారు. సుమారు 13 అడుగుల లోతులో బాలుడు ఉన్నట్టు గుర్తించారు. బాలుడిని రక్షించేందుకు బోరు బావికి సమాంతరంగా గుంత తవ్వుతున్నారు.

సహాయక చర్యల్లో అధికారులు

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పట్టణ ఎస్సైలు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. అలాగే ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కోన శశిధర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ కృతికా శుక్లా, రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడు, తదితరులు సంఘటనా స్థలికి చేరుకొని బాలుడిని రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. బోరుబావికి సమాంతరంగా 20 అడుగుల వరకూ గుంత తవ్వారు. బాలుడు ఇబ్బంది పడకుండా బోరు బావిలోకి ఆక్సిజన్ పంపిస్తున్నారు.

మా కొడుకును బతికించండయ్యా..

తల్లి అనూష, తండ్రి మల్లికార్జున్‌తో పాటు బంధువులంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు బోరుబావిలో ఇరుక్కుపోవడంతో 'మా కొడుకును బతికించండయ్యా..' అంటూ ఆ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కాగా, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని బాలుడిని కాపాడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

అర్చకుల జీతాల్లో కోత!

▶ మొదటి పేజీ తరువాయి

పనిచేసే అనేకమంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు ప్రభుత్వం అమలుచేసే రూ.10వేల కనీస వేతనానికి నోచుకోకుండాపోతున్నారు. వీటిలోని సుమారు పదివేల ఆలయాలకు రెండు మూడు ఎకరాల చొప్పున వ్యవసాయ భూములున్నప్పటికీ, మిగిలిన పదివేల ఆలయాలకు కనీసం వ్యవసాయ భూములు కూడా లేవు. ఎలాంటి ఆదాయంలేని ఆలయాల్లోని అర్చకులకు భక్తులు హారతి పళ్లెంలో సమర్పించే కానుకలే జీవనాధారం. కొంతమేర భూములున్న ఆలయాల్లో పనిచేసే అర్చకులకు నెలకు రూ.3వేల నుంచి రూ.5వేల మధ్యనే ఆదాయం వస్తోందని అర్చక సంఘాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా 20వేల ఆలయాల్లో పనిచేసే అర్చకులు ప్రభుత్వ నిర్ణయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ప్రతినిధులంటున్నారు.

నిధి నుంచి 800 మందికే కనీస వేతనాలు

కాగా, ఆదాయంలేని ఆలయాల్లో పనిచేసే వారికి రూ.పది వేల చొప్పున వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం 2016లో రూ.200 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటుచేసింది. ఆలయ ఆదాయం నుంచి పొందే జీతం మొత్తాన్ని మినహాయిస్తే మిగిలిన మొత్తాన్ని ఆయా ఉద్యోగులకు ఈ నిధి నుంచి చెల్లించాలన్నది నిబంధన. ఆదాయంలేని ఆలయాల్లో కనీసం వేతనం అందుకోని అర్చకులు, ఇతర ధార్మిక ఉద్యోగులు దాదాపు 30వేల మంది వరకు ఉంటారని అంచనా. వీరిలో కేవలం 800మంది ఉద్యోగులకు మాత్రమే ప్రభుత్వం ఈ నిధి నుంచి రూ.పది వేల చొప్పున ఇస్తోంది. మరో 520 మందికి కూడా చెల్లించాలని వారు పనిచేసే ఆలయాలకు ఆదేశాలు జారీచేసింది. దశల వారీగా ఆదాయంలేని గుళ్లలోని అర్చకులందరికీ నెలకు పది వేల రూపాయల వేతనం అమలుచేయాల్సి ఉండగా.. ప్రభుత్వం హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా మరో 800 మందికి కూడా ప్రత్యేక నిధి నుంచి కనీస వేతనం ఇవ్వాలని భావిస్తున్న నేపథ్యంలో.. గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల్లో పనిచేసే వారికి కనీస వేతనాన్ని రూ.5వేలకు తగ్గిస్తూ, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేలు కొనసాగిస్తూ జులై 6న జరిగిన అర్చకుల సంక్షేమ సమావేశంలో నిర్ణయించారు.


గ్రామీణ ప్రాంతాల్లో అర్చకులకు రూ.5వేల జీతం ఇవ్వాలని నిర్ణయిస్తూ విడుదలైన సమావేశం మినిట్స్ కాపీ

గతంలో రూ.ఐదు వేలున్న కనీస వేతనాన్ని ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు బ్రాహ్మణ సంక్షేమ సంఘ చైర్మన్‌గానూ, అర్చక సంక్షేమ సంఘ చైర్మన్‌గా కొనసాగిన కాలంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రూ.10వేల మొత్తానికి పెంచారని, ఇప్పుడు ఆయనను పదవి నుంచి తప్పించి.. పెంచిన వేతనాన్ని మళ్లీ సగానికి సగం తగ్గించాలని ప్రభుత్వం ఆలోచించడం తగదని అర్చక సంఘాలు మండిపడుతున్నాయి.

చదువుకోరు.. శుభ్రంగా ఉండరు

▶ మొదటి పేజీ తరువాయి

లబ్ధి కోసం వినియోగించుకోవాలనుకుంటున్నారని, కులాలను బట్టి ఓట్లు రావని, వాటితో ఎవరూ గెలవలేరని బాబు వ్యాఖ్యానించారు. ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ ఎన్నికల్లో పోటీ చేసి గెలవలేకపోయారని, బీసీ సంఘాల నేత ఆర్ కృష్ణయ్యకు సీటిస్తే మెజారిటీ తగ్గిందని కూడా ఆయా వర్గాల నేతలను అవమానిస్తూ చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆయన వ్యాఖ్యలపై రాష్ట్రంలో పెద్ద దుమారమే రేగింది. అన్ని వర్గాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. ఎస్సీలుగా పుట్టాలని ఎందుకు కోరుకోరో చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు మనసులో మాట బయటపడి ఆయనలో కుల వివక్షను కళ్లకు చూపించింది. ఆయనపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెట్టాలని డిమాండ్లు వెల్లువెత్తాయి.

రాజ్యాంగ హక్కులకూ తూట్లు

రాజ్యాంగం, చట్టం పరంగా ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన హక్కులకూ చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వారికి ఖర్చు చేకుండా దారిమళ్లిస్తున్నారు. ఈ విషయంపై టీడీపీ ఎస్సీ ఎంపీ అయిన శివప్రసాద్ బహిరంగంగానే ధ్వజమెత్తారు. ఈ ఏడాదిలో జరిగిన అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. ఎస్సీ సబ్ ప్లాన్‌నిధులు దారి మళ్లిస్తున్నారని, అవమానకరంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు చేశారు. 2015–16 సబ్ ప్లాన్ నిధులు, ఎస్సీలకు దక్కాల్సిన ఇతర నిధులు ఒక్క చిత్తూరు జిల్లా నుంచే రూ.352 కోట్లు ఎస్సీలకు వినియోగించకుండా వెనక్కు పంపేశారని దుయ్యబట్టారు. ఆ వర్గాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులుగా వారికి తామేమి సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ 2016–17 బడ్జెట్లో రూ.9,336 కోట్లుగా చూపించి కేవలం రూ.6200 కోట్లు ఖర్చు చేశారు. 3 వేల కోట్లకుపైగా దారిమళ్లించారు. ఎస్సీలకు చట్టబద్ధంగా రావలసిన నిధులు కూడా అందకుండా చేస్తున్నారు. పదవుల విషయంలోనూ చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల పట్ల వివక్ష చూపుతున్నారన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కేంద్ర మంత్రి పదవులను ఇతరులకు ఇస్తున్నారు తప్ప ఎస్సీలకు అవకాశం ఇవ్వడం లేదని టీడీపీ ఎంపీ విమర్శించారు. రాజ్యసభ పదవులు రెండు టీడీపీకి వస్తే ఆ రెండింటినీ ఇతరులకే ఇచ్చారని, దళితులను పట్టించుకోలేదన్న ఆవేదన ఆ పార్టీ నేతల్లోనే ఉంది. ఎస్సీలకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన 'డి' పట్టా భూములను చంద్రబాబు సర్కారు నిర్దాక్షిణ్యంగా వెనక్కు తీసుకుంటోంది. పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రులో దళితుల పట్ల కొందరు టీడీపీకి చెందిన వ్యక్తులు అవమానకరంగా వ్యవహరించి సామాజిక బహిష్కరణకు గురి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిపై తీవ్రస్థాయిలో దళితులు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది.

ఆదిని మంత్రి పదవి నుంచి తొలగించాలి: కేవీపీఎస్ డిమాండ్

మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డిమాండ్ చేసింది. విలేకరులు వ్యతిరేక వార్తలు రాయకూడదని చెప్పడాన్నీ ఈ సంఘం ఖండించింది. ఈ మేరకు కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మంగళవారం రాత్రి ఒక ప్రకటన జారీ చేశారు. మంత్రి ఆదినారాయణ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, తన నోరు ఫినాయిల్‌తో కడుక్కోవాలని సూచించింది. ఆదినారాయణరెడ్డి దిష్టి బొమ్మను అన్ని జిల్లా, పట్టణ, మండల కేంద్రంలో దహనం చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రిని బర్తరఫ్ చేయాలి: దళిత హక్కుల పోరాట సమితి

ఎస్సీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డి ని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి దళితులను అవమానిస్తున్నారని అన్నారు. రిజర్వేషన్.. ఎస్సీలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కన్నారు. దళితులపై ఇటీవల దాడులు పెరిగాయన్నారు. చంద్రబాబు నాయుడు పాలకుడిగా అర్హత కోల్పోయారని, ఆయన కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితుల భూములను సైతం లాక్కుంటున్నారని సుబ్బారావు ఆరోపించారు.

దళితుల అభివృద్ధికి దళితులే ఆటంకం

మంత్రి ఆదినారాయణరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు

జమ్మలమడుగు (వైఎస్సార్ జిల్లా): 'దళితులు శుభ్రంగా ఉండరు.. సక్రమంగా చదువుకోరు.. వారు అభివృద్ధి చెందక పోవడానికి వారే కారణం' అంటూ మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి అంశంపై చర్చించడానికి మంగళవారం సూపరింటెండెంట్ రామేశ్వరుడు అధ్యక్షతన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయినా దళితులు మారలేదు. రాజ్యాంగంలో అంబేద్కర్ దళితులకు కేవలం 10 సంవత్సరాలు మాత్రమే రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పటికి 70 ఏళ్లు దాటినా వారిలో ఎటువంటి మార్పు రాలేదు. దళితులు అభివృద్ధి చెందకపోవడానికి దళితులే కారణం. వారికి భూముల పట్టాలు ఉండవు. వారు బాగా చదువుకోరు. శుభ్రంగా ఉండరు. అందుకే వారే ఎక్కువగా రోగాల బారిన పడుతున్నారు' అన్నారు. నంద్యాల ఉప ఎన్నిక పూర్తి కాగానే ఈ ఆసుపత్రి చైర్మన్‌గా తన కుమారుడు సుధీర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని వెల్లడించారు. తాను సంకల్పించిన పనిని పట్టుబట్టి కచ్చితంగా జరిగేవిధంగా చూస్తానని, ఆ పని జరుగకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. 'విలేకరులు ఉన్నది ఉన్నట్లు రాయాలి. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు మయసభ మాదిరిగా వార్తలు రాయకూడదు. చిన్న వాటిని భూతద్దంలో చూపించడం సరైంది కాదు' అన్నారు.

బెంగళూరులో భారీ వర్షం

- పలు ప్రాంతాలు జలమయం, తీవ్ర ఇబ్బంది పడ్డ ప్రజలు
- సహాయక చర్యలు చేపట్టిన ఆర్మీ, అధికారులు



కోరమంగళలో స్థానికులను పడవలో తరలిస్తున్న సైనికులు

సాక్షి, బెంగళూరు: బెంగళూరులో తొమ్మిది గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలుప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం రాత్రి 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటలకు వరకూ కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పలు చెరువుల కట్టలు తెగిపోవడంతో లోతట్టు నివాస ప్రాంతాలు నీటమునిగాయి. నగరంలోని కోడిచిక్కనహళ్లి, రాగిగుడ్డ, బీటీఎం లే అవుట్, యమలూరు, శాంతినగర, ఇందిరానగర, గారేబావిపాళ్య, బన్నేరుఘట్ట తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్లు, షాపులు, అపార్టుమెంట్ల సెల్లార్లలోకి వర్షపు నీరు రావడంతో ప్రజలు ఎటూ వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం నిత్యావసరాలు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. కోరమంగళ సహా పలుప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులతో పాటు ఆర్మీ సైనికులు కూడా వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. పడవల ద్వారా కొందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా, హొసూరు రోడ్డు, బన్నేరుఘట్ట, సిల్క్‌బోర్డు, వైట్‌ఫీల్డ్ తదితర ప్రాంతాల్లో గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తిరుత్తణిలో కావళ్లు చెల్లించిన
2 లక్షల మంది భక్తులు


కావళ్లతో తిరుత్తణి కొండకు వెళుతున్న భక్తులు

తిరుత్తణి (తమిళనాడు): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకల సందర్భంగా రెండు లక్షలకు పైగా భక్తులు కావళ్లు చెల్లించి స్వామిని దర్శించుకున్నారు. తమిళనాడులోని తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే ఆడికృత్తిక వేడుకల్లో తెప్పోత్సవం ప్రధానమైన ఆడికృత్తిక ప్రధానమైంది. సుబ్రమణ్యస్వామి అవతరించిన ఆషాఢమాసం కృత్తిక నక్షత్రం రోజున స్వామికి కావళ్లు చెల్లించి దర్శించుకుంటే శుభం చేకూరుతుందని భక్తుల నమ్మకం. దీంతో ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పుష్ప కావళ్లతో వాహనాల ద్వారా తిరుత్తణికి చేరుకున్నారు. వేలాది వాహనాలు, లక్షలాది మంది భక్తులతో తిరుత్తణి పసుపుమయంగా మారింది. భక్తులు తమ మొక్కుల నిమిత్తం శరవణ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి కావళ్లకు పూజలు చేసి మెట్లు, ఘాట్‌రోడ్డు మార్గాల్లో కొండకు చేరుకున్నారు. ఆలయంలోని నాలుగు మాడవీధుల్లో ఒకే సమయంలో అతి భారీగా భక్తులు చేరుకోవడంతో పోలీసులు, ఆలయసిబ్బంది భక్తులను కట్టడి చేయలేకపోయారు. దీంతో పరిస్థితి అయోమయంగా మారింది. ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ సుబ్రమణ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

మంత్రి ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయాలి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సురేష్, నారాయణస్వామి, సునీల్‌కుమార్ డిమాండ్

సాక్షి బృందం, నంద్యాల: ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరుస్తూ దారుణమైన వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డిని వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇటువంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో ఎన్నడూ చేయకుండా ఆదినారాయణ రెడ్డిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఆదిమూలపు సురేష్, నారాయణస్వామి, డాక్టర్ సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీల ఆత్మగౌరవాన్ని కాలరాస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు చంద్రబాబు కేబినెట్ మొత్తం బాధ్యత వహించాలన్నారు. మంత్రి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని గతంలో చంద్రబాబు వ్యాఖ్యానించి వారి పట్ల ఎంత చులకన భావం ఉందో తెలియజేశారని అభిప్రాయపడ్డారు. ఆ రోజు తన వ్యాఖ్యలను ఆయన వెనుకకు తీసుకోకపోవడం చూస్తే వాటికి కట్టుబడి ఉన్నారని భావించాల్సి వస్తోందన్నారు. తాజాగా స్వాతంత్ర్య దినోత్సవం నాడు మంత్రి చేసిన వ్యాఖ్యలు మొత్తం దేశంలోని దళితులను అవమానించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న విధంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. రాజకీయంగా దిగజారి మంత్రి పదవి దక్కించుకున్న ఆదినారాయణరెడ్డి.. ఇప్పుడు మనిషిగా కూడా దిగజారిపోయారని విమర్శించారు.

దళితుల మీద కొనసాగుతున్న దాడులు

దళితుల మీద కేసులు పెట్టడంలో, దళిత భూములు లాక్కోవడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యేలు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు, ప్రకాశం జిల్లా దేవరపల్లి, అనంతపురం జిల్లా వైటీ చెరువు, తాడిపత్రి, తూర్పుగోదావరి జిల్లా అమలాపురం... ఇలా ఎక్కడచూసినా చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నేటి వరకూ దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. దళితులపై జరుగుతున్న దౌర్జన్యాల్లో ఏపీకి దేశంలోనే రెండో స్థానం ఉన్నందుకు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. భారత ప్రభుత్వ క్రైం రికార్డ్స్–2015 ప్రకారం ఏపీలో దళితులపై 4,415 కేసులు నమోదయ్యాయన్నారు.

ఆదినారాయణరెడ్డిని జైల్లో వేయండి

- ఎస్సీ, ఎస్టీలంటే అంత చులకనా?
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలరాజు ఆగ్రహం



బుట్టాయగూడెం: దళితులు, గిరిజనులను అవమానించేలా మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా ఖండించారు. ఆదినారాయణరెడ్డిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలంటే అంత చులకనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారని.. వాటిని అందిపుచ్చుకొని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అయిన వారున్నారని చెప్పారు. అనేక రంగాల్లో ఎస్సీ, ఎస్టీలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. కానీ మంత్రి ఆదినారాయణరెడ్డి మాత్రం ఎన్ని వసతులు కల్పించినా ఎస్సీ, ఎస్టీలు మారరు, సరిగ్గా చదవరు, శుభ్రంగా ఉండరంటూ దారుణంగా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాష్ట్రపతి కూడా ఒక దళితుడేననే విషయాన్ని మంత్రి గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు, ఆయన సహచర మంత్రులకు ఎస్సీ, ఎస్టీలంటే చిన్నచూపని, అందుకే వారిని పదేపదే అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో సీఎం చంద్రబాబు సైతం ఎస్సీ, ఎస్టీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా, ఎస్టీలు తెలివితక్కువ వాళ్లు, అడవిలో నివసిస్తారంటూ దారుణ వ్యాఖ్యలు చేశారని ఆయన దుయ్యబట్టారు. తక్షణమే ఎస్సీ, ఎస్టీలకు క్షమాపణ చెప్పాలని, అలాగే మంత్రిపై కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

షీ టీమ్ కానిస్టేబుల్‌కే వేధింపులు

- ఈవ్‌టీజింగ్ కేసు విచారణలో భాగంగా నిందితుడికి ఫోన్‌కాల్
- ఆ నంబర్‌కే అసభ్యకర సందేశాలు పంపిన వైనం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


నిఖిల్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఈవ్‌టీజర్ల ఆటకట్టించే షీ టీమ్ లోని కానిస్టేబుల్‌నే 8 నెలలుగా వేధింపులకు గురిచేస్తున్న యువకుడిని ఎట్టకేలకు హైదరాబాద్‌లోని రాచకొండ షీ టీమ్ బృందం పట్టుకుంది. మంగళవారం రాచకొండ షీ టీమ్స్ ఇన్‌చార్జ్ ఏసీపీ స్నేహిత వివరాలను మీడియాకు వెల్లడించారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి తన ఫోన్‌కు అసభ్యకర సందేశాలు వస్తున్నాయంటూ రంగారెడ్డి జిల్లా మంచాలలోని ప్రతిభా డిగ్రీ కాలేజీకి చెందిన అమ్మాయి రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇబ్రహీంపట్నం షీ టీమ్స్ వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ పంపింది. దీనిపై ఏఎస్ఐ నరసింహ నేతృత్వంలోని బృందం ఆ అమ్మాయిని సంప్రదించగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ఆసక్తి చూపలేదు. అయితే తన సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించింది. విచారణ క్రమంలో నిందితుడి సెల్ నంబర్‌కు షీ టీమ్ సభ్యురాలు వివరాల కోసం ఫోన్‌కాల్ చేసింది. ఆ తర్వాత మహిళా కానిస్టేబుల్ సెల్ నంబర్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపించడం ప్రారంభించాడు. దీంతో ఆమె ఇబ్రహీంపట్నం పీఎస్‌లో జనవరి 23న ఫిర్యాదు చేసింది. అయినా మహిళా కానిస్టేబుల్‌ను వేధించడం ఆపలేదు. నెల రోజుల క్రితం ఆమె ఫోన్ నంబర్‌ను పోర్న్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడు వరంగల్ జిల్లా పరకాల మండలానికి చెందిన బి.నిఖిల్ కుమార్‌గా గుర్తించి అరెస్టు చేశారు.

బలి పశువులు!

- గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీలు పట్టివేత
- తిండీ నీరు లేక 32 గోవులు మృతి
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన


12 పశువులను మాత్రమే తరలించే వీలున్న లారీలో 60 పశువులను ఎక్కించిన దృశ్యం

పిఠాపురం: నిబంధనలను గాలికొదిలేసి వందల పశువులను లారీల్లో కుక్కి మరీ కబేళాలకు తరలించేస్తున్నారు. తాజాగా తూర్పు గోదావరి జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేట వద్ద సోమవారం అర్ధరాత్రి సుమారు 120 పశువులను కబేళాలకు తరలిస్తున్న రెండు లారీలను స్థానికులు పట్టుకుని కొత్తపల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాటిని గొల్లప్రోలు మండలం కొడవలిలో ఇటీవల నిర్మించిన పశు సంరక్షణా కేంద్రానికి తరలించగా వారు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో చేసేదేమీ లేక వాటిని తిరిగి పశువుల అక్రమ తరలింపుదారులకే అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. పశువులను తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

32 గోవులు మృతి: గత రెండు రోజుల కిందటే లారీల్లోకి ఎక్కించిన పశువులకు తిండి, నీరు లేకపోవడంతోపాటు ఊపిరాడక 32 గోవులు మృతి చెందాయి. కేవలం 12 పశువులను మాత్రమే తరలించే వీలున్న ఒక లారీలో ఏకంగా 60 పశువులను ఎక్కించారు. దీంతో ఒకదానిపై ఒకటి పడి ఊపిరాడక పలు పశువులు చనిపోయాయి.

ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని

మాల మహానాడు డిమాండ్


నల్లి రాజేశ్

నెల్లూరు (సెంట్రల్): ఎస్సీ, ఎస్టీలను చులకన చేసి మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దళితులంటే సీఎం చంద్రబాబుకు, ఆయన సహచర మంత్రులకు చులకన భావం ఉందనే విషయం తరచూ వెల్లడవుతూనే ఉందన్నారు. మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలకు సీఎం చంద్రబాబు తక్షణమే సమాధానం చెప్పాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళితులను అవమానించినందుకు నిరసనగా నంద్యాల ఉప ఎన్నికలో దళితులంతా టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వందేమాతరం నినాదంతో ముద్రగడ పాదయాత్ర..

- గేటు వద్దే అడ్డుకున్న పోలీసులు
- మా జాతికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదా అని ఆగ్రహం
- గాంధీ చూపిన మార్గంలోనే పాదయాత్ర చేస్తున్నట్లు స్పష్టీకరణ
- యాత్రను రోజూ అడ్డుకోవడం బాధగా ఉందని ఆవేదన


ముద్రగడ పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

కిర్లంపూడి: జాతీయ జెండాను భుజాన వేసుకుని 'వందేమాతరం' నినాదంతో జేఏసీ, కాపు నాయకులతో కలసి మాజీ ఎంపీ, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మంగళవారం కూడా పాదయాత్రను ప్రారంభించగా పోలీసులు అడ్డుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన స్వగృహం నుంచి పాదయాత్రకు బయల్దేరిన ముద్రగడను, గేటు వద్ద ఓఎస్డీ రవిశంకర్‌రెడ్డి, పోలీసు అధికారులు అడ్డుకున్నారు. దీంతో 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, మా జాతికి ఇంకా రాలేదా? ఇంకా బ్రిటిష్ పాలనలోనే కొనసాగుతున్నామా? రోజూ మీరు అనుమతి లేదంటూ సమాధానం చెప్పడం బాధగా ఉంది. మా జాతికి స్వాతంత్ర్యం రాలేదని ఈ రాష్ట్రం బ్రిటిష్ పాలనలో ఉందని, లేదా సింగపూర్ కంట్రోల్‌లో ఉందని చెప్పండి. మీరు ఏ సమాధానం చెప్పకుండా మమ్మల్ని అవమానిస్తున్నారు' అని ముద్రగడ ఆగ్రహం వ్యక్తం చేశారు. మా కార్లు ర్యాలీగా వస్తే ఆపుతారుగాని, సోమవారం విజయవాడ సమావేశానికి అన్ని వేల కార్లు ర్యాలీగా వెళ్తే ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో సెక్షన్ 30 అమల్లో ఉందా తీసేశారా?, ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం ఎలా పెట్టారని పోలీసులను నిలదీశారు. చట్ట పరిధిలో, మహాత్మా గాంధీ చూపించిన బాటలోనే తాము పాదయాత్ర చేస్తున్నామని, దానికంటే మంచి మార్గం ఉంటే చూపించాలన్నారు. అనంతరం వెనుదిరిగి గేటు వద్ద 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, తోట రాజీవ్, ఆరేటి ప్రకాశ్, జీవీ రమణ, గౌతు స్వామి, కాపు నాయకులు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

సాక్షి
బుధవారం, ఆగస్టు, 16


ఆస్పత్రి మృత్యుగీతం

అసమర్థత, అవినీతి, నిర్లక్ష్యం అన్నీ జతగూడి కన్నవారికి గర్భశోకాన్ని మిగిల్చాయి. యూపీలోని గోరఖ్‌పూర్ బాబా రాఘవ్‌దాస్ వైద్య కళాశాల(బీఆర్డీ) ఆస్పత్రిలో గత కొన్ని రోజులుగా సాగుతున్న నరమేథం సామాన్యమైనది కాదు. ఈ నెల 1 మొదలుకొని 12 వరకూ అక్కడ 134మంది పసిపిల్లలు మృత్యువాత పడ్డారని ఆ ఆస్పత్రిని సందర్శించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికనిచ్చిన వైద్య నిపుణుల బృందం చెబుతోంది. ఇందులో 70మంది కేవలం మూడు నాలుగు రోజుల వ్యవధిలో చనిపోయారు. కేవలం 48 గంటల్లో 30మంది కన్నుమూశారు. ప్రాణాలు కోల్పోయిన పిల్లల్లో పది రోజుల వయస్సున్న ఇద్దరు కవలలు మొదలుకొని పది పన్నెండేళ్ల వయసు చిన్నారుల వరకూ ఉన్నారు. వీరిలో అత్యధికులు రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలకు చెందినవారు. కొందరు బడుగు రైతుల పిల్లలు. మరికొందరు చిరు ఉద్యోగస్తుల పిల్లలు. తీవ్రంగా జబ్బుపడ్డ తమ పిల్లల ప్రాణాలు కాపాడుకుందామని వారిని ఆత్రంగా భుజాలకెత్తుకుని సర్కారీ ఆస్పత్రికొస్తే అది కాస్తా వారిని మింగేసింది. జరిగిన నరమేథానికి కారణం ఆక్సిజెన్ సిలెండర్లు లేకపోవడమా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెబుతున్నట్టు మెదడువాపు వ్యాధి తీవ్రత వల్లనా లేక మరో రకమైన అంటువ్యాధుల వల్లనా అన్నది చర్చనీయాంశం కాదు. అది కేవలం సమస్య తీవ్రత నుంచి జనం దృష్టి మళ్లించడానికి ఉద్దేశపూర్వకంగా చేస్తున్న వృథా తర్కం.

అధికారంలోకొచ్చిన వెంటనే చాలామంది పాలకులు చేసే పని పోలీసు శాఖలో చురుకుదనం తీసుకురావడం. వారు వీధుల్లో తరచు కనిపించి ఆడపిల్లల్ని వేధించే ఆకతాయిలను అరెస్టు చేయడం, ట్రాఫిక్ నిబంధనల్ని సరిగా పాటించనివారి వాహనాలు స్వాధీనం చేసుకోవడం వంటివి చేస్తే ప్రభుత్వం పనిచేస్తున్నదన్న భ్రమ కల్పించవచ్చునని పాలకులు భావిస్తారు. యోగి ఆదిత్యనాథ్ చేసింది కూడా అదే. ప్రత్యేక పోలీసు బృందాల గస్తీని పెంచి ఆకతాయిలను పట్టుకుని చితకబాదడం, ఆడ మగా కలిసి వెళ్తుంటే వారిని పట్టుకుని గుంజీలు తీయించడం లాంటివి నిర్వహించి అల్ప సంతోషులతో సెబాసనిపించుకున్నారు. ఒక పసివాణ్ణి కోల్పోయిన తండ్రి 'మరణించింది పిల్లలు గనుక మా నోరు నొక్కాలని చూస్తున్నారు. ఇదే ఆవు చనిపోయి ఉంటే ఈపాటికి పట్టణం ఎంత అల్లకల్లోలంగా మారేది!' అని వాపోయాడు. ఆ తండ్రి మాట అక్షరాలా నిజం. బీఆర్డీ సాధారణమైన ఆస్పత్రి కాదు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల ఆస్పత్రులు సైతం తీవ్రత గల కేసుల్ని పంపించే రెఫరల్ ఆస్పత్రి. అలాంటిచోట ఆక్సిజెన్ సిలెండర్ల వరకూ ఎందుకు... కాటన్ లేదు, గ్లూకోజ్ లేదు, మందుల్లేవు. చేర్పించింది మొదలు ఆ పిల్లల తల్లిదండ్రులు వీటన్నిటి కోసం మెడికల్ షాపులకు ఉరుకులెత్తడమే సరిపోయింది. ఇవన్నీ ఉన్నవారు రక్తం కోసం వెదుకులాడారు. అంతా అయిందనుకున్నాక వైద్యుల జాడ కోసం వివిధ వార్డుల్ని గాలించవలసివచ్చింది. విషాదమేమంటే పిల్లలు ప్రాణంతో ఉన్నంతవరకూ పడిన ఈ ఆత్రుత వారు మరణించాక కూడా కొనసాగింది. ముందు డెత్ సర్టిఫికెట్ కోసం... ఆ తర్వాత పోస్టుమార్టం కోసం...అటుపై మృత దేహాలను తెచ్చుకోవడం కోసం వారంతా యాతనలు పడ్డారు. ఆక్సిజెన్ లేదు మొర్రో అని ఆర్తనాదాలు చేస్తున్న పిల్లల బంధువుల్ని తరిమికొట్టడానికి భారీ సంఖ్యలో పోలీసు బలగాలు దిగాయి.

గోరఖ్‌పూర్ జిల్లాలో మెదడువాపు వ్యాధి తీవ్రత నాలుగు దశాబ్దాల నుంచి ఉన్నదని యోగి చెబుతున్న మాటలో నిజముంది. కానీ అదే నియోజకవర్గానికి 1998 నుంచి వరసగా ప్రాతినిధ్యం వహించిన తన నిర్లక్ష్యం పాలు అందులో ఎంతన్నది ఆయన గుర్తించలేదు. కనీసం మొన్నటివరకూ ఉన్న అఖిలేశ్ ప్రభుత్వం మెడలు వంచి సరైన వైద్య సదుపాయాలు కల్పించడానికి ఆయన చేసిన ప్రయత్నమేమిటి? అధికారంలోకి వచ్చాక మాత్రం చేసిందేమిటి? మార్చి 22న తొలిసారి ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రా ఆక్సిజెన్ సిలెండర్‌ల సరఫరాదారుకు చెల్లించాల్సిన రూ. 68 లక్షల బకాయి గురించి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ బకాయి తీర్చకపోతే సిలెండర్ల సరఫరా సాధ్యం కాదంటున్నాడని చెప్పారు. ఆ తర్వాత నెలకు రెండు, మూడు ఉత్తరాల చొప్పున రాస్తూనే ఉన్నారు. ఇది అయ్యే పని కాదని ఆ సరఫరాదారే స్వయంగా ఆరోగ్యమంత్రిని కలిసి చెప్పాడు. ఎన్ని చేసినా నిరుపయోగమైంది. చివరకు 23మంది పిల్లలు మరణించిన పదో తేదీన స్వయంగా యోగి ఆదిత్యనాథ్ జోక్యం చేసుకున్నా బకాయి తీర్చడానికి మరో 24 గంటలు పట్టింది. కారణం నిధుల కొరత కాదు. వైద్య కళాశాల ఖాతాలో రూ. 3.86 కోట్లున్నాయి. కేవలం చేతులు తడపలేదన్న ఏకైక కారణంతోనే బకాయిల విడుదలలో జాప్యం చేశారని రికార్డులు చూస్తే అర్థమవుతుంది. ఆన్‌లైన్‌లో కేవలం అయిదు నిమిషాల్లో పూర్తి కావలసిన నిధుల బదలాయింపు అయిదు నెలలు పట్టిందంటే లోపం ఎక్కడుందో యోగి ఆదిత్యనాథ్‌కు అర్థమై ఉండాలి. కానీ ఆయన సర్కారు కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించింది. సిలెండర్ల కోసం రాత్రింబవళ్లు తాపత్రయపడి కొందరు పిల్లల్ని రక్షించిన వైద్యుడు ఖఫీల్‌ఖాన్‌ను సస్పెండ్ చేసింది.

నిజానికి సమస్య యూపీకి లేదా గోరఖ్‌పూర్‌కూ పరిమితమైనది కాదు. దేశంలో ఇంచుమించు ప్రతిచోటా ప్రభుత్వాసుపత్రులు ఇలాగే అఘోరిస్తున్నాయి. ఆలనా పాలనా కరువై అవి మంచం పట్టాయి. రెండేళ్లక్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఐసీయూలో ఎలుకలు కొరకడంతో ఒక బాలుడు మరణిస్తే ఆ తర్వాత చీమలు కుట్టి మరో నవజాత శిశువు కన్నుమూసింది. ఆరోగ్య రంగాన్ని మన దేశం దారుణంగా నిర్లక్ష్యం చేస్తున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఆమధ్య హెచ్చరించింది. స్థూల దేశీయోత్పత్తిలో ప్రజారోగ్యానికి వెచ్చిస్తున్నది కేవలం 1.6 శాతం మాత్రమే. దీనికితోడు సిబ్బంది కొరత, తాత్కాలిక నియామకాలు, పర్యవేక్షణా లోపం, జవాబుదారీతనం లోపించడం సర్కారీ ఆస్పత్రులకు శాపంగా మారాయి. ఇవన్నీ సరిచేయకుండా చవకబారు చిట్కాలతో కాలక్షేపం చేస్తే గోరఖ్‌పూర్‌లు పునరావృతమవుతూనే ఉంటాయి.



రోగి ఉన్న గదిలో బాగా అవసరమైనది మనిషిని అర్థం చేసుకోగల శక్తి. అది, ఖరీదైన ఔషధాలంత విలువైనది.

– మార్టిన్ ఎఫ్. ఫిషర్
అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.నవమి ప.1.30 వరకు, తదుపరి దశమి నక్షత్రం రోహిణి రా.12.09 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం సా.4.40 నుంచి 6.10 వరకు, దుర్ముహూర్తం ప.11.40 నుంచి 12.29 వరకు అమృతఘడియలు రా.9.10 నుంచి 10.39 వరకు.

సూర్యోదయం	: 5.46	1.30 వరకు	
సూర్యాస్తమయం	: 6.24	యమగండం :	
రాహుకాలం :		ఉ.7.30 నుంచి	
ప 12.00 నుంచి		9.00 వరకు	

నమాజ్ వేళలు

ఫజర్	: 4.44	మగ్రీబ్	: 6.41
జొహర్	: 12.20	ఇషా	: 7.57
అసర్	: 4.48		

నైతికతకు పట్టం కట్టాల్సిన పోరు



దేవులపల్లి అమర్

నంద్యాల ఉపఎన్నికలో గెలవడానికి చంద్రబాబు ఇంత అవస్థ ఎందుకు పడుతున్నారు? ఆయనా, ఆయన మంత్రులు, అనుచరగణం కలసి వందలు, వేల కోట్ల రూపాయల పనులు చేస్తామని నంద్యాల ప్రజలను ప్రలోభ పెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? తన పాలన పట్ల ప్రజాభిప్రాయం ఎట్లా ఉందో ఆయన చేయించుకున్న సర్వేలే స్పష్టం చేశాయి మరి. ఏ మాత్రం వీలున్నా, ఎన్నికల కమిషన్ కూడా స్పీకర్ల వ్యవస్థ లాగా తన చెప్పుచేతల్లో నడిచేదే అయితే, తప్పకుండా ఆయన ఈ ఉపఎన్నికను జరగకుండా ఆపించి ఉండేవారు.

డేట్‌లైన్ హైదరాబాద్



నందమూరి తారక రామారావు 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించిన కొత్తలో కాంగ్రెస్ వాళ్లను తిట్టడానికి ఒక మాట వాడేవారు. ఆయనకు ఆ మాటంటే చాలా మోజు. పదే పదే వాడే వారు. జనానికి కూడా బాగా నచ్చింది. ఆయన నోటి వెంట ఆ మాట వచ్చిన ప్రతిసారీ సభ ఆవరణ అంతా ఈలలూ, చప్పట్లతో మార్మోగేది. కొన్ని వందల బహిరంగ సభల్లో ఆయన ఆ మాట వాడి ఉంటారు. రాజకీయాల్లో ఆ మాట బాగా ప్రసిద్ధి చెందింది కూడా ఆయన కారణంగానే. ఆ రోజుల్లో కాంగ్రెస్ వాళ్లను తిట్టడానికి ఆయన వాడిన ఆ మాట ''కుక్కమూతి పిందెలు''. రాజకీయాల్లో అక్కడక్కడ కుక్కమూతి పిందెలు మొలవడం సహజమే. కానీ, తాను స్థాపించిన పార్టీయే తరువాత కాలంలో, తన సొంత అల్లుడి నేతృత్వంలోనే కుక్కమూతి పిందెలకు నిలయం అవుతుందని మహానుభావుడు ఎన్టీ రామారావు ఊహించి కూడా ఉండరు. ఆయనే జీవించి ఉంటే తెలుగుదేశం పార్టీ ఇంకా ఆయన అదుపులోనే ఉంటే కచ్చితంగా ఈ కుక్కమూతి పిందెలను ఏరివేసే వారు, అది సాధ్యం కాదనుకుంటే పార్టీనే రద్దు చేసి ఉండేవారు. కొందరు ఆయన చర్యలను మూర్ఖత్వం కింద కొట్టిపారేసినా, నమ్మిన దానికోసం అధికారాన్నే తృణప్రాయంగా ఎడమ చేత్తో విదిలించి పారేసిన నాయకుడు ఎన్టీఆర్.

విలువలకు పట్టంగట్టిన నేత ఎన్టీఆర్

ఆయన రాజకీయ జీవితం కేవలం పద్నాలుగు సంవత్సరాలే. ఆ స్వల్ప కాలంలోనే ఆయన రెండుసార్లు అధికారం కోల్పోతానని తెలిసి కూడా తాను చెయ్యదల్చుకున్నది చేసేశారు. అంతే తప్ప, అధికారాన్ని కాపాడుకోవాలని, పట్టుకుని వేళ్లాడాలని కుక్క మూతి పిందెలను దరిచేరనివ్వలేదు. ఎన్నికల ముంగిట్లో నిలబడి కూడా మంత్రి వర్గాన్ని మొత్తంగా రద్దు చేసి పారెయ్యగలిగిన ధైర్యం ఆయనది. ఆ కారణంగానే ఆయన 1989లో అధికారం కోల్పోయారు. మళ్లీ 1995లో అదే జరిగింది. శ్రేయోభిలాషుల సలహా పాటించి ఒంటరిగా వైస్రాయ్ హోటల్‌లో చంద్రబాబు ఏర్పాటు చేసిన క్యాంప్‌కు వెళ్లి ఎంఎల్‌ఏలను కలసి ఉంటే అల్లుడి రాజకీయ జీవితం అక్కడితో ముగిసి ఉండేది. వైస్రాయ్ హోటల్ క్యాంప్ రాజకీయాలను ఒక ప్రధాన దినపత్రిక ముఖ్య విలేకరిగా ప్రత్యక్షంగా చూసిన జర్నలిస్ట్‌గా ఆ మాట కచ్చితంగా చెప్పగలను. విలేకరులం ఆ క్యాంప్‌లోని ఏ శాసన సభ్యుడిని కదిలించినా ఎన్టీ రామారావుకు ద్రోహం చేస్తున్నామన్న బాధ, ఆవేదన వారిలో స్పష్టంగా కనిపించేది.

ఒక్కసారి అన్నగారు క్యాంప్‌కు వచ్చి భరోసా ఇస్తే మూకుమ్మడిగా ఆయన వెంట బయటికి వెళ్లిపోయి ఉండేవారు ఎంఎల్‌ఏలు. ఎక్కువ మంది ఎంఎల్‌ఏలు క్యాంప్‌లో ఉండిపోయి చంద్రబాబు నాయుడుకు మద్దతు ఇవ్వడానికి కారణం ఎన్టీఆర్ శాసన సభ రద్దు కోసం గవర్నర్‌కు సిఫారసు చెయ్యబోతున్నాడనే ప్రచారాన్ని చంద్రబాబు బలంగా వ్యాపింప చెయ్యడమే. ఎన్టీఆర్ స్వయంగా, ఒంటరిగా వచ్చి, అట్లా చెయ్యబోనని ఒక్కమాట అని ఉంటే ఆ భరోసాతో వారు ఆయనతో వెళ్లి ఉండే వారు. చంద్రబాబు పని ఆనాడే ''ఖేల్ ఖతం దుకాన్ బంద్'' అయ్యుండేది. కానీ ఎన్టీఆర్ ఆ పని చెయ్యలేదు. అధికారం కోల్పోయారు. అయితేనేం విలువలకు కట్టుబడి ఉన్న పేరు నిలిచిపోయింది. అధికారం శాశ్వతం అనో లేదా అది శాశ్వతంగా తనకే ఉండాలనో కోరుకున్న వారు కాదు కాబట్టే ఎన్టీ రామారావు ఆ పని చెయ్యగలిగారు.

ఆయన చనిపోయి రెండు దశాబ్దాలు దాటినాక, ఆ విషయాలన్నీ జ్ఞాపకం చేసుకోవడం ఇప్పుడెందుకు? అని ఎవరయినా అడగొచ్చు. కర్నూలు జిల్లా నంద్యాల శాసనసభ స్థానానికి ఈ నెల 23వ తేదీన ఉప ఎన్నిక జరగనున్న సందర్భంగా... అటు అధికార పక్షం అయిన తెలుగుదేశం పార్టీ, దాని అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తలకిందులుగా చేస్తున్న విన్యాసాలనూ, ఇటు రాజకీయాల్లో విలువలను ముందుకు తీసుకుపోతానని చెప్పడమే కాదు, పాటించి చూపుతున్న ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, దాని అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ప్రచారాన్నీ పోల్చి చూస్తుంటే ఎన్టీఆర్ నడిపిన రాజకీయాలను గుర్తు చేసుకోవడం అవసరం అనిపించింది.

అధర్మ యుద్ధం సాగిస్తున్న అధికార పక్షం

ఎన్టీ రామారావు జీవించి ఉంటే జగన్‌మోహన్‌రెడ్డిని, శిల్పా చక్రపాణిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందించి ఉండేవారు. ఒక పార్టీ ద్వారా ఎన్నికై, ఇంకో పార్టీలోకి వెళ్లాలనుకునే వారు వారి పదవులకు రాజీనామా చెయ్యాల్సి ఉంటుందని పార్టీ పెట్టిన కొద్ది రోజులకే తిరుపతి మహానాడులో నిర్ణయించి, దానికి కట్టుబడనందుకు ఆదయ్య, నారాయణ వంటి వారిని పార్టీ నుండి బహిష్కరించారు. అలాంటి తన విగ్రహానికి మొక్కుబడిగా దండలు వేసి తన విధానాలను, విలువలను ఏట్లోకి విసిరేసిన నేటి తెలుగుదేశం పార్టీని, దాని ప్రస్తుత నాయకుడిని కచ్చితంగా ఛీత్కరించుకుని ఉండేవారు. ఎన్టీఆర్ కోరుకున్న విలువలను పాటిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో ఆయన చీదరించుకున్న, ద్వేషించిన కుక్కమూతి పిందెలతో నిండిన అధికార పక్షం చేస్తున్న అధర్మ యుద్ధాన్ని ఆయన ఎట్టి పరిస్థితుల్లో సమర్థించి ఉండేవారు కాదు.

తెలుగుదేశం పార్టీ ద్వారా సంక్రమించిన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేసి, దొంగ వేషాలూ దొడ్డి దారులూ వెతుక్కోకుండా, స్పీకర్ ఫార్మాట్‌లో ఆ రాజీనామాను సమర్పించి వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరిన చక్రపాణిరెడ్డి రాజీనామాను పది రోజుల్లో ఆమోదించారు. ఈ పని వైఎస్ఆర్ కాంగ్రెస్ నుండి ఫిరాయించి అధికార పక్షం పంచన చేరిన 21 మంది శాసన సభ్యుల విషయంలో ఎందుకు జరగలేదు. ఆ 21 మందిలో ఒకరు చనిపోయారు, ఆ కారణంగానే నంద్యాలకు ఉప ఎన్నిక అవసరం అయింది. మిగిలిన 20 మంది తమ పదవులకు రాజీనామాలు ఎందుకు చెయ్యలేదు? అందులో నలుగురు మంత్రివర్గంలో చేరిన పూటే రాజీనామాలు సమర్పించారని, అవి స్పీకర్‌కు అందాయని చివరి నిముషంలో చెప్పారు. అలాంటప్పుడు చక్రపాణిరెడ్డి రాజీనామాతో బాటు ఆ నలుగురి రాజీనామాలను కూడా ఆమోదించి ఉండాలి కదా, అదెందుకు జరగలేదు? చక్రపాణిరెడ్డి రాజీనామా ఆమోదంలో చూపిన వేగం, వారి విషయంలో ఎందుకు లేకుండా పోయింది? దీనికి సమాధానం చెప్పడం చాలా సులభం. ప్రజాభిప్రాయం, ప్రజాభిమతం, ప్రజామోదం ఎవరి వైపు ఉంటాయో వారికే నైతిక స్థైర్యం, ఆత్మ విశ్వాసం బలంగా ఉంటాయి. వారు ఏ నిర్ణయం అయినా నిబ్బరంగా తీసుకోగలరు. ఇప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు ఉన్నది, తెలుగుదేశం పార్టీకి లేనిది అదే. దివాలాకోరు రాజకీయాలను ప్రజలు క్షమించరు, తిరస్కరిస్తారు, బుద్ధి చెపుతారు కాబట్టి వీలయినంత కాలం పదవులు పట్టుకు వేళ్లాడుదామని చూసే వాళ్లనే ఎన్టీ రామారావు కుక్క మూతి పిందెలు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో గెలిచి పదవులు వీడకుండా అధికార పక్షం వైపు వలసపోయిన వాళ్లు ఆ కోవకు చెందిన వారే.

నంద్యాల కోసం ఎందుకిన్ని పాట్లు

అసలు చంద్రబాబు నాయుడు నంద్యాల ఉప ఎన్నికలో గెలవడానికి ఇంత అవస్థ ఎందుకు పడుతున్నారు? ఆయన అధికారంలోకి వచ్చాక మూడేళ్లు నంద్యాల వైపు తొంగి కూడా చూడని ఆయనా, ఆయన మంత్రివర్గ సహచరులూ, పార్టీ నాయకులూ, కిరాయికి తెచ్చిన వందలాది మంది నకిలీ కార్యకర్తలూ కలసి వందలు, వేల కోట్ల రూపాయల పనులు చేస్తామని నంద్యాల ప్రజలను ప్రలోభ పెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? నంద్యాలలో ఓడిపోతే చంద్రబాబు ప్రభుత్వం ఏమీ పడిపోదు. అదసలు ఆయన పార్టీ గెలిచిన స్థానమే కాదు. ఇదో ఉప ఎన్నిక, మేం చేసిన అభివృద్ధిని చూసి జనం ఓట్లేస్తారని, అభ్యర్థిని ప్రకటించి, ప్రచార బాధ్యతలను స్థానిక నాయకత్వానికి అప్పజెప్పి.. తాను ప్రభుత్వాన్ని నడిపే పని చెయ్యొచ్చు కదా! ఈ నెల మూడవ తేదీన జరిగిన బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు 2019లో జరగబోయే కురుక్షేత్ర యుద్ధానికి నంద్యాల ఉప ఎన్నిక ఫలితం నాంది అని చంద్రబాబు నాయుడికి బాగా తెలుసు.

అసలు ఉపఎన్నికలు రావడమే ఆయనకు ఇష్టం లేదు. తన పాలన పట్ల ప్రజాభిప్రాయం ఎట్లా ఉందోనని పలుమార్లు ఆయన స్వయంగా చేయించుకున్న సర్వేలు స్పష్టం చేశాయి, మరి. కానీ భూమా నాగిరెడ్డి హఠాత్తుగా చనిపోవడంతో, ఏదో సామెత చెప్పినట్టు చంద్రబాబు ప్రాణం మీదికి వచ్చింది. ఏ మాత్రం వీలున్నా, ఎన్నికల కమిషన్ కూడా స్పీకర్ల వ్యవస్థ లాగా తన చెప్పు చేతల్లో నడిచేదే అయితే, తప్పకుండా ఆయన ఈ ఉపఎన్నికను జరగకుండా ఆపించి ఉండేవారు. ఎన్నిక తప్పనిసరి కావడంతో ఆయన నంద్యాల ప్రజలకు చంద్రుడిని కూడా తెచ్చిస్తానని చెపుతున్నారు. అయితే నంద్యాలలో మకాం వేసిన మంత్రివర్యులంతా ''మరి చంద్రబాబు నాయుడు చంద్రుడిని సగం దూరం తెచ్చారు, మీరు ఈ ఉప ఎన్నికల్లో మమ్మల్ని గెలిపించకపోతే ఆ చంద్రుడు వెనక్కి వెళ్లి పోతాడు'' అన్నట్టు రోజా హెచ్చరికలు చేస్తూ వీధుల వెంట తిరుగుతున్నారు.

ఎవరు గెలిచినా ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమానంగా జరగాల్సిందే. ప్రతిపక్షాల నియోజకవర్గాలు అభివృద్ధికి, సంక్షేమానికి పనికి రావు అని మన రాజ్యాంగం చెప్పలేదు, చట్టాల్లో రాసి లేదు. అదే నిజమయితే అధికార పక్షం ఓడిపోయిన ప్రతి నియోజక వర్గమూ వెనకబడి పోవాల్సిందే కదా. నంద్యాల ప్రజలకు, ఆ మాట కొస్తే ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో ప్రజలందరికీ ఆ విషయం బాగా తెలుసు.

నిజానికి ప్రస్తుత నంద్యాల ఉపఎన్నికను మిగిలిన అన్ని అంశాలనూ పక్కన పెట్టి రాజకీయాల్లో నైతికత, అనైతికత మధ్య పోరాటంగా పరిగణించి ఓటర్లు తీర్పు చెప్పాలి.

datelinehyderabad@gmail.com

ఫిరాయింపులతో ఓటరుకు అవమానం

కొమ్మినేని శ్రీనివాసరావుతో టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు

ఒక పార్టీ తరపున పోటీ చేసి గెలిచాక అవతలి పార్టీ ఏదైనా ఆశ చూపితే పార్టీ మారిపోవడం అంటే ఎన్నికల ద్వారా ఓటరు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగపర్చడమే అవుతుందని టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేశ్ పేర్కొన్నారు. జనం మీకు ఓటేసి గెలిపిస్తే ఆ పార్టీకే పనిచేయాలి కాని పార్టీలు మారిపోవడం విలువల రాహిత్యానికే నిదర్శనం అన్నారు. నమ్మి ఓటేసిన ఓటరును అగౌరవపర్చటం రాజకీయ నేతలకు అలవాటు అయిపోయిందని విమర్శించారు. ధూమపానం కానీ, మద్యం కానీ, డ్రగ్స్ కానీ సినిమాలు రాకముందునుంచే సమాజంలో ఉన్నాయి కానీ సినీ పరిశ్రమ వల్ల అవి పెరగలేదని, ఏరంగంలో అయినా క్రమశిక్షణకే కెరీర్ ఉంటుందని, క్రమశిక్షణారాహిత్యానికి ఉండదంటున్న దగ్గుబాటి అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..



మీ తండ్రి రామానాయుడు బ్రాండ్‌కు తగినట్లుగానే మీరు ఎలా నడుస్తున్నారు?

చిన్నప్పుడు నాన్న ఇంజనీరింగ్ చదువుకోమని చెబితే కోర్సు పూర్తి చేశాను. అమెరికా నుంచి తిరిగొచ్చి ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకున్నాను. కానీ పెట్టలేకపోయాము. ఆ సమయంలోనే దేవత సినిమా షూటింగ్ జరుగుతుంటే స్టూడియోలో చేరిపోయాను. దాంట్లో పుంజుకున్నాను. నాన్నకు సహాయంగా ఉండేవాడిని. డెవలప్‌మెంట్, డబ్బింగ్ స్టూడియోలు పెట్టడంలో పాలు పంచుకున్నాను. ఈలోగా వెంకటేశ్ చదువు ముగించి అమెరికా నుంచి తిరిగొచ్చాడు. తనతో తీసిన బొబ్బిలి రాజా వంటి కొన్ని సినిమాలు బాగా ఆడాయి. ఇక బయటకు వెళ్లాలనే కోరిక కూడా లేకుండా పోయింది. స్టూడియోలు, ల్యాబ్‌లు ఇలా సినీరంగంలోనే సెటిలైపోయాను.

మీ తాజా సినిమా 'నేనే రాజు నేనే మంత్రి' గురించి చెబుతారా?

ఇది జోగేంద్ర అనే సాధారణ వ్యక్తి కథ. ఈ సమాజంలో ఉండే చెడువల్ల తన భార్యకు జరిగిన అన్యాయం వల్ల అతడు ఎలా రాజకీయాల్లోకి ప్రవేశించాడు? రాజకీయాల్లోకి వచ్చాక వాటిని ఎలా ఉపయోగించుకున్నాడు? ఎలా దుర్వినియోగపర్చాడు? తర్వాత అతడు తప్పు తెలుసుకుని ఎలా బయటికొచ్చాడు అనేదే ఈ సినిమా కథ. ఒక మంచి ఫ్యామిలీ అంటే భార్యా భర్త ద్వారా చెప్పిన కథ ఇది. ఈ పాత్రలు చాలా నిజాలను ఓపెన్‌గా మాట్లాడేస్తాయి. ఆ పాత్రల ద్వారా ఇవ్వాళ్టి రాజకీయనేతలందరినీ చూస్తాం. అలా అని ఎవరినీ ఏకలేదు. నేతలందరినీ చూస్తాం.

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారా?

ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కాదుగానీ, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉంటుందీ సినిమా. చాలామందికి చాలా కోపాలున్నాయి. ఒక పార్టీ తరపున పోటీ చేసి గెలుస్తున్నారు. అక్కడేదో ఆశ చూపిస్తే ఈ కండువా వదిలేసి ఆ పార్టీలోకి వెళుతున్నారు. ఇది సరైందా కాదా? జనం నీకు ఓటేసి గెలిపిస్తే ఆ పార్టీకే పనిచేయాలి. కానీ నువ్వేమో వేరేవాళ్లు అధికారంలోకి వచ్చారు అని చెప్పి అటు వెళ్లిపోతావు. అంటే ఎన్నికల ద్వారా వచ్చిన అధికారాన్ని నువ్వు దుర్వినియోగపరుస్తున్నావు. ఓటేసిన ఓటరును అగౌరవపర్చడం అలవాటు చేసుకున్నావు.

బాబుతో మీకు మంచి పరిచయం ఉంది కదా, తనతోనే నేరుగా చెప్పవచ్చు కదా?

చాలాసార్లు చెప్పానండి. మా నాన్న రాజకీయాల్లో చేరినప్పుడుగానీ రాజకీయ వ్యవస్థ ఇలా ఉంటుందని నాకు అసలు తెలీదు. డబ్బులిచ్చి ఓట్లు కొనుక్కుంటారనే విషయాలు నాకు షాక్ కలిగించేవి. అందుకే మా నాన్న ఎంపీ అయ్యాక ఒక్కరోజు కూడా నేను ఢిల్లీ వెళ్లలేదు. వెళ్లానంటే అధికారాన్ని నేను దుర్వినియోగం చేస్తానేమో అని ఆలోచించాను. బాపట్ల నియోజకవర్గ ప్రజలకు నాన్న సహాయం చేయాలి అంతే కాని ఇంజనీరింగ్ కాలేజీలు వస్తున్నాయి. మనం ఒకటి తీసుకుందాం అనే ఆలోచనలను కూడా నేను మనసులోకి రానివ్వలేదు.

> గ్రామాల్లో అన్ని సమస్యల మధ్య కొనసాగుతూ కూడా ప్రజలు చాలా పాజిటివ్‌గా బతుకుతున్నారు. గతంలో ప్రచారంలో భాగంగా కొన్ని ఊళ్లకు మేం వెళితే ఎన్టీఆర్‌ని చూసే మీకు ఓటేస్తాం అనేవారు తగిలారు. వాళ్లకు కనీసంగా రోడ్లు లేవు. టాయిలెట్లు లేవు. కానీ ఎప్పుడో ఒక చిన్న పని, సహాయం చేశారు అనే విషయాన్ని గుర్తుపెట్టుకుని వారు ఓట్లు వేసేస్తున్నారు. అలాంటివారిపట్ల మనకు ఎంత బాధ్యత ఉండాలి? అలాంటి ప్రజలను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలి అనిపిస్తుంది.

ప్రస్తుత రాజకీయాలను చూస్తే ఏమనిపిస్తుంది?

ఏమంత సంతృప్తిగా లేను. ప్రతి ఒక్కరూ రాజకీయాల్లో పోటీ చేసి అధికారం కావాలనుకుంటున్నారు. గెలిచి అధికారంలోకి వచ్చాక కొంతమేరకు పాలన చేస్తున్నారు కాని అది ఏమాత్రం సరిపోదు. ఆ మాత్రం సేవతోటే సంతోషపడే మనుషుల నుంచి ఓట్లు మళ్లీ పొందగలుగుతున్నారు. అందుకే రాజకీయనేతలు చేయాల్సింది చాలా ఉంది.

నాన్న పోటీ చేసినప్పుడు ప్రచారంలో మీకు ఏమనిపించింది?

బాగా తిరిగాను. చాలా వాస్తవాలను తెలుసుకున్నాను. నగరాల్లో మనం సుఖంగా ఉంటున్నాం. కానీ గ్రామాల్లో అన్ని సమస్యల మధ్య కొనసాగుతూ కూడా ప్రజలు చాలా పాజిటివ్‌గా బతుకుతున్నారు. కొన్ని ఊళ్లకు మేం వెళితే ఎన్టీరామారావుగారికి మేం ఓటేసినాం ఆయన్ను చూసే మీకు ఓటేస్తాం అనేవారు తగిలారు. ఆయనతో చాలా పాత జ్ఞాపకాలను వారు గుర్తు పెట్టుకున్నారు. వాళ్లకు కనీసంగా రోడ్లు లేవు. టాయిలెట్లు లేవు. కాని ఎప్పుడో ఒక చిన్న పని, సహాయం చేశారు అనే విషయాన్ని గుర్తుపెట్టుకుని వారు ఓట్లు వేసేస్తున్నారు. మనకు ఎంత రెస్పాన్సిబిలిటీ ఉండాలండీ.. అలాంటి ప్రజలను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలి అనిపిస్తుంది.

మనసులో మాట

ఏ ముఖ్యమంత్రి అంటే మీకు బాగా ఇష్టం?

ఎన్టీరామారావు, రాజశేఖరరెడ్డి ఇద్దరూ నిజమైన నాయకులు. నిర్ణయాలను వేగంగా తీసుకోవడంలో వీరిని మించిన వారు లేరు. అందుకే వారిలో నాయకత్వ లక్షణాలు ఉండేవి. ఆ నిర్ణయాలు మంచివా, చెడువా అనేది ముఖ్యం కాదు. వారిలో లీడర్‌షిప్ గుణం ఉండేది.

సినిమావల్ల సమాజానికి మేలు జరుగుతోందా.. కీడు జరుగుతోందా?

సమాజానికి చాలా కోణాలనుంచి చెడు జరుగుతోంది. ఒక్కసినిమా వల్లే మార్పు జరగదు. ఆడమ్ ఈవ్ వచ్చిన రోజునుంచి వద్దన్న దాని జోలికి వెళ్లడం మనిషికి అలవాటు అయిపోయింది. ప్రకృతి సహజంగానే మనిషికి అది అలవాటయిపోయింది. దొంగతనం, రేప్ వంటివి తప్పు అయితే అవి సినిమాలు రాకముందు నుంచే సమాజంలో ఉన్నాయి కదా. ధూమపానం హానికరం అని ప్రచారం చేస్తున్నాం. ఎంతమంది సిగరెట్లు తాగటం మానేశారు? తాగడం అనారోగ్యకరం అనే ఎరుక వచ్చింది కాని తాగడం మానలేకపోతున్నారు. ధూమపానం తప్పు అని ప్రభుత్వం నిజంగా గుర్తిస్తుంటే దాన్ని పూర్తిగా ఎందుకు బ్యాన్ చేయదు? మద్యం సరఫరా ఎందుకు ఆపేయదు? అందుకే మనం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాం. అభివృద్ధి అనే పేరుతోటి ఏది తప్పో దాన్ని మనం సమర్థిస్తూ వస్తున్నాం.

డ్రగ్స్ కేసులో చిత్ర పరిశ్రమ పాత్ర గురించి?


డ్రగ్స్ భూతాన్ని ఆపగలిగిన శక్తి ప్రభుత్వానికే ఉంది. దేశ సరిహద్దులు, కస్టమ్స్ శాఖను దాటి డ్రగ్స్ వస్తున్నాయి. దాన్ని ఆపలేకపోతున్నారు. కానీ అలా వచ్చిన డ్రగ్స్ చిన్న పిల్లల వద్దకు చేరుకోవడం చాలా బాధాకరమైన విషయం. చిన్నపిల్లలను డ్రగ్స్‌కు బానిసలుగా చేస్తూ.. వారిని జీవిత కాల కష్టమర్లుగా మార్చేస్తున్నారు.

మరి డ్రగ్స్ తీసుకున్నారంటున్నవారిపై మీ అభిప్రాయం?

వారు బాధితులే కానీ నేరస్తులు కాదండి. సినీ పరిశ్రమలో చిన్న ఘటన జరిగినా చాలా పెద్దగా ప్రచారం చేస్తారు. అది భరించాల్సిందే. క్రమశిక్షణా రాహిత్యాన్ని చిత్రపరిశ్రమ ఎన్నడూ సహించదు. ఎవరైనా తాగి సెట్‌లోకి వస్తేనే వారికి పని దొరకదు. ఇలాంటి వారిని తట్టుకోలేమని పంపించేస్తుంటాం. ఏ రంగంలో అయినా క్రమశిక్షణకే కెరీర్ ఉంటుంది, క్రమశిక్షణా రాహిత్యానికి ఎక్కడా కెరీర్ ఉండదు. డ్రగ్స్ తీసుకున్న వారి వల్ల షూటింగులో ఎవరికీ ఇబ్బంది కలిగి ఉండదు కాబట్టి వారి అలవాటువల్ల చిత్ర పరిశ్రమ ప్రభావితం కాలేదు.

(సురేశ్ బాబుతో ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకుల్లో చూడండి)
https://goo.gl/smJCxE
https://goo.gl/eoUu9E

రామ బాణం



శ్రీరామచంద్రుడిలో ఉన్న ముఖ్యమైన విశిష్టతలన్నీ త్యాగరాజస్వామి ఒక్క వాక్యంలో చెప్పారు. 'ఒక మాట, ఒక బాణం, ఒక పత్నీ వ్రతుడే, మనసా! ఒక చిత్తము కలవాడే! ఒక నాడను మరవకనే!' అన్నాడు.

రాముడిది ఒకే మాట. మాట మార్చటం, మాట తప్పటం ఆయన తత్వంలో లేదు. మాట చెప్తే మాత్రం అది శిలా శాసనమే! రాముడు రెండు మాటలు పలకడు అని మహర్షి వాల్మీకి చెప్పారు. అందుకే రాముడి మాటకు, రాముడి బాణం జంటగా వెంట నిలుస్తుంది.

రామాయణమంతా వెదికినా, రామబాణం నిజంగా రుచి చూసినవాళ్లు కొద్దిమందే కనిపిస్తారు. రుచి చూసిన తరువాత కూడా బతికి బట్టకట్టిన మారీచుడూ, కాకాసురుడూ లాంటి వాళ్లు మరీ అరుదు. అందుకే లోకజ్ఞుడైన సుగ్రీవుడు, మొదట రామ లక్ష్మణుల సౌందర్యాన్నీ, తేజస్సునూ, రాజ లక్షణాలనూ చూసి ఎంత చకితుడైనా, వాలిని వధించటం వారికి సాధ్యమౌతుందని రుజువు లేకుండా నమ్మలేదు. 'మాటలు సరే, చేతలు కూడా చూపమని నిర్మొహమాటంగా నిలదీశాడు. 'ఎదురుగా కనిపిస్తున్న ఏడు మద్ది చెట్లను నువ్వు ఒకే బాణంతో ఛేదిస్తే, నువ్వు వాలిని చంపగల సమర్థుడివని తెలిపోతుంది'– చిరునవ్వు నవ్వి రాముడు రామ బాణానికి పని చెప్పాడు. ఆ బంగారు బాణం క్షణంలో ఆ ఏడు మద్ది మొద్దులనూ ఛేదించి, ఆవల ఉన్న కొండ గుట్టలో నుంచి భూగర్భంలోకి దూసుకువెళ్లి, మళ్లీ మొక్కపోకుండా తిరిగి వచ్చి రాముడి తూణీరంలో చేరిపోయింది. ఎన్నడూ కనీ వినీ ఎరుగని ఆ 'శర' వేగం చూసి, సుగ్రీవుడే కాదు, ఆయన సైన్యమంతా రాముడికి 'దాసోహం' అనేశారు.

జ్యోతిర్మయం

రామబాణం అంటే– రామ నామాంకితమైన బంగారు బాణమే కానక్కర్లేదు. రాముడు శరశరుడు. రెల్లు పోచ బాణంగా వేయగలవాడు అరణ్యవాస సమయంలో ఒకనాడు, నిద్రిస్తున్న సీతమ్మను నిష్కారణంగా ముక్కుతో పొడిచి కాకి రూపంలో ఉన్న కాకాసురుడు పడిపోతుంటే, శ్రీరాముడు తాను కూర్చున్న దర్భచాపలో దర్భనొకదాన్ని మంత్రించి రామబాణంగా ప్రయోగిస్తాడు. ఇక ముల్లోకాలూ తిరిగినా కాకాసురుడిని రామబాణం నుంచి రక్షించగలవాళ్లు కనిపించరు. పశ్చాత్తాపంతో రాముడి కాళ్లముందే పడతాడు. ఆయన దయతో ఆ రామ బాణానికి తన కుడి కన్ను సమర్పించుకొని ప్రాణం దక్కించుకొంటాడు. మారీచుడూ, మద్దిచెట్లూ అనేమిటి మహా సముద్రం కూడా రామ బాణానికి భయపడి, దారికి వచ్చి, రామ సేనకు దారి వదులుతుంది.

అందుకే అసలు గొప్పతనం రాముడిదేముంది, రామ నామమూ, రామ బాణమూ గొప్పవి. ఆ రెంటివల్లా శ్రీరాముడు జగదానంద కారకుడయ్యాడు అని చమత్కరిస్తారు కొందరు గడుసరులు.

– ఎం. మారుతి శాస్త్రి

చుక్క నీరు లేకుండా జాతికి అంకితం

- ఎనిమిది నెలల్లోనే పురుషోత్తపట్నం ప్రాజెక్టును పూర్తి చేశామంటూ ముఖ్యమంత్రి గొప్పలు
- సీఎం ప్రారంభించాక రెండు మోటార్లను ఉత్తినే 35 నిముషాలపాటు నడిపించి ఆపేసిన అధికారులు
- పట్టిసీమ ఎత్తిపోతల తరహాలోనే.. పురుషోత్తపట్నం ఎత్తిపోతలనూ మళ్లీ మళ్లీ ప్రారంభించే ఎత్తుగడ
- సీఎం చంద్రబాబు వ్యవహారశైలిపై సాగునీటి నిపుణులు, జలవనరుల శాఖ అధికారుల విమర్శలు




ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు జాతికి అంకితం చేస్తుంటే.. మరోవైపు అసమగ్రంగా ఉన్న పైప్‌లైన్ పనులు, డెలివరీ పాయింట్ దగ్గర గోదావరి జలాల కోసం రైతుల ఎదురుచూపులు

సాక్షి, అమరావతి/సీతానగరం: స్వాతంత్ర్య దినోత్సవం రోజున పురుషోత్తపట్నం ఎత్తిపోతలను జాతికి అంకితం చేసి, లేని ఘనతను చాటి చెప్పుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో రియాలిటీ షోకు తెరతీశారు. ఎత్తిపోతల పనుల్లో తొలి దశలో పంప్ హౌస్, 220/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, 50.5 కిలోమీటర్ల పైపులైన్ పనులు, రెండో దశలో పంప్ హౌస్, 26.4 కిలోమీటర్ల పైపు లైన్, విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి కాలేదు. తొలి, రెండో దశలకు మోటార్లు అందుబాటులో లేవు. అయినా పట్టిసీమ ఎత్తిపోతలను ఏడాదిలోనే పూర్తి చేసి సృష్టించిన రికార్డును పురుషోత్తపట్నం ఎత్తిపోతలను తొమ్మిది నెలల్లోనే పూర్తి చేసి అధిగమిస్తామని చేసిన ప్రకటనను నిజం చేసుకోవడానికి కొత్త ఎత్తు వేశారు. గడువు ముగియడానికి మరో 19 రోజులే మిగిలి ఉండగా... తొలి దశలో రెండు పంప్ హౌస్‌లను తాత్కాలికంగా సిద్ధం చేశారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం పంప్ హౌస్ నుంచి రెండు మోటార్లను విడదీసి.. పురుషోత్తపట్నంకు తరలించారు. ఆదివారం ఓ మోటారు.. సోమవారం రాత్రి మరో మోటారును హడావుడిగా బిగించేశారు. తొలి దశలో ఐదు వరుసలకుగానూ ఒక వరుస పైపులైన్ ద్వారా 700 క్యూసెక్కులను పోలవరం ఎడమ కాలువలోకి ఎత్తిపోసి.. మంగళవారం పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. కానీ.. ఒక వరుస పైపులైన్ పనులు కూడా పూర్తి కాలేదు. పైపులైన్ నిర్మాణంలో లోపాలు బయటపడ్డాయి. మోటార్ల ద్వారా నీటిని తోడి పంపితే పైప్‌లైన్‌లో లోపాలు బయటపడతాయని గ్రహించి సరికొత్త డ్రామాకు తెరతీశారు. మంగళవారం మధ్యాహ్నం 2.25 గంటలకు 'ఉత్త' మోటార్లను ఆన్ చేశారు. పైపుల్లోకి గోదావరి జలాలు వెళ్లకుండా వాల్వ్ బంద్ చేశారు. 35 నిముషాలపాటు 'ఉత్త' మోటార్లనే నడిపించి.. సీఎం వెళ్లిపోయాక అంటే మధ్యాహ్నం మూడు గంటలకు ఆపేశారు. గోదావరి నీళ్లు వస్తాయని నాగంపల్లికి సమీపంలో డెలివరీ సిస్టర్న్ వద్ద గుమికూడిన రైతులు.. ఎంతకూ నీటి చుక్క జాడ కన్పించకపోయేసరికి విస్తుపోయారు. అంటే.. గోదావరి నుంచి చుక్క నీరు ఎత్తిపోయకుండానే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేసినట్లు స్పష్టమవుతోంది. వాస్తవం ఇలా ఉంటే, సీఎం చంద్రబాబు మాత్రం నిర్దేశించిన లక్ష్యం కన్నా ముందే అంటే.. తొమ్మిది నెలల్లో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును ఎనిమిది నెలల్లోనే పూర్తి చేశామంటూ గొప్పలు చెప్పడం గమనార్హం. కనీసం చుక్క గోదావరి నీటిని పోలవరం ఎడమ కాలువలోకి ఎత్తిపోయకుండానే.. ఏలేరు–గోదావరిలను అనుసంధానం చేసినట్లు ప్రకటించేశారు.

అచ్చం పట్టిసీమ తరహాలోనే..

పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు మళ్లించేందుకు రూ.1647 కోట్లతో చేపట్టిన పట్టిసీమ ఎత్తిపోతల పనులు కొలిక్కి రాక ముందే ఆగస్టు 15, 2015న ఒకసారి.. సెప్టెంబరు 16, 2015న మరో సారి సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేశారు.. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తయితే కాంట్రాక్టర్‌కు 16.99 శాతం బోనస్ ఇవ్వాలన్నది షరతు. ఈ క్రమంలో గోదావరిలో నీటి ప్రవాహం లేకున్నా మార్చి 29, 2016న మరో సారి పట్టిసీమను జాతికి అంకితం చేసి, కాంట్రాక్టర్‌కు బోనస్ ఇచ్చేసి కమీషన్‌లు తీసుకున్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం విషయంలోనూ అదే వ్యూహాన్ని చంద్రబాబు అనుసరిస్తున్నారు. పనులు అసంపూర్తిగా ఉండగానే పూర్తయినట్లు ప్రకటించి, మంగళవారం జాతికి అంకితం చేశారు. తర్వాత పనుల గడువును పొడగించేసి.. ధరల సర్దుబాటు కింద కాంట్రాక్టర్‌కు అదనపు లబ్ధి చేకూర్చి కమీషన్‌లు దండుకోవడానికి ప్లాన్ వేశారు. జగ్గంపేట మండలం రామాపురం వద్ద రెండో దశ ఎత్తిపోతలను ఒకసారి.. ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖకు నీటిని విడుదల చేసినపుడు మరోసారి, తొలి దశలో పంపులను పూర్తి స్థాయిలో బిగించినప్పుడు ఇంకోసారి ఇలా పదే పదే పురుషోత్తపట్నంను జాతికి అంకితం చేసి ప్రచారం చేసుకోవడానికి సీఎం చంద్రబాబు వ్యూహం రచించారు. ఇదంతా చూస్తుంటే... నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుగా సీఎం వ్యవహార శైలి ఉందని సాగునీటి రంగ నిపుణులు, అధికారులు విమర్శిస్తున్నారు.



పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ఫేజ్ వన్ మోటార్ల స్విచ్ ఆన్ చేస్తున్న సీఎం చంద్రబాబు

3 నెలల్లో 28 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- జగ్గంపేట సభలో సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తాం
- పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ప్రారంభించిన సీఎం

సాక్షి, రాజమహేంద్రవరం: వచ్చే మూడు నెలల్లో రూ.13 వేల కోట్లతో 28 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. జలసిరి పేరుతో ఇప్పటికే పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులను ఎంపిక చేశామని ప్రాజెక్టుల పేర్లు వెల్లడించారు. ఆయన మంగళవారం తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఒక్క మోటారు ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం అక్కడ విలేకరులతో, జగ్గంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. 40 ఏళ్ల తూర్పు గోదావరి జిల్లా రైతుల కల పురుషోత్తపట్నంతో నేటికి తీరిందన్నారు. బుధవారంలోగా పురుషోత్తపట్నం నుంచి ఏలేరు జలాశయంలోకి నీరు చేరుతుందని చెప్పారు. పురుషోత్తపట్నం వల్ల తూర్పుగోదావరిలో 2.15 లక్షల ఎకరాలకు సాగునీరు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు నీరు ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.40 వేల కోట్లు ఖర్చు చేశామని, ఈ ఏడాది మరో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. నెల రోజులపాటు 'జలసిరికి హారతి' పేరుతో నీటి వనరులున్న ప్రతి చోట హారతి ఇవ్వాలని పిలుపునిచ్చారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల ద్వారా రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం మినహా మిగతా 11 జిల్లాలకు లాభం చేకూరుతోందని చెప్పారు. అనుకున్న ప్రకారం రెండు ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తి చేశామన్నారు. 2018 నాటికి పోలవరం ప్రాజెక్టును నుంచి గ్రావిటీ ద్వారా నీరు ఇస్తామని, 2019కి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు. కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసిన చరిత్ర టీడీపీకే చెందుతుందని తెలిపారు. పట్టిసీమ నుంచి ఈ ఏడాది 38 టీఎంసీల నీరు కృష్ణాకు తీసుకెళ్లామని చెప్పారు.

రాష్ట్ర విభజనలో హేతుబద్ధత లేదని, కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందని ఆరోపించారు. కట్టుబట్టలతో నెత్తిన అప్పు పెట్టుకుని హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చామన్నారు. చరిత్ర ఏపీని మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాపులకు ఇచ్చిన హామీని అమలు చేసి తన నిజాయతీని నిరూపించుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, కిమిడి కళా వెంకట్రావు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

70 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా దళితులపై దాడులా!

దళిత హక్కుల సమాఖ్య కన్వీనర్ కొత్తపల్లి

సీతంపేట (విశాఖ ఉత్తరం): భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా ఇంకా దళితులపై దాడులు జరుగుతుండటం దారుణమని దళిత హక్కుల సమాఖ్య కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. 'దళితులకు రక్షణ లేని స్వాతంత్ర్యం మాకెందుకు' అంటూ విశాఖపట్నంలోని అంబేడ్కర్ భవన్‌లో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. గో సంరక్షణ పేరుతో దళితులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లను అనుభవిస్తున్నారేగాని, దళితులపై దాడులు జరిగినప్పుడు మాత్రం ఎవరూ అండగా నిలవట్లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దళితులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు సుర్ల జయవర్మ, కాళ్ల నాగభూషణం, జి.రామారావు, బోనెల వాసు, బొబ్బాది అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరు

నంద్యాల ప్రచారంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

నంద్యాల అర్బన్ : నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి గెలుపును ఆపడం ఎవరితరమూ కాదని ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నంద్యాల ప్రజలు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ వైపే నడుస్తున్నారని, ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నంద్యాల మండలం అయ్యలూరు మెట్టలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల సాయి కల్పనతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు, ఇబ్బందులు పెట్టినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేదన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చని చంద్రబాబు మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. పార్టీ శ్రేణులు మెజారిటీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బసవేశ్వర రెడ్డి, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామా ఆమోదం

- సోమవారమే రాజీనామా ఆమోదం ఫైలుపై సంతకం
- సెలవు రోజు కావడం వల్ల బులెటిన్ విడుదల చేయని అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయం
- విలువల కోసమే పార్టీ వీడుతూ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన శిల్పా

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతూ కర్నూలు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవికి శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన రాజీనామాను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బాధ్యతల్లో ఉండి యాక్టింగ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న రెడ్డి సుబ్రమణ్యం ఆమోదించారు. రాజీనామా ఆమోదానికి సంబంధించిన ఫైలుపై మండలి డిప్యూటీ చైర్మన్ సోమవారమే సంతకం చేశారు. అసెంబ్లీ కార్యాలయ సిబ్బందికి వరుస సెలవు రోజులు కావడంతో రాజీనామాకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా బులెటిన్‌ను మాత్రం జారీ చేయలేదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న సందర్భంగా ఈ నెల 3వ తేదీన శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజకీయాల్లో ఉదాత్తమైన విలువలను కాపాడాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన సూచన మేరకు నైతిక విలువలకు కట్టుబడి తన పదవిని వదులుకుంటున్నట్టు శిల్పాచక్రపాణిరెడ్డి ప్రకటించారు. కేవలం పదిరోజుల్లోనే ఆయన రాజీనామాను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఆమోదించారు.

నైతిక విలువలు పట్టని ఫిరాయింపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏమాత్రం రాజకీయ విలువలకు కట్టుబడకుండా పదవిలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మొన్నటి సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేసి గెలిచిన 21 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఒకరు విడతలు వారీగా టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. పార్టీ మారిన వారిలో ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి మరణించగా, ఆయన ప్రాతినిధ్యం వహించిన నంద్యాల నియోజకవర్గానికి ఇప్పుడు ఉప ఎన్నిక జరుగుతోంది. కాగా, మిగిలిన 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఒకరు పార్టీ మారినప్పటికీ వైఎస్సార్‌సీపీ ద్వారా గెలుచుకున్న పదవుల్లోనే కొనసాగుతున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు టీడీపీ సర్కారు ఏకంగా మంత్రి పదవులు కట్టబెట్టడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. మరోవైపు పార్టీ ఫిరాయించి కూడా వారి పదవుల్లో కొనసాగుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై చర్య తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ పార్టీ శాసనసభాపక్షం దాఖలు చేసుకున్న పిటిషన్లు నెలల తరబడి సుదీర్ఘ కాలం పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయి. ఒకవైపు వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్లపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన జరుగుతుండగా.. మరోవైపు విలువలకు కట్టుబడిన శిల్పా చక్రపాణి రాజీనామా ఆమోదం పొందడం గమనార్హం.



మహిళలకు డబ్బులు పంచుతున్న టీడీపీ కార్యకర్త

జగన్ రోడ్ షోకు వెళ్లకుండా డబ్బుల పంపిణీ

సాక్షి బృందం, నంద్యాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న రోడ్‌షోలకు జనాన్ని రాకుండా అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మంగళవారం జననేత రోడ్‌షో బొమ్మలసత్రం, నూనెపల్లె ఫ్లైఓవర్, కోవెలకుంట్ల జంక్షన్, బొగ్గులైన్, మూలసాగరం తదితర ప్రాంతాల్లో కొనసాగింది. అయితే ఆయా ప్రాంతాల్లో రోడ్ షోకు జనాలు రాకుండా చేసేందుకు టీడీపీ నేతలు కుయుక్తులు పన్నారు. 1000 నుంచి 1500 మందిని ప్రచారం పేరుతో తీసుకొచ్చి చామ కాలువ సమీపంలోని టీడీపీ కార్యాలయంలో ఉంచారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉండాల్సి రావడంతో మహిళలకు ఓపిక నశించి తిరగబడ్డారు. తమకు కూలి ఇవ్వాలని గొడవకు దిగారు. దీంతో చేసేదేమిలేక ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు టీడీపీ నాయకులు ఒక్కొక్కరికి రూ.250 కూలి ఇచ్చి పంపించారు.

విలువలు, విశ్వసనీయత కాపాడేందుకే రాజీనామా

- వైఎస్సార్‌సీపీ నేత శిల్పా చక్రపాణిరెడ్డి
- రాజీనామా ఆమోదించినందుకు ధన్యవాదాలు
- జగన్ రోడ్‌షోకు వెళ్లొద్దంటూ కూలి ఇచ్చి ఆపుతున్నారు
- జెండాలు లేకుండా బీజేపీతో ప్రచారం చేయించుకుంటున్నారు



ఎన్నికల బృందం, నంద్యాల: 'ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలోకి చేరే సమయంలో ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత కాపాడాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. దీంతో నేను వెంటనే తెలుగుదేశం పార్టీ తరఫున గెలుపొందిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాను' అని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ పదవికి తాను చేసిన రాజీనామాను ఆమోదించినందుకు మండలి వైస్ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నైతిక విలువలకు నిలబడే పార్టీ అయితే అందులో చేరిన 21 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామాను ఆమోదించిన తరువాతనే ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. దేశంలో ఎక్కడా, ఎప్పుడూ జరగని విధంగా ప్రత్యర్థుల మీటింగ్‌లకు, రోడ్‌షోలు చూసేందుకు వెళ్లవద్దని నంద్యాల ఉప ఎన్నికలో అధికార పార్టీ కొత్త ఒరవడికి తెర తీసిందని ధ్వజమెత్తారు. సమావేశానికి వెళ్లకుండా కూలి ఇచ్చి వారిని ఊరికే రోడ్ల వెంట తిప్పడం, పార్టీ కార్యాలయంలో కూర్చోబెట్టడం వంటివి చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ, బీజేపీలు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వీట్లు పంచుకుంటూ కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారని, నంద్యాలలో మాత్రం పొత్తులేదంటూ ముస్లిం మైనార్టీలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ నాయకులతో జెండాలు, కండువాలు లేకుండా ప్రచారం ఎందుకు చేయించుకుంటున్నారో ముస్లిం మైనార్టీ సోదరులకు జవాబు చెప్పాల్సి ఉందన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడే స్వభావం తమకు ఎన్నటికీ లేదని, రాయలసీమ యాసలో మాట్లాడిన మాటలకు టీడీపీ లేనిపోని రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. మూడేళ్లలో నంద్యాలను అభివృద్ధి చేసి ఉంటే ఉప ఎన్నికలకు ఇంత ఖర్చు పెట్టి, ఇంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఇక్కడే ఎందుకు ఉండాల్సి వస్తోందని ప్రశ్నించారు.


ప్రలోభాలు.. దౌర్జన్యాలు

- నంద్యాలలో బరితెగించిన టీడీపీ నేతలు, మంత్రులు
- ప్రచారం చేయాలని డ్వాక్రా సంఘాలపై ఒత్తిడి
- మాట వినని వారిపై కక్ష సాధింపు

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి: నంద్యాల ఎన్నికలో ఓటమి భయం వెంటాడుతుండడంతో టీడీపీ నేతలు ప్రలోభాలకు, దౌర్జన్యాలకు తెరతీశారు. మాట వినని వారిని బెదిరించేందుకు ఏకంగా మంత్రులే రంగంలోకి దిగారు. తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుంటూ భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులు పాలనను పక్కన పెట్టి నంద్యాలలో తిష్ట వేసి ఓటర్లను రకరకాల ప్రలోభాలకు గురిచేస్తున్నారు. టీడీపీ తరఫున ప్రచారానికి వెళ్లకపోయినా, ఓటు వేయరని తెలిసినా కక్ష సాధింపులకు దిగుతున్నారు. తమ అభ్యర్థి తరఫున ప్రచారం చేయని డ్వాక్రా సభ్యులను పిలిపించుకుని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నంద్యాల పట్టణంలోని ప్రాంతాల వారీ ఓటర్లకు చెందిన పూర్తి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేసుకున్నారు. దాని ఆధారంగా టీడీపీకి ఓటు వేయరని తెలిసిన వారిని గుర్తించి.. వారి ఫోన్ నంబర్లు తీసుకుని మంత్రులకు ఇస్తున్నారు. అలాంటి వారికి మంత్రులు ఫోన్ చేసి.. రకరకాలుగా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. టీడీపీకి ఓటు వేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు.

తెల్ల పేపర్‌పై సంతకాలు

టీడీపీ అభ్యర్థి కోసం ప్రతి వార్డులో ఇంటికొకరు ప్రచారానికి రావాలని హుకుం జారీ చేశారు. రాని వారితో తెల్ల కాగితంపై సంతకం తీసుకుంటున్నారు. 18వ వార్డుకు చెందిన ఓ మహిళ అనారోగ్య కారణాలతో ప్రచారానికి రాలేనని చెప్పింది. ఆమె మాట వినిపించుకోని టీడీపీ బృందం తెల్ల పేపర్‌పై సంతకం తీసుకుంది. ఎందుకు సంతకం తీసుకుంటున్నారని అడగ్గా.. 'మీ కుటుంబమంతా టీడీపీ తరఫున ప్రచారం చేయాలి. అలాగే ఓటేయాల'ని బెదిరించినట్లు ఆమె కన్నీరు పెట్టుకున్నారు. సైకిల్‌కు ఓటేసినట్లు నమ్మితేనే సంతకం చేసిన పేపర్‌ను చించేస్తామని హెచ్చరించినట్లు ఆమె తెలిపారు. ఇది తెలిసిన స్థానికులు ఇదేమి బరితెగింపు అని వాపోతున్నారు.



2014 ఎన్నికల ట్రిక్స్ అమలు

గత సాధారణ ఎన్నికల్లో పక్క జిల్లాకు చెందిన కొందరిని నియమించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కావాలనే దుష్ప్రచారం చేయించారు. అదే తరహాలో నంద్యాల ఉప ఎన్నికలోనూ వైఎస్ జగన్‌తో పాటు అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయించడం మొదలుపెట్టారు. అందులో భాగంగా ఇతర జిల్లాలకు చెందిన టీడీపీ మద్దతుదారులు నంద్యాలకు వచ్చారు. వారు టీ కొట్లు, హోటళ్లు.. ఇలా పదిమంది గుమిగూడే ప్రాంతాలకు చేరుకుని వైఎస్సార్‌సీపీ, అభ్యర్థి పట్ల తప్పుగా చర్చించడం మొదలుపెడతారు. వైఎస్సార్‌సీపీ నేతలను తిడుతూ.. అక్కడ ఉండే స్థానిక ఓటర్లను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

స్వతంత్ర అభ్యర్థులకు డబ్బు ఎర!

నంద్యాల ఉప ఎన్నిక బరిలో మొత్తం 12 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. వీరిలో కొందరు వారి సామాజిక వర్గాలకు చెందిన వారిని వెంటబెట్టుకుని ప్రచారం చేస్తుండటంతో టీడీపీ ఓటు బ్యాంకుకు గండిపడే అవకాశం ఉందని గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన మంత్రులు.. స్వతంత్ర అభ్యర్థులను ఒక్కొక్కరినీ తాము బసచేసిన హోటల్‌కు పిలిపించుకుంటున్నారు. టీడీపీ తరఫున ప్రచారం చేయాలని ఒత్తిడి చేశారు. ఇందుకోసం కొందరు అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.



టీడీపీ అభ్యర్థి తరఫున మంత్రి శిద్ధా ప్రచారం

నూనెపల్లె (నంద్యాల): నంద్యాలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తరఫున మంత్రి శిద్ధా రాఘవరావు మంగళవారం ప్రచారం చేశారు. ఆయన 34వ వార్డులో పర్యటించి..ఓట్లు అభ్యర్థించారు. టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట పార్టీ నేత అంబికాకృష్ణ తదితరులు ఉన్నారు.




నంద్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

నూనెపల్లె (నంద్యాల): నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం అబ్దుల్ ఖాదర్ మంగళవారం నంద్యాలలోని వివిధ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు హయాంలో దళితులపై పెరిగిన దాడులు

వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ ధ్వజం



నంద్యాల వ్యవసాయం: చంద్రబాబు పాలనలో దళితులపై దాడులు పెరిగాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాల పట్టణంలో దళిత న్యాయవాది సుబ్బరాయుడు టీడీపీలో చేరలేదనే నెపంతో ఇష్టమొచ్చినట్లు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో దళితుల భూములు లాక్కున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబు దళిత, గిరిజన ద్రోహి అని మండిపడ్డారు. ఆయన వల్ల దళితులకు నిలువ నీడ లేకుండా పోతోందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన రూ.వేలకోట్లను దారి మళ్లించారన్నారు. దళితులను ఓట్లు అడిగే హక్కు ఆయనకు లేదన్నారు. దళితులకు అన్యాయం జరుగుతుంటే చంద్రబాబు దగ్గర ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులెవరూ ప్రశ్నించడం లేదన్నారు. టీడీపీ నాయకులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని దళితులకు పిలుపునిచ్చారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే దళితులు, గిరిజనులకు పెద్దపీట వేస్తారన్నారు. జూపూడి ప్రభాకర్ కళ్లులేని కబోదని, అందుకే దళితులకు అన్యాయం చేసినా చంద్రబాబు చెప్పులు నాకుతున్నాడని దుయ్యబట్టారు. నంద్యాల ఉప ఎన్నికలో శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత దళితులపై ఉందన్నారు.

అసెంబ్లీ, సచివాలయాల్లో ఘనంగా వేడుకలు



అసెంబ్లీభవనంలో జాతీయపతాకావిష్కరణ అనంతరం వందనం చేస్తున్న స్పీకర్ కోడెల

సాక్షి, అమరావతి: శాసనసభ, శాసనమండలి, సచివాలయాల్లో 71వ స్వాతంత్ర్యదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 7.45 నిమిషాలకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం జాతీయ జెండాను ఆవిష్కరించగా, 8.15 నిమిషాలకు శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో శాసనసభ స్పెషల్ సెక్రటరీ పీపీకే రామాచార్యులు, పూర్వ కార్యదర్శి కె. సత్యనారాయణ, శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు. సచివాలయంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ లింగరాజు పాణిగ్రాహి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

యువశక్తిని వినియోగించుకోవాలి: స్పీకర్

యువశక్తిని, మానవవనరులను సరైన రీతిలో వినియోగించుకుంటే దేశం అద్వితీయమైన శక్తిగా ఎదుగుతుందని స్పీకర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత మూడేళ్లలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. శాసనమండలి, శాసనసభ శాశ్వత భవనాల నిర్మాణానికి సంబంధించి సభ్యుల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి పిలిచి అవమానం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే రాజేశ్వరి ఆవేదన



రంపచోడవరం: రాజ్యాంగపరంగా స్వాతంత్ర్య దినోత్సవం నాడు నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే హోదాలో తాను జెండా ఎగురవేయాల్సి ఉండగా అధికారులు తన హక్కును కాలరాసి, అవమానించారని తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం స్వాతంత్ర్యదిన వేడుకలు జరిగాయి. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మధ్యలోనే బయటకు వచ్చేశారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిచోటా నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యులే జెండాను ఎగురవేస్తుండగా రంపచోడవరంలో మాత్రం అధికారులు ఎందుకు భిన్నంగా వ్యవహరిసున్నారని నిలదీశారు. కేవలం గిరిజన మహిళ కావడం వల్లే అధికారులు తనపై చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ అధికారులు తన పట్ల వ్యవహరించిన తీరుపై రాష్ట్ర శాసన సభాపతికి, శాసన సభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. ఎమ్మెల్యేను పక్కన పెట్టి ఐటీడీఏ పీవో జాతీయ జెండాను ఎగుర వేసిన అంశంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని కోరారు. ఎమ్మెల్యేనైన తననే అధికారులు అవమానిస్తే సామాన్య ఆదివాసీ మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గతంలోనూ తన పట్ల ఇలాగే వ్యవహరించారని గుర్తు చేశారు. ఐటీడీఏలోని ప్రోటోకాల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాజేశ్వరి డిమాండ్ చేశారు.

వచ్చే ఏడాది విద్యుత్ చార్జీలు పెంచం: ట్రాన్స్‌కో

విజయవాడ విద్యుత్ సౌధలో తొలిసారి స్వాతంత్ర్య వేడుకలు



విజయవాడలోని విద్యుత్ సౌధలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్

సాక్షి, అమరావతి: వచ్చే సంవత్సరం విద్యుత్ చార్జీలు పెంచకుండా ఉండేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్ తెలిపారు. అవసరమైతే చార్జీలు తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకనుగుణంగా విద్యుత్ సంస్థల్లో వ్యయ నియంత్రణకు అడుగులేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ విద్యుత్ సౌధలో తొలిసారిగా 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విజయానంద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యుత్ సిబ్బందిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించేందుకు సిబ్బంది చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. 100 శాతం విద్యుద్దీకరణలో రాష్ట్రం జాతీయ స్థాయిలో రెండో స్థానంలో ఉందన్నారు. భవిష్యత్‌లో పవన, సౌర విద్యుదుత్పత్తికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి, ఇంధనశాఖ సలహాదారు రంగనాథం, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, నాగరాజస్వామి, సుందర్‌సింగ్, ఆదినారాయణ, అప్పారావు, ఇంధన పొదుపు సంస్థ సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెండాను దించి.. మళ్లీ ఎగరేశారు

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాకు అవమానం

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు వేదికగా మారాయి. జాతీయ పార్టీ అని ఘనంగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను అవమానించారు. ఎగురవేసిన జాతీయ జెండాను దించేసి మరో నేత వచ్చాక మళ్లీ ఎగరేశారు. ఒకే జాతీయ జెండాను రెండు సార్లు ఎగురవేయడంతో పాటు రెండు సార్లు జాతీయ గీతాన్ని ఆలపించడం చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసే బాధ్యతను పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.జె.రత్నకుమార్‌కు అప్పగించారు. అయితే పీసీసీ ప్రధాన కార్యదర్శి టీజేఆర్ సుధాకర్ తన అనుచరులతో వచ్చి అప్పటికే కార్యాలయంలో సిద్ధంగా ఉంచిన జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించి వెళ్లిపోయారు. దీనిపై పార్టీ కార్యాలయంలో ఉన్న నాయకులు చర్చించుకుంటున్న సమయంలో పీసీసీ అధికార ప్రతినిధి నిమ్మల జ్యోతికతోపాటు ఇతర మహిళా నేతలు అక్కడికి చేరుకున్నారు. తాము వచ్చేలోగానే జాతీయ పతాకాన్ని ఎలా ఎగుర వేస్తారంటూ ప్రశ్నించారు. అప్పటికే ఎగురవేసిన జెండాను కిందికు దించి అదే జాతీయ జెండాను తిరిగి ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ పరిణామాల గురించి నేతలు నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో ఉన్న పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డికి వివరించారు. ఒకే జెండాను రెండుసార్లు ఎగురవేయడంపై పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనసేన కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు



సాక్షి, హైదరాబాద్: 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మంగళవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితగాథలు చదవడం ద్వారా తానెంతో స్ఫూర్తి పొందానని పవన్‌కల్యాణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు



సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలకు తొలుత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి జీఆర్ రవీంద్ర రాజు, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజి, రాష్ట్ర పదాధికారులు వై.సీతాదేవి, నేతలు ఇంతియాజ్ అలీ, సీహెచ్ రామకోటయ్య, యు.శ్రీనివాసరాజు, లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

జన నీరాజనం



వేలాదిమంది ఒక్కచోట చేరి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటే ఆ ఆనందమే వేరు. మంగళవారం కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూడబిద్రెలో ఆల్వాస్ విద్యాలయంలో జరిగిన స్వరాజ్య సంబరాల్లో పాల్గొన్న వేలాదిమంది విద్యార్థులు. – బెంగళూరు

జయహో.. ఇండియా



విశాఖలో రెండువేల అడుగుల మువ్వన్నెల పతాకం మురిపించింది. 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ 66వ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ రెండువేల అడుగుల మువ్వన్నెల జెండాను రూపొందించారు. మంగళవారం గోపాలపట్నం బీఆర్‌టీఎస్ కారిడార్ పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి ఎన్‌ఏడీ జంక్షన్ వరకూ భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకను వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం

స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబునాయుడు



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, ప్రక్కన డీజీపీ సాంబశివరావు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: గత ఎన్నికల్లో తానిచ్చిన హామీలనన్నింటినీ నెరవేర్చానని, సంక్షేమ పథకాలను సమర్థవంగా అమలుచేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. రైతు రుణమాఫీతోపాటు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకున్నామన్నారు. తిరుపతి తారకరామా స్టేడియంలో మంగళవారం ఉదయం 71వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రమంతా దేశభక్తి స్ఫూర్తి రగిలించేందుకే స్వాతంత్ర్య వేడుకలను వివిధ జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే రూ.7వేల పింఛన్‌ను రూ.15 వేలకు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పారు.

రాష్ట్ర పండుగగా ఏరువాక

రాష్ట్రమంతా ఈనెల 25 నుంచి 30 వరకూ 'జలసిరికి హారతి' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నామనీ, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని అభివృద్ధిపరిచేందుకు టెక్నాలజీని వాడుతున్నామని.. హార్టికల్చర్, పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇకపై ఏటా ఏరువాక పౌర్ణమిని రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు సంకల్పించామన్నారు. కేంద్రం తన హామీలను నిలబెట్టుకుంటూ రాష్ట్రానికి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. హైదరాబాద్‌లోని ఉమ్మడి ఆస్తులపై కోర్టు ద్వారానైనా మనకు న్యాయం జరిగేలా చూస్తానని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంత పేదల కోసం 12.50 లక్షల పక్కా ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. కాగా, రాష్ట్రంలో రెండు నెలల్లో నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని వెల్లడించారు. ఇందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించామన్నారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడం ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. విజయ దశమిలోగా రాష్ట్రమంతా ఎంపిక చేసిన పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు. నీటి సంరక్షణ మనందరి బాధ్యత అంటూ, శ్రీశైలానికి ఇప్పటివరకూ నీళ్లు రాలేదనీ.. మహారాష్ట్ర, కర్నాటక, కొత్తగా తెలంగాణ రాష్ట్రాలు నీళ్లు వదలడంలేదన్నారు. ఇందుకోసం నదుల అనుసంధానం అవసరమన్నారు. 2018 నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తామనీ, మరుసటి ఏడాది ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పారు. రానున్న మూడు నెలల్లో రాష్ట్రంలోని 28 ప్రాజెక్టులను పూర్తిచేసి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చంద్రబాబు అన్నారు.

ఉత్తమ సేవలకు పతకాలు...

ఈ సందర్భంగా 63 మందికి ఇండియన్ పోలీస్ మెడల్స్, ఏడుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవా పురస్కారాలు, మరో 22 మంది ప్రభుత్వోద్యోగులకు ప్రోత్సాహక పురస్కారాలను ప్రదానం చేశారు. ఏపీఎస్పీ ఐజీ ఆర్‌కే మీనా పర్యవేక్షణలో పోలీస్ కానిస్టేబుళ్లు నిర్వహించిన బైక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని తెలిపే 12 శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. కాగా, రాష్ట్ర అటవీ శాఖ శకటానికి ప్రథమ బహుమతి, జలవనరులు, విద్యాశాఖలకు ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. టీటీడీ రూపొందించిన శ్రీవారి వైభవ శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, డీజీపీ నండూరి సాంబశివరావు, మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, పరిటాల సునీత, కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.



మొదటి బహుమతి అందుకున్న అటవీశాఖ శకటం



వేడుకల్లో ఆకట్టుకున్న టీటీడీ శకటం



తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో 71వ స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు అందుకున్న పోలీసు అధికారులతో సీఎం చంద్రబాబు, చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్, డీజీపీ సాంబశివరావు

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రజలే ఉద్యమించాలి

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్యదిన వేడుకలు



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎంపీ మేకపాటి, తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో అడుగంటిపోతున్న ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు కంకణబద్ధులై ఉద్యమించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మార్గం ఏదైనా ఫలితమే ముఖ్యమని భావించే నేతలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నియంతృత్వ పాలనను తాము అంగీకరించమని, ప్రజాస్వామ్య పాలననే స్వాగతిస్తామని ప్రజలే చాటిచెప్పాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం 71వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మువ్వన్నెల జెండాను ఎగురవేసిన మేకపాటి దేశభక్తుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సాధన కోసం గాంధీ, నెహ్రూ, పటేల్, సుభాష్ చంద్రబోస్, తిలక్, అల్లూరి సీతారామరాజు వంటి ఎంతోమంది మహనుభావులు అనేక త్యాగాలు చేశారని గుర్తుచేశారు. అటువంటి త్యాగధనులను స్మరించుకోవడం భారత పౌరులుగా మన కర్తవ్యమన్నారు. భారత్ గొప్ప ప్రజాస్వామ్య విలువలున్న దేశమని, ఈ విలువలతోనే ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయని, అరాచకాలతో ప్రజాస్వామ్యం మంటగలిసిపోతున్న తీరు ప్రతి నిత్యం చూస్తున్నామన్నారు. ఈ తరహా వైఖరిని ప్రజలు ఏనాడూ కోరుకోవడం లేదన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా ఏ వ్యక్తికీ రాజకీయ స్వాతంత్ర్యం ఉండదని, కాబట్టి ప్రజలను ఆర్థిక స్వావలంబన వైపు తీసుకెళ్లేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో మంటగలిసి పోతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు పీఎన్‌వీ ప్రసాద్, జె.మహేందర్‌రెడ్డి, కె.శివకుమార్, అధికార ప్రతినిధులు వాసిరెడ్డి పద్మ, పద్మజ, గ్రేటర్ హైదరాబాద్ నగరశాఖ అధ్యక్షుడు బొడ్డు సాయినాథ్‌రెడ్డి, నేతలు వెల్లాల రాంమోహన్, ఎన్.రవికుమార్, బి.మోహన్‌కుమార్, విశ్వనాథాచారి, పి.బాలకృష్ణారెడ్డి, కేసరి సాగర్, ఎం.శైలజా చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

త్యాగధనుల స్ఫూర్తితో ముందుకుసాగాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



కాకినాడలో జాతీయపతాకావిష్కరణ అనంతరం వందనం చేస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

కాకినాడ: స్వాతంత్ర్య సముపార్జన కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయి రెడ్డి పిలుపునిచ్చారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆనాటి త్యాగధనుల స్ఫూర్తితో అభివృద్ధికి పునరంకితం కావాలని, అయితే దురదృష్టవశాత్తు కులం, మతం పేరుతో ప్రస్తుతం రాజకీయాలు నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించాక శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించగలిగామన్నారు. ఇందుకు తోడ్పడిన వారందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలను ప్రజలకు చేరువ చేసేందుకు పార్టీ అధ్యక్షుడు జగన్ మమోహన్ రెడ్డి నేతృత్వంలో ఎంతో కృషి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వివిధ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

మాకు స్వాతంత్ర్యం రాలేదు

నల్ల రిబ్బన్లతో గరగపర్రు దళితుల నిరసన



గరగపర్రులో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ తదితరులు

పాలకోడేరు: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా మాకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదంటూ పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామ దళితులు నిరసన వ్యక్తంచేశారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో ప్రతిష్ఠించడానికి అగ్రవర్ణాలు నిరాకరించిన అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం దళిత సంఘాలు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు, జెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దళిత మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ గరగపర్రు దళితవాడకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదని విచారం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షురాలు ఆర్.మణిసింగ్ మాట్లాడుతూ.. అగ్రకులాల కబంధ హస్తాలనుంచి స్వేచ్ఛ వచ్చినప్పుడే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు భావిస్తామన్నారు. తొలగించిన చోటే అంబేద్కర్ విగ్రహం ప్రతిష్ఠించాలని, లేకుంటే ఆందోళన చేపడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. అందుకే స్వాతంత్ర్య దినోత్సవాన్ని బ్లాక్‌డేగా నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బేతాళ సుదర్శన్, వేలంగి శ్యామ్, గరగపర్రు పోరాట కమిటీ నాయకుడు ఎరిచర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే ధ్యేయం

- రూ.1650 కోట్లతో హెచ్‌వీడీఎస్ పనులు
- కొత్తగా 240 సబ్‌స్టేషన్లు
- స్వాతంత్ర్యదిన వేడుకల్లో ఎస్పీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలోని ఎనిమిది జిల్లాల్లో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే సంస్థ ధ్యేయమని ఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌వై దొర పేర్కొన్నారు. డిస్కం పరిధిలో వందశాతం విద్యుదీకరణ పూర్తి చేసినట్లు ఆయన ప్రకటించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం విద్యుత్ నిలయంలో మంగళవారం 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తమ పనితీరు చూపిన 26 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, మొమెంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు డీడీయూజీజేవై పథకం కింద 52, ఐపీడీఎస్ పథకం ద్వారా 60, ప్రపంచ బ్యాంక్ రుణ సహాయంతో 128 మొత్తం దాదాపు రూ.560 కోట్లతో 240 సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. లైన్ లాస్‌లను తగ్గించేందుకు, లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు రూ.1650 కోట్లతో హెచ్‌వీడీఎస్ పనులను చేపట్టడం జరిగిందన్నారు. కృష్ణా జిల్లాలో ఇప్పటికే స్టార్ రేటెడ్ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను తక్కువ ధరకే అందించామని, త్వరలోనే మిగిలిన ఏడు జిల్లాల్లో ఈ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 1800 425 155333 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈకార్యక్రమంలో డిస్కం డైరెక్టర్ పుల్లారెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ మనోహరరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు ఏసునాథు, నరసింహులు, నందకుమార్, హనుమత్‌ప్రసాద్, సంతోషరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లజెండాలు ఎగరేసిన మావోలు

సీలేరు (పాడేరు)/పెదబయలు (అరకులోయ): ఏవోబీ సరిహద్దు ప్రాంతంలో సీపీఐ మావోయిస్టు పార్టీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ నల్లజెండాలు ఎగురవేసింది. సీలేరు రిజర్వాయర్ అవతల ఉన్న అల్లూరికోట గ్రామంలో మంగళవారం మావోలు నల్లజెండా ఎగురవేశారు. మావోయిస్టులకు భయపడి కునుములూరు, పట్టులూరు, మెట్టల్ తదితర పంచాయితీల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పంద్రాగస్టు వేడుకలు నిర్వహించలేదు. విశాఖ ఏజెన్సీ పెదబయలు మండలం రూడకోట గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం స్వాతంత్ర్య దినోత్సవాన్ని బహిష్కరించాలని నల్ల బ్యానర్లు అతికించిన మావోలు మంగళవారం మారుమూల ఇంజరి ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో నల్ల జెండాను ఎగురవేసినట్లు సమాచారం.

కీసర టోల్‌ప్లాజా కిటకిట

అర కిలోమీటరు మేర బారులు దీరిన కార్లు

కంచికచర్ల: కృష్ణాజిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద అర కిలోమీటరు మేర కార్లు బారులుదీరాయి. వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో సొంత ఊళ్లకు వచ్చిన వారంతా తిరిగి తమ వాహనాల్లో మంగళవారం హైదరాబాద్ బయలుదేరారు. ఈ నేపథ్యంలో కీసర టోల్‌ప్లాజా వద్ద అర కిలోమీటరు మేర కార్లు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది. అనంతరం టోల్ ప్లాజా మేనేజర్ జయ ప్రకాశ్ మాట్లాడుతూ రోజుకు సుమారు 12 వేల కార్లు హైదరాబాద్ వైపునకు వెళ్తున్నాయని, దీనివల్ల టోల్‌ప్లాజాకు రూ.6 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు.



కీసర టోల్‌ప్లాజా వద్ద బారులు దీరిన కార్లు, ఇతర వాహనాలు

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం ॥ 16-8-2017



దండాలన్నా
నాంపల్లి నర్సన్నా
- పక్క పేజీలో



సాహో శ్రద్ధ!
- సినిమాలో

నాట్యతపస్సు

నాట్యం చేసేదెందుకు?
నలుగురు చూసేటందుకు.
నలుగురూ చూసి మురిసే నాట్యం
దైవార్పితం ఎలా అవుతుంది?
అది ముమ్మాటికీ ప్రదర్శనే అవుతుంది.
నాట్యం... నిన్ను నువ్వు చూసుకోవడానికి...
నీలోనే ఉన్న పరమాణువుల
సంలీనంలో బ్రహ్మాండాన్ని దర్శించడానికి.
నాట్యం... నిన్ను ఆనందింపచేస్తేనే...
ప్రపంచమూ పులకితమవుతుంది.
రాజారాధారెడ్డిలకు నాట్యం
ఒక తపస్సు... ఒక దైవతాండవం

నేను నా దైవం





రాజారెడ్డి, రాజారెడ్డి

● **దైవాన్ని నృత్యంతో ఆరాధిస్తారా, నృత్యంలో దైవాన్ని దర్శిస్తారా?**

రాజారెడ్డి: రెండూనూ! ఎందుకంటే నాట్యకారులకు నాట్యమే దైవం. మనదేశంలో ప్రాచీన కాలం నాటి రోజులను గమనించండి. ఎన్నో ధార్మిక ప్రదేశాలకు, దేవాలయాలకు, సంస్కృతికి పెట్టింది పేరైన మన దేశంలో నర్తకీమణులు దేవాలయాల వద్ద దేవుణ్ని స్తుతిస్తూ నర్తించేవారు. నాటి నుంచి నాట్యకారులకు అన్నీ దేవుడే అయ్యాడు. తట్టుమేల, నాట్యమేల ద్వారా భగవంతుని లీలలను ఊరూరా తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తూ ప్రజలకు తెలియజేసేవారు. అంటే, నృత్య సాధన చేసేవారు భగవంతుని లీలలు మొత్తం నేర్చుకోవాలి. ఆ విధంగా శివలీలలు, భాగవతం, దశావతారాలు.. ప్రదర్శనలను ప్రపంచమంతటా ప్రదర్శించాం నేనూ రాధ.

● **దంపతులిద్దరూ డ్యాన్సర్లే కావడం యాదృచ్ఛికమా, భగవత్‌సంకల్పమా?**

రాధారెడ్డి: భగవంతుని దయ లేనిదే ఏదీ జరగదు. రాజా మా మేనత్త కొడుకు. మా పెళ్లప్పుడు రాజాకు పదకొండేళ్లు, నాకు ఐదేళ్లు. మాకు ఆ పెళ్లి గురించి ఏమీ తెలియదు. అమ్మనాన్నలు మీరు భార్యాభర్తలు అని చెప్పేవారు. నేను ఆటలో మునిగినప్పుడల్లా నానమ్మ గుర్తుచేస్తుండేది నువ్వు రాజా భార్యవి అని. ఆ మాటలో నీకు పెళ్లయ్యింది సుమా! అనే హెచ్చరిక వినిపించేది. అత్తింటికి వచ్చాక మాత్రం నా భర్త ముందుగా నాకు స్నేహితుడు అయ్యాడు. తర్వాత గురువు అయ్యాడు. మొదట్లో ఇద్దరం భాగవతం, వీధి నాటకాలు చూసేవాళ్లం. తర్వాత రోజుల్లో సాధువులు ఎలా తపస్సు చేసుకుంటారో అలా డ్యాన్స్‌ని పట్టుకున్నాం. మా ఇద్దరి కాంబినేషన్‌లాగ ఇప్పటి వరకూ ఎవ్వరూ ఇలా నృత్యంలో లేరు.

రాజారెడ్డి: నాతో పాటూ రాధ కూడా కూచిపూడి కళకు రావడం భగవత్ సంకల్పమే! మాది అదిలాబాద్ జిల్లాలోని నర్సాపురం. నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే పిచ్చి. కోలాటం, భజనలు చేసే వాళ్లలో కలిసి పోయేవాడిని. యక్షగానాలు, భాగవతుల వాళ్లతో కలిసి ఊరూరా తిరిగేవాడిని. ప్రదర్శనల్లో పాల్గొనేవాడిని. డ్యాన్స్ లోక్లాస్ వాళ్లు చేసేది అని ఊళ్లో వాళ్లు చిన్నచూపు చూస్తున్నారని మా నాన్న నన్ను కొట్టేవాడు. అయినా వినేవాడిని కాదు. నేను డ్యాన్స్ చేస్తుంటే రాధ చూసేది. తన స్నేహితులతో కలిసి తనూ చేసేది. ఆమెలో ఉన్న ఆసక్తి చూసి ఆ తర్వాత తనకూ నృత్యం నేర్పించాను. తను ఎప్పుడైతే నాట్యం నేర్చుకుందో.. నాతో కలిసి నాట్యం చేయడం ఆరంభించిందో అప్పుడు నా జీవితానికి ఒక పరిపూర్ణత వచ్చింది. అయితే, అదంతా సులువుగా జరగలేదు. నా పదవ తరగతి పూర్తవుతుంది అనగా నాన్న చనిపోయాడు. ఊళ్ళో వాళ్లు నేను డ్యాన్స్ చేస్తున్నానని రెండేళ్ల పాటు మా కుటుంబాన్ని వెలేశారు. నాకంటే చిన్నవారైన తోడబుట్టిన వాళ్లున్నారు. అప్పుడు భయపడ్డాను. అమ్మ మాత్రం 'నీకు నచ్చింది చెయ్! మాకేమవుతుందో అని భయపడకు. నువ్వు మాత్రం జాగ్రత్తగా ఉండు' అనేది. అప్పటికే ఏలూరు, తెనాలి ప్రాంతాలలో గురువుల వద్ద నృత్యం, కొరియోగ్రాఫ్ నేర్చుకున్నాను. ఏదో మొండిగా రాధను తీసుకొని హైదరాబాద్‌కి వచ్చేశాను. కానీ, అప్పుడు చేతిలో పైసా లేదు. ఎవరూ సాయం చేసేవారు లేరు. స్టేజీ షోలు ఇవ్వడం కొత్త. సంపాదన లేదు. పూట గడవాలంటే గగనమయ్యేది. మంచినీళ్లతో కడుపునింపుకునేవాళ్లం. అయినా సరే, రోజూ 8 నుంచి 10 గంటలు నాట్య సాధన చేసేవాళ్లం. ఇప్పుడు ఆ రోజులను తలుచుకుంటే ఎలా బతికామో అనిపిస్తుంటుంది.

దేవుడు ప్రత్యక్షమైతే?

రాధారెడ్డి, రాజారెడ్డి: మేం ఎంత పుణ్యం చేసుకున్నామో మా పిల్లలు యామినీరెడ్డి, భావనారెడ్డి కూడా ఇదే కళలో రాణిస్తున్నారు. పెద్దమ్మాయి ఎంబీఏ. చిన్నమ్మాయి కూడా మాస్టర్స్ డిగ్రీ చేసింది. కానీ, ఇద్దరూ 'కూచిపూడి నాట్యానికే అంకితం అవుతాం' అన్నారు. ఆ దైవం ప్రత్యక్షమైతే ఒకటే కోరుకుంటాం. వాళ్లు ఈ కళలో ఎంతో గొప్పగా రాణించాలని కోరుకుంటాం. అంతేకాదు, మా స్కూల్ 'నాట్యతరంగిణి'లో ఉన్న విద్యార్థులు కూడా మా పిల్లలే! వాళ్లకి మేమే స్వయంగా క్లాసులు తీసుకుంటాం. వారందరూ కూచిపూడి నాట్యకళలో ఉన్నతులు కావాలని, ఈ కళను ముందుతరాలకు పరిచయం చేయాలని, ఎప్పటికీ ఈ కళ ఇలాగే నిలిచిఉండాలని కోరుకుంటాం.

● **అలాంటి కష్టకాలంలో దేవుడు మీ చేయి పట్టుకుని నడిపించారంటారా?**

రాధారెడ్డి: మా ఇలవేల్పు వేంకటేశ్వరస్వామి. ఆయన్నే నమ్ముకున్నాం. స్వామి మమ్మల్ని కష్టాల నుంచి గట్టెక్కించడమే కాదు, ప్రపంచానికి మమ్మల్ని పరిచయం చేశాడు. మేం ఢిల్లీ చేరిన మొదట్లో నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా అక్కడి తీన్‌మూర్తి భవన్‌లో నాట్య ప్రదర్శన ఇచ్చాం. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మా ప్రదర్శన చూసి చాలా ఇంప్రెస్ అయ్యారు. శాలువా కప్పి సన్మానించారు. మా గురించి అడిగారు. 'మేం ఊరు వెళ్లిపోతున్నాం. ఇక్కడ మాకు ఉండటానికి చోటు లేదు మేడమ్' అని చెప్పాం. అప్పుడామె, మమ్మల్ని వెళ్లద్దు అని మినిస్టర్ కొత్త రఘురామయ్య గారికి చెప్పి భండార్ రోడ్‌లో మా కోసం ఇంటిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మా నాట్యానికి ఎక్కడా విఘాతం రాలేదు. ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా మా ప్రదర్శన ఉండేది. అయినా, చాలావరకు ప్రదర్శనలు మా వరకు రావాలంటే ఎవరో ఒకరు అడ్డుపడేవారు. పైవాళ్లను ఇన్‌ఫ్లుయెన్స్ చేసుకొని తమకు ఆ అవకాశాలను ఇప్పించుకునేవారు. దాంతో చాలా బాధ కలిగేది. ఏడుస్తూ గుడి దగ్గర కూర్చున్న రోజులున్నాయి.

రాజారెడ్డి: ఆత్మను పరమాత్మతో ఏకం చేస్తే కష్టమేదీ అనిపించదు. నాట్యం ద్వారా మాకు అది సాధ్యమైంది. అందుకే ఆకలిని మరిచిపోయాం. నాట్యాన్నే శ్వాసించాం. నాట్యంలోనే జీవించాం. పంచేంద్రియాలను ఒకటి చేసి ఆత్మను భగవంతునితో కలిపితే దొరికే ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. ఆ దైవం మాకు అండగా ఉండబట్టే ఈ రోజుకి ఇలా ఉన్నాం. రోజూ కాసేపు భగవంతుని పూజలో పాల్గొంటే మంచి జరుగుతుంది అనే భావన మా ఇంట్లో అందరిలోనూ ఉంది.

● **దైవదర్శనం నృత్యంలోనేనా? ఆలయాలకు వెళుతుంటారా?**

రాధారెడ్డి: మా ప్రదర్శనలన్నీ దాదాపు పెద్ద పెద్ద దేవాలయాల వద్దే జరిగేవి. మేం ఎన్ని జన్మల పుణ్యం చేసుకున్నామో! నాట్యంతోనే అన్ని పుణ్య స్థలాలు దేవుడే తిప్పుతున్నాడు. ఆ విధంగా ఉత్తరభారతంలో మధుర, బృందావనం, ద్వారక.. ఒకటేమిటి గొప్ప గొప్ప దైవ క్షేత్రాలన్నీ దర్శించాం.

రాజారెడ్డి: అంతేకాదు, ప్రతి యేటా తిరుపతి వెళ్తాం. అలాగే వేములవాడ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మ వారిని దర్శించుకుంటాం. మొన్నటి మార్చి నెలలో రాధ తిరుమల కొండ మెట్లు ఎక్కి, తలనీలాలు సమర్పించు కొని వచ్చింది. శ్రీశైలం అయితే ఎన్ని సార్లు వెళ్లామో! శివయ్య అంటేనే నృత్యం కదా! అమ్మవారితో కలిసి ఆయన చేసే నాట్యం మహాద్భుతంగా వర్ణిస్తుంది శివపురాణం. భగవంతునితోనే నాట్యం ఉద్భవించింది. ఈ నాట్యాన్ని ఆ భగవంతుడే మాకు దగ్గర చేశాడు.

● **మీ ప్రదర్శనలో అంతరాయాలు రావడం, దైవాన్ని గట్టెక్కించమని వేడుకున్న సందర్భాలు?**

రాజారెడ్డి: కొన్నేళ్ల క్రితం జరిగింది. ఢిల్లీలో తెలుగువారి ఫంక్షన్ జరుగుతున్న సందర్భం అది. ఆ వేడుకలో మా ప్రదర్శన ఉంది. అది రామకృష్ణ మఠం ఆడిటోరియం. మేం మేకప్ వేసుకొని, సరంజామా అంతా సిద్ధం చేసుకొని వెళ్లేసరికి అక్కడ మైకులో జనగణమణ.. అనే గీతం వినిపించింది. చాలా మథనపడ్డాం. ఇలాగే మరోసారి మధ్యప్రదేశ్‌లో జరిగింది. ఫ్రాన్స్‌లో మొదటిసారి ప్రదర్శన ఇచ్చినప్పుడు మాత్రం చాలా భయపడ్డాం. అది అతి పెద్ద స్టేజ్. ఆ స్టేజ్ మీద మొత్తం చీకటి. డ్యాన్స్ చేసేటప్పుడు వారి ఒక్కరి మీద మాత్రమే ఫోకస్ పడుతుంది. అలాంటి స్టేజ్ మీద దశావతారం... చీకట్లోనే పదిసార్లు స్టేజీమీదకు వెళ్లాలి. నాటి సంఘటన ఇప్పటికీ మర్చిపోలేం. నాట్య ప్రదర్శన పూర్తయ్యాక ఆ చప్పట్ల హోరు.. దాదాపు 30 నిమిషాలు. వాళ్లంతా మమ్మల్ని ప్రశంసించడం.. అంతా దేవుని దయ.

● **రాజారెడ్డికి రెండవ భార్యగా మీ చెల్లెలు కౌసల్యనే ఇచ్చి చేశారు. ఇది త్యాగమా, దైవనిర్ణయమా?**

రాధారెడ్డి: మొదట కౌసల్య నా భర్తను పెళ్లి చేసుకుంటానని చెప్పినప్పుడు షాక్ అయ్యాను. బాధపడ్డాను. కానీ, తన ప్రేమను గుర్తించాను. దైవనిర్ణయంగా భావించాను. అందుకే మా జీవితాల్లోకి కౌసల్యను ఆహ్వానించాం.

● **అవార్డులు వరించినప్పుడు దైవం అనుకూలత లభించిందని భావించారా?**

రాజారెడ్డి: ఒక ఇంట్లో ఒక్కరికే పద్మశ్రీ అవార్డులు ఇస్తారు. అలాంటిది మాకు ఒకేసారి అవార్డులు వరించాయి. ఇది దైవం ఇచ్చిన అదృష్టమే! అవార్డులు వచ్చినా కొద్దీ మా బాధ్యత కూడా పెరుగుతూ వచ్చింది. భక్తి, సాధన, అంకితభావం... కలిస్తేనే కూచిపూడి నాట్యంలో రాణించగలం. వాటికి తగిన గౌరవం లభించిందని నమ్ముతాం.

● **అధ్యాత్మికతకు - భక్తికి మీరు చెప్పే నిర్వచనం...?**

రాజారెడ్డి: మా గురువుగారు ఈ రెండింటి గురించి వివరిస్తూ ఒక శ్లోకం చెప్పేవారు.

పుంఖానుపుంఖ విశేషణ తత్పరూపి
బ్రహ్మావలోకన ధ్యియం నజహాతి యోగి.
సంగీత తాళ లయ వశంగతాపి
మౌళిస్తకుంభ పరిరక్షణ ధీర్ణటీవ! అని.

ఈ నాట్యంలో నర్తకులు పళ్లెం మీద నిల్చుని చేసే విధం ఉంటుంది. తలమీద చెంబులో నీళ్లుంటాయి. భగవంతుని పాట పాడుతూ లయబద్ధంగా పాదాలు కదుపుతూ నాట్యం చేస్తుంటాడు. చెంబులో నీళ్ల తొణకవు. పళ్లెం మీద నుంచి కాలు కిందకు దిగదు. అది భక్తి. యోగి తపస్సు చేస్తూ పరమాత్మను దర్శనం చేసుకుంటాడు. అతనిది ఆధ్యాత్మికత. ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే అన్నమయ్య బ్రహ్మమొకటే, పరబ్రహ్మమొక్కటే అని కీర్తన పాడుతుంటాడు అదే సమయంలో దానికి తగిన తాళం చేత్తోనూ, పాదంతోనూ వేస్తుంటాడు ఇది ఆ స్వామిపై ఉన్న భక్తి.

– నిర్మలారెడ్డి చిల్కమర్రి

ఆత్మీయం

ధ్యానం... అంతరయానం!



అతి చిన్న విత్తనం నుంచే అంత పెద్ద మర్రిచెట్టు పుట్టిందన్న సత్యం అందరికీ తెలిసిందే. అయితే అది ఎలా పుట్టిందో తెలుసుకోవాలంటే మనం ప్రయాణం చేయాలి. ఆ ప్రయాణం ఎక్కడికో కాదు, మన(సు)లోకే... అలా ప్రయాణం చేయడానికి కావలసింది ఏకాగ్రత, నమ్మకం, ఆత్మవిశ్వాసం. ఆ మూడూ కావాలంటే ధ్యానం చేయడమే సరైన మార్గం. ధ్యానానికి, యోగానికి సాక్షాత్తూ ఆ పరమశివుడే ఆదిపురుషుడు. ఆది పరాశక్తి నుంచి త్రిమూర్తుల వరకు మహర్షుల నుంచి మహాయోగుల వరకు ప్రతి ఒక్కరూ ధ్యానం (తపస్సు)లో తరించినవారే. మనమందరం ధ్యానించేది ఆ దేవుళ్లనే కదా, మరి ఆ దేవుళ్లు ధ్యానించేది ఎవరిని అన్న సందేహం కలగటం సహజం. నిజమే మరి! దేవతల కన్నా బలమైన, మహత్తరమైన మహాశక్తి మరోటి ఉంది. ఆ శక్తే మనస్సు. మనస్సు బలంగా ఉన్నప్పుడే ఏ పనైనా చేయగలం. ఆ మనస్సును స్థిరంగా ఉంచుకోవడానికే ధ్యానం చేయడం అవసరం. ధ్యానం అంటే నిర్మలమైన, నిశ్చలమైన నీలోకి నీవు చేసే ప్రయాణం.

దేశభక్తి

చాంద్ కా టుకడా...

ప్రపంచ దేశాలలో భారతదేశమే చాంద్ కా టుక్‌డా. అద్భుత నైసర్గికతతో, అత్యంత అద్భుతమైన వనరులతో, అంత కంటే అద్భుతమైన సాంస్కృతిక మూలాలకు నిలయమైన మన దేశం... ప్రపంచ దేశాలకు మురిపెంగా కనిపించే దేశం... ముద్దొచ్చే దేశం. అందుకే కవి ఇక్బాల్ 'సారే జహాసే అచ్ఛా హిందూ సితాన్ హమారా' అని మన దేశాన్ని కొనియాడాడు. అంతరిక్షంలో ప్రయాణించిన తొలి భారతీయుడు రాకేష్ శర్మ అక్కడి నుంచి మన దేశాన్ని చూస్తూ అదే ఉద్వేగంతో 'సారే జహాసే అచ్ఛా హిందూ సితాన్ హమారా' అని పాడాడు. కాని కాలం ఎప్పుడూ ఒక్కలాగే ఉండదు. ఒడి దుడుకులు వచ్చాయి. సంస్కృతుల మధ్య స్పర్థలు వచ్చాయి. అయితే వాటిని ఎప్పటికప్పుడు దాటి ముందుకు పోవడమే ఈ దేశం ఎప్పుడూ చేసింది. ఈ దేశంలో మతాల మధ్య ఉన్న సోదర భావం, అన్ని మతాలకూ ఈ దేశం పట్ల ఉన్న భక్తిభావం ఈ దేశాన్ని అచంచలంగా నిలబెడుతున్నాయి. ఈసారి ఆగస్టు 15న దేశమంతా సంబరాలు జరుపుకుంది. కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు అన్ని మతాల వాళ్లూ, అన్ని ప్రాంతాల వాళ్లూ మమేకమై జరుపుకున్న పండగ ఇది. ముస్లిం బాల బాలికలు పాల్గొన్న వేడుకలు చూపరులను మరింతగా ఆకట్టుకున్నాయి. అరచేతులో త్రివర్ణ పతాకాలతోపాటు బుగ్గలపై, అమ్మాయిల శిరో వస్త్రాలపై కూడా మూడు రంగులు రెపరెపలాడాయి. ఇది అందరి దేశం. అందరితో వెలిగే దేశం. అందరితోనే వెలగాల్సిన దేశం. మన భారతదేశం.





స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో బాలబాలికలు





గుడ్‌ఫుడ్

● ఆవగింజ

పరిణామం చిన్నది... పని పెద్దది!



పరిమాణంలో చాలా చిన్నగా కనిపించే వాటిని ఆవాలతో పోలుస్తూ ఆవగింజంత అంటారు. కానీ వాటి వల్ల కలిగే లాభాలు మాత్రం కొండంత. ఆవాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల్లో కొన్ని...

- ఆవాల్లో ఉండే ఫోటోన్యూట్రియెంట్ గుణాలు, పీచుపదార్థాల కారణంగా అవి జీర్ణవ్యవస్థకు మేలు చేయడంతో పాటు, జీర్ణవ్యవస్థలో వచ్చే అనేక రకాల క్యాన్సర్లను నివారిస్తాయి. మలబద్ధకం కూడా తగ్గుతుంది.
- ఆవాల్లో సెలీనియమ్, మెగ్నీషియమ్ ఎక్కువ. వాటి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణం వల్ల మంట, నొప్పి తగ్గుతాయి.
- ఆవాలు ఆస్తమాను తగ్గిస్తాయి. క్రమం తప్పకుండా ఆవాలతో కూడిన ఆహారం తినేవాళ్లలో ఆస్తమా అదుపులో ఉండటంతో పాటు జలుబు, ఛాతీ పట్టేసినట్లు ఉండటం వంటి సమస్యలు తగ్గుతాయి.
- బరువు తగ్గడానికి ఆవాలు బాగా తోడ్పడతాయి. ఆవాలలో విటమిన్ బీ-కాంప్లెక్స్ ఎక్కువ. దాంతో వ్యాధి నిరోధక శక్తి సమకూరడమే కాకుండా, జీవక్రియలు సమర్థంగా జరుగుతాయి.
- ఆవాలలోని కెరోటిన్స్, జియాగ్జాంథిన్స్, ల్యూటిన్ వంటి పోషకాలు వయసు పెరగడం వల్ల వచ్చే అనర్థాలను తగ్గించి దీర్ఘకాలం యౌవనంగా ఉండటానికి తోడ్పడతాయి.
- ఆవాల్లోని నియాసిన్ వంటి పోషకాల వల్ల కొలెస్ట్రాల్ పాళ్లు తగ్గుతాయి. రక్తనాళాల్లో పాచిలాగ పేరుకునే అథెరోస్క్లిరోసిస్ వంటి కండిషన్లను ఆవాలు నివారిస్తాయి.
- ఆవాల్లోని విటమిన్-ఏ, ఐరన్, ఫ్యాటీ యాసిడ్‌లు జుట్టు దట్టంగా పెరగడానికి తోడ్పడతాయి.
- ఆవాలు రక్తపోటును సమర్థంగా తగ్గిస్తాయి.



కొండ ఆలయంలోని గర్భగుడి స్వర్ణ గోపురంతో పాటు కనువిందు చేస్తున్న గోపురాలు



వల్లిదేవి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లు

అభీష్ట ప్రదాత తిరుత్తణిగై

పుణ్య తీర్థం

తమిళంలో మురుగన్ అంటే అందం అని అర్థం. అందానికి ప్రతీకగా భక్తులచే పూజలందుకునే దైవంగా కీర్తి చెందిన సుబ్రమణ్యస్వామి (మురుగన్) తన ఆరు పుణ్యక్షేత్రాల్లో ఉగ్ర రూపుడిగా దర్శనమిచ్చినా ఒక్క తిరుత్తణి కొండలో మాత్రం శాంతస్వరూపుడిగా భక్తులను కటాక్షిస్తున్నాడు. ఈ ఆలయంలో స్వామికి నిర్వహించే అభిషేకాల్లో వినియోగించే విభూది, గంధ ప్రసాదాల ద్వారా ఆరోగ్య సమస్యలు నయమవుతాయని విశ్వాసం. ఆరోగ్యం, విద్య, వ్యాపారం, కోర్టు సమస్యలు, వివాహం తదితర సమస్యలు సుబ్రమణ్యస్వామిని దర్శించుకుంటే తొలగుతాయని ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు తిరుత్తణికి విచ్చేస్తుంటారు. ఈ క్షేత్రానికి తమిళంలో తొండ్రు తొట్టు అని పేరు. అంటే తప్పులు, పాపాలను మన్నించి సౌభాగ్యాలు ప్రసాదించడం అని, తిరుత్తణిగై అంటే శాంతించిన దేవుడని అర్థం. ఇప్పుడక్కడ ఆడికృత్తిక ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా...

స్థలపురాణం

దేవతలు, మునులు, రుషులను బాధపెట్టిన శూరపద్ముడనే రాక్షసునితో ఉగ్రరూపుడిగా భీకర యుద్ధం చేపట్టి, వల్లీదేవిని వివాహం చేసుకునేందుకు బోయ రాజులతో తేలికపాటి పోరు ముగిసిన తరువాత స్వామి శాంతస్వరూపుడిగా కొలువుదీరిన పుణ్యక్షేత్రం తిరుత్తణి కొండమీద తూర్పుదశలో వున్న ఆలయానికి ఇరుపక్కల రెండు పర్వతశ్రేణులు వ్యాపించి వున్నాయి. ఉత్తరాన గల పర్వతం తెల్లగా ఉండడం వల్ల పచ్చిబియ్యపు కొండగా, దక్షిణం వైపున్న పర్వతం నల్లగా వున్నందున గానుగ పిండి పర్వతంగా పిలుస్తారు. ఈ కొండను చేరుకునేందుకు 365 మెట్లు వున్నాయి. తన తండ్రి పరమేశ్వరుని కొలిచేందుకు తన నివాసానికి ఈశాన్య భాగాన శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. అందుకే ఈ పుణ్యక్షేత్రంలో వున్న శివలింగానికి కుమారేశ్వరుడని పేరు. దేవసేనను తిరుప్పరంకుండ్రంలోనూ, ఇంద్రుడి కుమార్తె వల్లీదేవిని తిరుత్తణికొండలోనూ వివాహం చేసుకుంటాడు. వివాహం సందర్భంగా ఇంద్రుడు కానుకగా ఇచ్చిన గజరాజం ఆలయ వాకిలికి ముందు ధ్వజస్తంభానికి ఆనుకుని ఇప్పటికీ దర్శనమిస్తుంటుంది. ఈ గజరాజాన్ని దర్శించుకున్నాకనే ఆలయంలోకి అడుగుపెట్టడం ఆచారం. ఇంద్రుడు ఇచ్చిన మరో కానుక గంధపు రుబ్బురాయి. కొండ ఆలయంలోని రెండవ ప్రాకారంలో యాగశాలకు ఎదురుగా వున్న ఈ రుబ్బురాతిలోనే నేటికీ స్వామివారి సేవలకు వినియోగించే గంధాన్ని తీస్తారు. మొదటి ప్రాకారానికి వెనుక వైపు బాలమురుగన్ సన్నిధిలో ఆరుద్ర దర్శనంలో బాలమురుగన్‌కు వేడినీళ్లతో అభిషేకం చేస్తారు. ఆలయంలోని నాల్గవ ప్రాకారంలో నెలకొని వున్న మూలమూర్తి ఎడమ చేతిలో శూలంతో దర్శనమిస్తున్నాడు. స్వామివారికి ఇరు వైపులా దేవసేన, వల్లీదేవతలకు వేర్వేరుగా సన్నిధులున్నాయి. ఈ ఆలయంలో నిర్వహించే ఏకాంత సేవలో ఒకరాత్రి వల్లీదేవితో, మరురాత్రి దేవసేనతో సుబ్రమణ్యస్వామి కొలువుదీరడం మరే ఆలయంలో లేని ప్రత్యేకత.

లక్ష రుద్రాక్ష మండపం

ఉత్సవర్లు కొలువుదీరిన లక్ష రుద్రాక్షమండపం ఈ ఆలయ ప్రత్యేకత. లక్ష రుద్రాక్షలతో రూపుదిద్దుకున్న పల్లకిలో నిత్యం వల్లీదేవీ, దేవసేన సమేతంగా భక్తులకు దర్శనమిస్తుంటారు. అలాగే షణ్ముఖర్, ఆపత్సహాయక వినాయకుడు, ఆది బాలసుబ్రమణ్యం, కుమారేశ్వరుడు, బైరవుడు తదితర సన్నిధులను కూడా కచ్చితంగా దర్శించుకోవడం నియమం.

విశిష్ట ఉత్సవ వేడుకలు

సుబ్రమణ్యస్వామి కృత్తిక నక్షత్రంలో జన్మించడంతో ప్రతి కృత్తిక, మంగళవారం రోజుల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఆషాఢంలో శరవణ పుష్కరిణిలో మూడు రోజులపాటు తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు కావిళ్లతో కొండకు వస్తారు. ముందుగా తలనీలాలు సమర్పించి శరవణ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మెట్లమార్గంలో ఆలయం చేరుకుని స్వామికి కావళ్లు చెల్లించి హుండీల్లో కానుకలు చెల్లించడం పరిపాటి.

ఎలా వెళ్లాలంటే..?

అప్పట్లో తమిళ, తెలుగు రాష్ట్రాల విభజన సమయంలో తెలుగు వారు ఎక్కువగా ఉన్న తిరుత్తణిని ఆంధ్రరాష్ట్రంలో చేర్చారు. అయితే తమిళ భాషాభిమానులు చేపట్టిన ఉద్యమంతో తిరుత్తణి తమిళనాట అంతర్భాగంగా మారింది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సరిహద్దులోని తిరుత్తణి చెన్నైకు 80 కిలోమీటర్లు, తిరుపతికి 65 కిలోమీటర్ల దూరంలో వుంది. చెన్నై నుంచి ముంబయి రైలు మార్గంలోని అరకోణం రైల్వే జంక్షన్‌కు పది కిలోమీటర్ల దూరంలో వుంది.

- చక్రాల నరసింహులు, సాక్షి, తిరుత్తణి (తమిళనాడు)



నాంపల్లిగుట్టపై కాళీయమర్దనం

ఐదు తలల సర్పాకారం... తలపై శ్రీకృష్ణుడి నృత్యరూపం.. 52 అడుగుల ఎత్తైన గుట్ట.. చుట్టూ పచ్చని పంటలు.. కనుచూపు మేర కనువిందుచేసే అందాలు... మనసును ఉల్లాసంగా ఉంచే ప్రకృతి దృశ్యాలు...ఎన్నిసార్లు చూసినా... తనివి తీరని అద్భుత శిల్పాలు నాంపల్లిగుట్ట సొంతం. ఆ గుట్టపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎంతో విశిష్టత కలిగిన పుణ్యక్షేత్రం. పురాతనమైన ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు ఆనందానుభూతులలో ఓలలాడతారు.



లక్ష్మీనర్సింహస్వామి

దండాలన్నా నాంపల్లి నర్సన్నా

నాంపల్లిని పూర్వం నామపల్లిగా పిలిచేవారు. ఆరువందల ఏళ్ల కిందట ఈ గుట్టపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి వెలసినట్లు చెబుతారు. శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో చోళుల కాలంలోనే స్వామి వారికి పూజాదికాలు జరిగినట్లు ఆధారాలున్నాయి. సహజ సిద్ధంగా ఓ వైపు మూలవాగు.. మరోవైపు మానేరు వాగులు ప్రవహిస్తుంటాయి. ఈ ఆలయానికి ఉన్న మరో విశిష్టత లోపల ఉన్న అంజనేయస్వామి రాతి శిల. ఈ హనుమంతుడికి మండల దీక్షలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం. సిరిసిల్ల రాజన్న జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. ఆ ఆలయానికి దర్శనానికి వచ్చే భక్తులు నాంపల్లిగుట్టకు కూడా వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. కొత్తగా పెళ్లయిన జంటలు సంతానం కలగాలని మొక్కుకుని, కోరిక నెరవేరాక ఇక్కడ వనభోజనాలు చేస్తారు. రాజరాజనరేంద్రుడు, ఆయన సతీమణి కూడా స్వామివారిని సేవించి, సంతానాన్ని పొందినట్లు చారిత్రక కథనాలున్నాయి.

గుట్టపై గుహలు

నాంపల్లిగుట్టపై సహజసిద్ధమైన బండ రాళ్ల మధ్య గుహలు, రెండు కోనేరులున్నాయి. ఇక ఆలయం పక్కనే ఉన్న చిన్న గుహలో శివలింగంతో పాటు ఇతర దేవతామూర్తుల విగ్రహాలకూ పూజలు జరుగుతాయి. క్రీ.శ 10 శతాబ్దంలో నవనాథ సిద్ధులు(తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని ప్రతీతి. నిత్యం నవనాథులు ఈ గుహ నుంచి భూగర్భ సొరంగ మార్గంలో వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి పూజలు చేసే వారని చెబుతారు.

కాళీయ మర్దనం.. ప్రత్యేకత

నాంపల్లిగుట్ట ఆసాంతం సింహం నిద్రిస్తున్న తీరులో ఉంటుంది. గుట్ట ఎంత మహిమాన్వితంగా కనిపిస్తుందో ప్రకృతి అందాలతో అంతగా పర్యాటకులను ఆకట్టుకుంటుంది. సహజ సిద్ధమైన అందాలతో పాటు కాళీయ మర్దనం మరో ప్రత్యేకత. ఐదుతలల సర్పాకారంలో నిర్మించిన నాగదేవత ఆలయం. నాగపాము తలపై శ్రీకృష్ణుడు పిల్లనగ్రోవితో నృత్యం చేస్తున్న దృశ్యాలు కనువిందు చేస్తాయి. ఎటు నుంచి చూసినా గుట్టపై చెట్లపొదల్లో చుట్టుకుని పడుకున్న కొండంత పాములా కనిపిస్తుంది. పాము నోటిలోనికి వెళ్తుండగా.. శ్రీలక్ష్మీనర్సింహస్వామి లీలలను తెలిపే రకరకాల శిల్పాలు కనువిందు చేస్తాయి. గుట్టపైకి వచ్చిన వారు వీటిని మైమరచి చూస్తూ... నర్సింహుడి ఉగ్రరూపాన్ని, నాగదేవతను దర్శించుకుంటారు. నూనెతో, పాలతో స్వయంగా అభిషేకాలు నిర్వహించుకుంటారు.

వేడుకలు.. ఉత్సవాలు

ప్రతి శ్రావణమాసంలో సందర్శకులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి కల్యాణం, శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం, శివరాత్రి వేడుకలు, శ్రీరామ నవమి, గోదారంగనాథుల కల్యాణ వేడుకలు జరుగుతాయి.

వేములవాడకు అతి సమీపంలో ఉన్న నాంపల్లి గుట్ట అభివృద్ధికి తెలంగాణ పర్యాటక శాఖ రూ.29 కోట్లతో గుట్ట దగ్గర ధ్యానమందిరం, ప్లానెటోరియం, గుట్టపైకి రోప్‌వే, కాటేజీలు, లైట్ అండ్ సౌండ్స్ వంటి ఆధునిక వసతులను సమకూర్చేందుకు ప్రతిపాదించారు. గుట్టపైకి ఘాట్ రోడ్డు సౌకర్యం ఉంది.

విశిష్టతల సమ్మేళనం

నాంపల్లి గుట్టకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. అలయంతో పాటు గుట్ట కూడా ప్రత్యేకతల నిలయమే. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తుల నమ్మకం. సంతానం లేని వారు ఇక్కడికి వచ్చి మొక్కుకుంటారు. పిల్లలు పుట్టిన తర్వాత స్వామి వారి మొక్కులు తీర్చుకుంటారు.

- రాచకొండ వెంకటాచార్యులు, ఆలయ అర్చకులు


ఎలా చేరుకోవాలి..!

నాంపల్లిగుట్టకు చేరాలంటే రోడ్డు మార్గం ఒక్కటే ఉంది. హైదరాబాద్ మీదుగా రావాలంటే సిద్దిపేట, సిరిసిల్ల గుండా 152 కిలోమీటర్లు ప్రయాణించి వేములవాడ చేరుకోవాలి. అక్కడి నుంచి మూడుకిలోమీటర్ల దూరంలో నాంపల్లి గుట్ట దర్శనమిస్తుంది. కరీంనగర్‌కు 32 కిలోమీటర్ల దూరంలో వేములవాడ మార్గంలో ఉంది. జగిత్యాల మీదుగావచ్చే వారు 55 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఆర్టీసీ బస్సు సౌకర్యం, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి. గుట్టపైకి వాహనాలు వెళతాయి. మెట్ల గుండా ఆలయానికి చేరుకోవాలి.

- పూరడి మల్లికార్జున్, ‘సాక్షి’, రాజన్న సిరిసిల్ల

– ఫొటోలు: **వంకాయల శ్రీకాంత్**

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్! నేను, ఒక అబ్బాయి ఫోర్ ఇయర్స్‌గా లవ్ చేసుకుంటున్నాం. ఇద్దరం బాగా సెటిల్ అయ్యాక, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నాం. బట్ నా స్టడీస్ పూర్తయిన వెంటనే నాకు జాబ్ రాలేదు. దాంతో నాకు టెన్షన్ పెరిగిపోయింది. ఈ సమయంలోనే తనకు ఇంకో అమ్మాయి పరిచయం అయ్యింది. తనని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమైపోయాడు. దాంతో నాకు కోపం, డిప్రెషన్ ఎక్కువైపోయాయి. బయట ఉండలేక పేరెంట్స్ దగ్గరకు వచ్చేశాను. కొన్ని రోజుల తరువాత తను నాకోసం వచ్చేశాడు. ఆ అమ్మాయితో పెళ్లికి పేరెంట్స్ ఒప్పుకోలేదని చెప్పాడు. తను వెనక్కి రావడం చాలా హ్యాపీగా ఉంది కానీ, నేను ఇంకా డిప్రెషన్ నుంచి బయటకి రాలేకపోతున్నా. తనని పూర్తిగా నమ్మలేకపోతున్నా. చాలా భయమేస్తోంది లైఫ్ అంటే!! నేను తనని తప్ప ఇంకెవరినీ హజ్‌బెండ్‌లా ఊహించుకోలేకపోతున్నా. అలా చేస్తే మరొకరి జీవితాన్ని నేను పాడుచేసినట్లేగా!! నాకు ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు సార్ ప్లీజ్ సలహా ఇవ్వండి.

- అను

డిప్రెషన్ కో మారో గోలి!!

‘ఏం భాష సార్ ఇది..?’

హిందీ!

‘ఇది తెలుగు పేపర్ సార్!!’

కానీ లవ్‌కి లాంగ్వేజ్ ప్రాబ్లమ్ ఉండదు!!

‘సరే సార్ దాని అర్థం చెప్పండి. హిందీ లవ్ ఎలా ఉంటుందో అర్థమైపోతుంది..’

డిప్రెషన్‌ని కాల్చి పారెయ్యి!!

‘శభాష్ చాలా బాగుంది. గన్ మీరిస్తారా మేమే సంపాదించుకోవాలా?’

ఇట్ ఈజ్ ఎ ఫిగర్ ఆఫ్ స్పీచ్.. గన్ నాట్ నెసెసరీ!!

‘ముక్క అర్థం కాలా.. ఇప్పుడు ఇంగ్లీష్‌లో ఏడ్చింది తెలుగులో చెప్పి...’

అలంకారికంగా మాట్లాడడం అన్న మాట!!

‘లేనిది ఉన్నట్లుగానా సార్!?’

అదే అనుకో...!!

‘ఇప్పుడు మీ సిస్టర్‌కి లేని ప్రేమ ఉన్నట్లు అనిపిస్తుంది. అందువల్లే డిప్రెషన్ అనిపిస్తుంది. రెండు అడుగులు వెనక్కి వెళ్లి చూస్తే ఉన్నదీ లేనిదీ అర్థమయిపోతుంది. డిప్రెషన్ వద్దు.. పాడూ వద్దు!! అంతా కన్ఫ్యూజన్ వల్లే అవుతుంది. కొంచెం రిలాక్స్ అయితే అంతా క్లియర్‌గా బోధపడుతుంది అంటున్నారు కదా సార్!!’

అబ్బా ఇంత చెప్పానా నేను!? యు ఆర్ సింప్లీ గ్రేట్ నీలూ.. ఇంద అరటి పండు!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

	5		8			7		
		9	6		7			
7	3		2	5				9
							7	6
6	8	5	1		9	3	2	4
4	7							
2				8	3		5	7
			4		6	1		
		8			5		9	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	1	7	5	8	3	2	4	9
9	5	2	4	6	1	3	7	8
4	3	8	7	9	2	6	5	1
1	7	6	2	5	4	9	8	3
8	4	3	1	7	9	5	2	6
5	2	9	8	3	6	4	1	7
7	6	1	9	4	5	8	3	2
3	8	5	6	2	7	1	9	4
2	9	4	3	1	8	7	6	5

పన్ను పోటు

బీడీకి జీఎస్‌టీ పొగ

పొద్దంతా కష్ట పడతారు. ఆరోగ్యం పొగచూరుతున్నా లెక్క చేయకుండా బీడీలు చుడతారు.
రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా కూలి కూడా గిట్టుబాటు కాదు.
వారి బతుకులు వెళ్లబారేది ఆ కాస్త డబ్బుతోనే. బీడీలు చుట్టి చుట్టి వాళ్ల వేళ్లు వంగిపోతున్నాయి...
అంతే తప్ప వాళ్ల బతుకులు నిలబడడం లేదు.
దీనికి తోడు ‘గోరుచుట్టపై రోకటి పోటు’లా వచ్చి పడింది జీఎస్‌టీ.
ఈ వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)కు పరిశ్రమల యజమానులే వణికి పోతున్నారు.
బీడీ కార్మికులు చిగురుటాకులు కాక మరేమవుతారు?
జీఎస్‌టీతో బీడీ పరిశ్రమలు సంక్షోభం అంచుకు చేరాయి.
జీఎస్‌టీ సెగకు బీడీలు చుట్టి బతుకు వెళ్లదీస్తున్న లక్షలాది మంది ఉపాధి పొగచూరుతోంది.



గజ్జెల శశికళ, లావణ్య, వాణి, వనజ

ఇది పూర్వ కరీంనగర్ జిల్లా, వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్. గజ్జెల శశికళ కుటుంబం. శశికళ, ఆమె కూతులు, ఇద్దరు కోడళ్లు. ఈ ఇంట్లో ఉన్న నలుగురు మహిళలూ బీడీలు చుడుతున్నారు. వారికి ఈ వృత్తే జీవనాధారం. ఒకప్పుడు నెలలో 25 రోజులు పని దొరికేది. ఇప్పుడు10 రోజులకు పడిపోయింది. పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకుంటే ఒక్కొక్కరికీ వచ్చేది వంద రూపాయల లోపే. జూలై ఒకటి తర్వాత మారిన ముఖచిత్రం ఇది. వారి మాటల్లో ఆవేదన ప్రస్ఫుటమవుతుంది.

‘‘గిప్పుడేమో బీడీలకు లవుగోస అచ్చిపడ్డది. ఏదో జీఎస్టీనట అదొచ్చినంక పని దొరుకుడు కష్టమైంది. మేమంతా బీడీలు సుడితేనే తిండికి పైసలు. పిల్లలను ఎలా సాదుకునుడో ఏమో. మేము మొత్తం 12 మందిమి ఉన్నం. మా ఖర్సులు ఎట్లా ఎల్లాలే దేవుడా అని మొక్కుకుంటున్నం’’ అన్నారు దీనంగా. ఇది శశికళ ఇంటి ఆవేదన.

మరో గడపలో అడుగుపెడితే... అది దొంత కమల ఇల్లు. కోడలు శిరీషతో కలిసి కమల బీడీలు చుడుతోంది. ఈ ఇంట్లో మొత్తం ఎనిమిది మంది ఉంటారు. బీడీల పని దొరికితేనే ఈ కుటుంబానికి మూడు పూటల ముద్ద నోట్లోకి వెళ్లేది. ‘‘ఇప్పడి దాకా కిందికి మీదికో నెట్టుకొచ్చినమ్ గానీ.. ఈ జీఎస్టీ వచ్చినాక పని ఎక్కువ రోజులు దొరుకత లేదు, గిట్టుబాటు అయిత లేదు’’ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అత్తాకోడళ్లు. ఈ రెండు కుటుంబాలే కాదు, బీడీలు చుట్టి బతికే మహిళాకార్మికులను ఎవరిని కదిలించినా ఇదే వేదన.

ఇందూరు నుంచి బీడీ పరిశ్రమ

పూర్వ కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో బీడీ కార్మికులు ఎక్కువగా ఉంటారు. వ్యవసాయం, చేనేత తర్వాత ఎక్కువ కుటుంబాలు ఆధారపడింది బీడీ పరిశ్రమపైనే. వ్యవసాయ, చేనేత రంగాల్లో పని లేకపోవడంతో మగవాళ్లు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుంటారు. ఏడాదిలో పది నెలల వరకు బయటే ఉంటారు. మగవాళ్లు వచ్చే వరకు మహిళలు బీడీలు చుట్టి ఇంటిని నడుపుతుంటారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమ 1901 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా కేంద్రం(ఇందూరు)లో మొదలైంది. కిషన్‌లాల్ రామ్ సురూప్ బీడీ కంపెనీ మొదట ప్రారంభమైంది. ఇక్కడి నుంచి బీడీ పరిశ్రమ ఇతర జిల్లాలకు విస్తరించింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో 8.50 లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలే బీడీ పనిని నమ్ముకుని బతుకుతున్నారు. రాష్ట్రంలో రోజుకు దాదాపు 100 కోట్ల బీడీలు ఉత్పత్తి అవుతాయి. 40 నుంచి 50 కంపెనీలు పనిచేస్తున్నాయి. అయితే బీడీ కట్టపై పుర్రె గుర్తు పెట్టాలని గత యూపీఏ ప్రభుత్వం నిర్ణయంతో బీడీ పరిశ్రమపై అప్పట్లోనే తీవ్ర ప్రభావం పడింది. పుర్రె గుర్తు జీవోకు వ్యతిరేకంగా బీడీకార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. దీంతో పుర్రె బొమ్మ స్థానంలో ఊపిరితిత్తుల బొమ్మను ముద్రించారు. తరువాత అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం బీడీ కట్టలపై రెండు వైపులా 85 శాతం మేర గొంతు క్యాన్సర్ బొమ్మ వేయాలని 2016 ఆగస్టులో జీవో 727(ఈ) ని తీసుకువచ్చింది. కొత్తగా జీఎస్టీ పన్నుల భారం మహిళ కార్మికుల ఉపాధిని అగాధంలోకి నెట్టింది.



బీడీలు చుడుతున్న మహిళలు

ఎవరికి లాభం?

బీడీలు తాగే వాళ్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. బీడీలు చుట్టే వాళ్ల ఆరోగ్యమూ పాడవుతుంది. మరి ఇంత పెద్ద పరిశ్రమలో లాభపడుతున్నదెవరంటే... ముమ్మాటికీ ప్రభుత్వమే, దానితోపాటు కంపెనీ యాజమాన్యాలు.

కేంద్రానికి ఆదాయం కోట్లలో...

నిజమే. పేదోడి సిగిరెట్టుగా పేరున్న బీడీ ప్రభుత్వానికి భారీ ఆదాయమే సమకూర్చి పెడుతున్నది. గల్ఫ్ దేశాల్లో మంచి క్రేజ్ సంపాదించిన మన బీడీలు విదేశీమారక ద్రవ్యం ఆర్జించిపెడుతున్నాయి. మన దేశంలో రోజుకు సుమారు 150 కోట్ల బీడీలు తయారవుతుండగా, వాటిమీద ప్రభుత్వాలకు సెస్ రూపంలో రెండు కోట్ల రూపాయలు లభిస్తుందని ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. ప్రతిరోజూ ఇంత సొమ్మును ఖజానాలో జమ చేసుకుంటున్న ప్రభుత్వాలు... పొగుచూరిపోతున్న బతుకుల గురించి పట్టించుకోకపోవడమే బాధాకరం. మనదేశంలో ఏటా లక్ష నుంచి లక్షన్నర కోట్ల బీడీ వ్యాపారం జరుగుతోంది.



దొంత కమల, శిరీష (అత్తాకోడళ్లు)

బీడీ కార్మికులకు మిగిలేది జబ్బులే...

బీడీల ఉత్పత్తి ద్వారా ఇంత టర్నోవర్ ఉన్నా బీడీలు చుట్టే వారికి జబ్బులు తప్ప మరేమీ మిగలడం లేదు. బీడీలు చుట్టడమంటే ఆరోగ్యాన్ని రోజుకింత కుళ్లపొడుచుకోవడమే. రోజుకు 12 నుంచి 16 గంటల శ్రమిస్తే తప్ప ఇల్లు గడవదు. మెడ, భుజం, వెన్ను, నడుం, కాళ్లనొప్పులు, టీబీ, క్యాన్సర్, గర్భకోశ, శ్వాసకోశ వ్యాధులు, జలుబు, దగ్గు, గ్యాస్ ట్రబుల్, నీరసం, నిస్సత్తువ, మలబద్ధకం, రక్తహీనత, చూపు మందగించడం... ఇలాంటి సవాలక్ష అనారోగ్యాలే వీరు కూడబెట్టుకుంటున్న ఆస్తులు. బీడీలు చుట్టే తల్లులకు తొలికాన్పు గర్భశోకాన్నే మిగులుస్తుంది. ఎవరింట్లోనైనా తొలిబిడ్డ బతికితే పూర్వజన్మ సుకృతంగా కళ్లకు అద్దుకుంటారు. తమకు పుట్టే శిశువు బరువు అతితక్కువగా ఉండటం మరో శాపం.

బీడీ పరిశ్రమపై జీఎస్టీ ప్రభావం...

బీడీ పరిశ్రమపై బీడీలకు 2.8 శాతం, తునికాకుపై 18 శాతం, పొగాకుపై ఐదు శాతం జీఎస్టీ నిర్ణయించారు. గతంలో అన్ని కలిపితే వెయ్యి బీడీలకు సెంట్రల్ ఎక్సైజ్ టాక్స్ రూ.16లు ఉండేది. ఇప్పుడు జీఎస్‌టీ అమలుతో రూ.193ల వరకు అవుతోంది. ఫలితంగా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న బీడీ కార్మికులు, ప్యాకింగ్ కార్మికులు, బట్టీ కార్మికులు, చాటన్ కార్మికులు, టేకేదార్లు, పొగాకు రైతులు, తునికాకు కూలీల బతుకులపై తీవ్ర ప్రభావం చూపనుంది. బీడీ పరిశ్రమపై జీఎస్టీ విధించడం మూలంగా ప్రత్యక్షం, పరోక్షంగా దీనిపై ఆధారపడ్డ 8.50 లక్షల మంది కార్మికుల ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.

- గడ్డం రాజిరెడ్డి, సాక్షి, కరీంనగర్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం
16-8-2017


● ఎన్టీఆర్

తప్పు.. తప్పు.. మార్పుల్లేవ్

తప్పు.. తప్పు.. 'జై లవకుశ' విడుదల ఆలస్యమవుతోందని వచ్చిన వార్తలన్నీ తప్పే అంటోంది నందమూరి తారక రామారావు ఆర్ట్స్ సంస్థ. ముందుగా ప్రకటించిన ప్లానులో మార్పుల్లేవ్ అని ప్రకటించింది. ఎన్టీఆర్ హీరోగా కె.ఎస్. రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో నందమూరి తారక రామారావు ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్న సినిమా 'జై లవకుశ'. ప్రస్తుతం పూణెలో చిత్రీకరణ జరుగుతోందట. అయితే... చిత్రీకరణ నెమ్మదిగా జరుగుతున్న కారణంగా సినిమా విడుదలను వాయిదా వేయాలనుకుంటున్నారని కొన్ని వార్తలొచ్చాయి. వీటిని నిర్మాణ సంస్థ ఖండించింది. ముందుగా ప్రకటించినట్టుగా సెప్టెంబర్ 21నే సినిమాను విడుదల చేస్తామని ప్రకటించింది. ఇందులో ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న సంగతి తెలిసిందే. మూడు పాత్రల్లో ఒకటైన 'జై' లుక్, టీజర్ కొన్నాళ్ల క్రితమే విడుదల చేశారు. రీసెంట్‌గా రెండో క్యారెక్టర్ లవకుమార్ లుక్ విడుదల చేశారు. త్వరలో లవకుమార్ టీజర్ విడుదల చేయాలనుకుంటున్నారు. రాశీ ఖన్నా, నివేథా థామస్, నందిత హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.

సాహో శ్రద్ధ!


● శ్రద్ధా కపూర్

శ్రద్ధగా చదవండి... 'సాహో'లో ప్రభాస్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎవరో కాదు, శ్రద్ధా కపూరే. నిన్న మొన్నటివరకు 'సాహో'లో హీరోయిన్ ఎవరంటే?... 'వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేంటి?' అనే సామెత చెప్పినట్టు బోలెడన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చేవి! స్వాతంత్ర్య దినోత్సవం నాడు (నిన్న) 'సాహో' నిర్మాతలు వంశీ, ప్రమోద్ ఆ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. తమ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా శ్రద్ధా కపూర్ నటించనున్నారని ప్రకటించారు. 'రన్ రాజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'సాహో' చిత్రీకరణ కొన్ని రోజులు హైదరాబాద్‌లో జరిగింది. అయితే... అందులో ప్రభాస్ పాల్గొనలేదు. విలన్ నీల్ నితిన్ ముఖేశ్‌పై కీలక సన్నివేశాలు తీశారు. త్వరలో ప్రారంభం కానున్న సెకండ్ షెడ్యూల్‌లో ప్రభాస్ పాల్గొననున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమాకు హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్లు యాక్షన్ సీక్వెన్సులను డిజైన్ చేస్తున్నారు. 'వెన్నెల' కిశోర్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు కెమెరా: మది, కూర్పు: శేఖర్ ప్రసాద్, సంగీతం: శంకర్–ఎహసాన్–లాయ్.

చరణ్‌తో సారా!?


● రామ్‌చరణ్

సారా అంటే... సారా అలీఖాన్! హిందీ హీరో సైఫ్ అలీఖాన్, నటి అమృతా సింగ్‌ల కుమార్తె. త్వరలో ఈ అమ్మాయి తెలుగు తెరకు కథానాయికగా పరిచయం కానున్నారట. అదీ రామ్‌చరణ్ సినిమాతో! దీనికి దర్శకుడు ఎవరంటే... మణిరత్నం. ఎప్పట్నుంచో రామ్‌చరణ్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుందనే వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. కానీ, అంతకు మించి ఆ సినిమా ముందుకు కదలడం లేదు. తాజా ఖబర్ ఏంటంటే... 'రంగస్థలం' తర్వాత మణిరత్నం దర్శకత్వంలోనే చరణ్ సినిమా చేస్తారట. అందులో కథానాయికగా సారా అలీఖాన్‌ను కన్ఫర్మ్ చేశారట. తెలుగుతో పాటు హిందీలోనూ ఏకకాలంలో బైలింగ్వల్‌గా ఈ సినిమా తీయాలని మణిరత్నం సన్నాహాలు చేస్తున్నారని చెన్నై టాక్. తమిళంలో డబ్ చేసే ప్లానులో ఉన్నారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాల తరహాలో కాకుండా మణిరత్నం స్టైల్‌లో డిఫరెంట్ స్టోరీతో ఈ సినిమా రూపొందనుందట!! ఈ సంగతి పక్కనపెడితే... సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'రంగస్థలం' చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది.

తాప్సీ చాలా అందమైన దెయ్యం - ప్రభాస్

''ఓ దెయ్యం మనుషులకు భయపడటం అనే కాన్సెప్ట్‌తో ఇండియన్ సినిమాలో ఫస్ట్ టైమ్ వస్తోన్న చిత్రం 'ఆనందోబ్రహ్మ'. చాలా కొత్తగా, ఆసక్తిగా ఉంది. తాప్సీ మోస్ట్ బ్యూటీఫుల్ దెయ్యంగా నటించింది'' అని హీరో ప్రభాస్ అన్నారు. తాప్సీ, శ్రీనివాసరెడ్డి, 'వెన్నెల' కిశోర్, 'తాగుబోతు' రమేశ్, 'షకలక' శంకర్ ముఖ్య పాత్రల్లో మహి వి. రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. ఈ సినిమా ప్రీ–రిలీజ్ ఫంక్షన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాస్ మాట్లాడుతూ – ''కాన్సెప్ట్ బావుంది. విజయ్ ఎప్పుడు కలిసినా ఈ సినిమా గురించే మాట్లాడేవాడు. ఆగస్టు 18న ఈ సినిమా విడుదలవుతుంది. సినిమా సక్సెస్ తర్వాత నిర్మాత విజయ్ పార్టీ ఇవ్వాలి'' అన్నారు. ప్రముఖ నిర్మాత శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ– ''నిర్మాత విజయ్‌కు నేను వరుసకి బాబాయ్. విజయ్‌కి సినిమాలంటే ప్యాషన్. తను నిర్మించిన తొలి చిత్రం 'భలే మంచి రోజు' పెద్ద సక్సెస్ అయింది. విజయ్, శశి ఇలాంటి సక్సెస్‌లు వరుసగా సాధించాలి. ప్రభాస్ వీరిని పిలిచి డేట్స్ ఇచ్చేలా సినిమాలు చేయాలి'' అన్నారు. ''శరీరం, ఆత్మల కలయికే మనిషి. శరీరం లేని ఆత్మ దెయ్యం. అది ఎలా ఉంటుందో నాకే కాదు ఎవరికీ తెలియదనుకుంటున్నా'' అన్నారు మహి వి.రాఘవ్. తాప్సీ, విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి, హీరో సుధీర్‌బాబు, శ్రీనివాసరెడ్డి, 'వెన్నెల' కిశోర్, 'తాగుబోతు' రమేశ్, నటుడు రాజీవ్ కనకాల తదితరులు పాల్గొన్నారు.


● కె., సుధీర్‌బాబు, ప్రభాస్, మహి వి. రాఘవ్, తాప్సీ, శ్రీనివాసరెడ్డి, విజయ్ చిల్లా


● రామ్ ఆచంట, నితిన్, అర్జున్, మేఘా ఆకాశ్, హను రాఘవపూడి

ఆ రోజు రాత్రి నిద్ర పట్టలేదు - నితిన్

''అఆ' తర్వాత కొత్తగా చేయాలనుకున్నప్పుడు హను నన్ను కలిసి 'లై' లైన్ చెప్పారు. స్టోరీ రెడీ చేయమని చెప్పా. మా ఇద్దరితో పాటు నిర్మాతలు కూడా ఈ కథను నమ్మారు. మా అందరి ఏడాది కష్టమే 'లై'' అని హీరో నితిన్ అన్నారు. నితిన్, మేఘా ఆకాష్ జంటగా వెంకట్ బోయిన్‌పల్లి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మించిన 'లై' గత శుక్రవారం విడుదలైంది. హైదరాబాద్‌లో థ్యాంక్స్‌మీట్ నిర్వహించారు. నితిన్ మాట్లాడుతూ– ''ఆగస్ట్ 11న విడుదలైన మూడు సినిమాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. విడుదలకు ముందు రోజు టెన్షన్‌తో నాకు నిద్ర పట్టలేదు. ముందు యూఎస్ నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. ఇండియాలో తొలి రోజు డివైడ్ టాక్ వచ్చినా, ఇప్పుడు 85 శాతం మంది బావుందంటున్నారు. కొత్త కాన్సెప్ట్‌ను ప్రేక్షకులు ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు. ''నితిన్‌కి 'లై' లైన్ చెప్పగానే ఒప్పుకోవడం నాకెంతో హ్యాపీగా అనిపించింది. 14 రీల్స్ బ్యానర్‌లో 'కృష్ణగాడి వీర ప్రేమగాథ' సినిమా చేయడంతో నిర్మాతలు 'లై'కు నాకు మరింత స్వేచ్ఛనిచ్చారు. 150 సినిమాలు చేసిన అర్జున్‌గారు విలన్‌గా చేయడంతో ఈ సినిమాకి బలం వచ్చింది. గడచిన పదేళ్లల్లో ఇలాంటి సినిమా రాలేదని చెప్పగలను'' అన్నారు హను రాఘవపూడి. ''హీరోగా చేస్తున్న నన్ను విలన్‌గా చూపెట్టిన అందాల రాక్షసుడు హను. తనను రాక్షసుడని ఎందుకు అన్నానంటే.. పని పట్ల అంత డెడికేటెడ్‌గా ఉంటాడు. నితిన్ 102 డిగ్రీల జ్వరంతో ఉన్నా యాక్షన్ సీన్స్‌లో నటించాడు'' అన్నారు అర్జున్.

పాస్‌పోర్ట్ తిప్పలు!

''జీవితాన్ని సినిమా పెద్దగా చూపిస్తే, టీవీ చిన్నగా చూపెడుతుంది. కానీ, జీవితాన్ని జీవితంగా చూపెట్టేది నాటకం మాత్రమే. ఈ టీజర్, సాంగ్ చూస్తుంటే నాకు నాటకాల్లో పనిచేసిన రోజులు గుర్తుకొచ్చాయి. నిర్మాతగా మారుతిగారు నాకు ఇన్‌స్పిరేషన్. కొత్త కాన్సెప్ట్ సినిమాలు ఆడితేనే కొత్త వారు ఇండస్ట్రీకి రావడానికి ఆసక్తి చూపిస్తారు'' అని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. రక్షిత్, స్వాతి జంటగా చిన్నికృష్ణ దర్శకత్వంలో ఏవీఎస్ స్టూడియో సమర్పణలో దర్శకుడు మారుతి నిర్మిస్తున్న చిత్రం 'లండన్ బాబులు'. కె. సంగీతం అందించిన ఈ సినిమాలోని తొలి పాటను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హరీష్ శంకర్, స్పెషల్ టీజర్‌ను దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. మారుతి మాట్లాడుతూ– ''పాస్‌పోర్ట్ కోసం పడే తిప్పల్ని ఈ చిత్రంలో చెప్పాం. స్వాతిలో మంచి రైటర్, డైరెక్టర్ కూడా ఉన్నారు. తనకి కథ నచ్చి, చేస్తాననగానే హ్యాపీగా అనిపించింది. ఈ సినిమా రెగ్యులర్‌గా ఉండదు. నేను నిర్మించే సినిమాలకు పేరు వేసుకోవడానికి చాలా ఆలోచిస్తాను. కానీ, ఈ చిత్రం బాగా నచ్చడంతో పేరు వేసుకున్నా'' అన్నారు. ''లండన్ వెళ్లాలనుకున్న ఓ యువకుడి కథే ఈ చిత్రం'' అన్నారు చిన్నికృష్ణ. రక్షిత్, స్వాతి, ఎ.వి.ఎస్. ప్రకాశ్, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: కిరణ్ తలసిల, దాసరి వెంకట సతీష్.


● స్వాతి, రక్షిత్

కొత్త ఐడియాతో...


● 'సచ్చింది రా గొర్రె'లో ఓ దృశ్యం

శ్రీనివాసరెడ్డి, టిల్లు వేణు, శివారెడ్డి, రాకేశ్ ముఖ్య తారలుగా శ్రీధర్‌రెడ్డి యార్వ దర్శకత్వంలో సోహం రాక్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎంటైర్‌టైన్‌మెంట్ స్టూడియో బ్యానర్లపై నిర్మాతలు దీపక్ ముకుత్, పాషా నిర్మిస్తున్న చిత్రం 'సచ్చింది రా గొర్రె'. ''కొత్త కంటెంట్‌ని, ఐడియాస్‌ని ప్రోత్సహించే సోహం రాక్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతో కలసి వినోదాత్మకంగా సాగే సినిమాలను నిర్మించాలనుకుంటున్నాం. మంచి కథలను, టాలెంట్‌ని ప్రోత్సహిస్తూ క్వాలిటీ సినిమాలు చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాత పాషా. ''దక్షిణాది సినిమాల్లో వినూత్నమైన ప్రయోగాలు జరుగుతున్నాయి. కొత్త టాలెంట్‌ని వెతికి పట్టుకుని ప్రోత్సహిస్తూ నిర్మాణం చేపట్టడమే మా లక్ష్యం'' అన్నారు నిర్మాత దీపక్ ముకుత్. ఈ చిత్రానికి అసోసియేట్ ప్రొడ్యూసర్: అపర్ణా కిటే, సంగీతం: సంతోష్‌కుమార్.

అదృశ్యం


● జాన్, శివకుమార్, రవిప్రకాశ్

ప్రముఖ దర్శకులు సింగీతం శ్రీనివాస రావు, కె. విశ్వనాథ్‌ల శిష్యుడు రవి ప్రకాశ్ క్రిష్ణంశెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'అదృశ్యం'. జాన్ హీరోగా, అంగనారాయ్, ప్రియాంక హీరోయిన్లుగా వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పారిశ్రామికవేత్త జాన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత మల్కాపురం శివకుమార్ క్లాప్ ఇచ్చారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నెల 25వరకూ తొలి షెడ్యూల్ జరిపి, సెప్టెంబర్‌లో సిక్కిం, హిమాచల్‌లలో పాటలు తీస్తాం. ఏఆర్ రెహమాన్ శిష్యుడు ఎ.కె. ఆల్‌డ్రిన్ స్వరకర్త'' అన్నారు రవిప్రకాశ్ క్రిష్ణంశెట్టి. ఈ చిత్రానికి కెమెరా: రామ్ పినిశెట్టి, మాటలు: నాగులకొండ నవకాంత్.

సాక్షి
భవిత
బుధవారం 16-8-2017
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ హిస్టరీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

పరీక్ష తేదీలు

- బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఏఎస్ఐ (స్టెనో) 2017 (పీఎస్‌టీ) ఎగ్జామ్: ఆగస్టు 18
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్యూబర్క్యులోసిస్ అండ్ రెస్పిరేటరీ డిసీజెస్ (ఎన్ఐటీఆర్‌డీ)లో అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) పోస్టులకు రాతపరీక్ష: ఆగస్టు 18
- ఎయిమ్స్-న్యూఢిల్లీలో మెడికల్ సోషల్ సర్వీస్ ఆఫీసర్ గ్రేడ్-2, వర్క్‌షాప్ (ఆర్‌అండ్‌ఏఎల్) పోస్టులకు సీబీటీ: ఆగస్టు 19



స్థానిక సంస్థలు
మండల పరిషత్



గ్రూప్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో 'తాలూకా పంచాయతీ' అని, మధ్యప్రదేశ్‌లో 'జన్‌పథ్ పంచాయతీ', తమిళనాడులో 'పంచాయతీ సంఘ్', అరుణాచల్ ప్రదేశ్‌లో 'అంచల్ కమిటీ', ఉత్తరప్రదేశ్‌లో 'క్షేత్ర పంచాయతీ', ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'మండల పరిషత్' అని వ్యవహరిస్తున్నారు.

నిర్మాణం

మధ్య స్థాయిలో గల స్థానిక సంస్థ 'మండల పరిషత్'. ఇది స్థానిక సంస్థలకు సంబంధించి జనాభా, భౌగోళిక ప్రాతిపదికన విభజించిన భాగం. సాధారణంగా పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాను మండలాలుగా విభజిస్తారు. అవి రెవెన్యూ పరంగా ఉంటాయి. కాబట్టి వాటిని రెవెన్యూ మండలాలు అంటారు. జిల్లాల్లో రెవెన్యూ మండల సరిహద్దులు, మండల పరిషత్ సరిహద్దులు ఒకే విధంగా ఉంటాయి. అయితే నగరాల్లో మాత్రం రెవెన్యూ మండలాల సంఖ్యకు, మండల పరిషత్‌ల సంఖ్యకు సంబంధం ఉండదు. నగరాల్లో రెవెన్యూ మండలాలు ఉంటాయి. కానీ, మండల పరిషత్తులు ఉండకపోవచ్చు.

మండల పరిషత్‌లో సభ్యులు

- మండల పరిషత్ సభ్యులు.
- కో-ఆప్టెడ్ సభ్యులు.
- హోదా రీత్యా సభ్యులు
- శాశ్వత ఆహ్వానితులు
- ప్రత్యేక ఆహ్వానితులు.
- మండల పరిషత్ అధ్యక్షుడు/ఉపాధ్యక్షుడు.
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి.
- మండల మహాసభ.

ఎంపీటీసీ

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యు (ఎంపీటీసీ)లను నేరుగా ఓటర్లు ఐదేళ్ల వ్యవధికి ఎన్నుకుంటారు. వీరి ఎన్నిక పార్టీ పరంగా జరుగుతుంది. సుమారు 3 వేల నుంచి 4 వేల జనాభా కలిగిన ప్రాంతాలను ఎంపీటీసీ స్థానాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక మండలంలో కనిష్టంగా 7 ఎంపీటీసీ స్థానాల నుంచి గరిష్టంగా 23 స్థానాల వరకు ఉంటాయి.

- **కో- ఆప్టెడ్ సభ్యులు:** మైనారిటీ వర్గానికి చెందిన ఒక సభ్యుడిని తమకున్న ఎంపీటీసీ స్థానాలను బట్టి ఆయా పార్టీలు కో-ఆప్టెడ్ సభ్యుడిగా ఎన్నుకుంటాయి.
- **హోదా రీత్యా సభ్యులు:** సంబంధిత మండలంలో పూర్తిగా లేదా పాక్షికంగా తమ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉన్న విధానసభ సభ్యుడు, లోక్‌సభ సభ్యుడు, ఆ మండలంలో ఓటరుగా నమోదైన రాజ్యసభ సభ్యుడు హోదా రీత్యా మండల పరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. వీరికి మండలాధ్యక్షుడు, ఉప మండలాధ్యక్షుడి ఎన్నికల్లో ఓటు వేసే అధికారం ఉండదు.
- **శాశ్వత ఆహ్వానితులు:** పై సభ్యులే కాకుండా మండల పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులుగా కింద పేర్కొన్నవారు హాజరవుతారు. వీరికి ఎలాంటి ఓటింగ్ హక్కులు ఉండవు.
  - జిల్లా కలెక్టర్.
  - మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచులు.
  - జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు.
  - జిల్లా పరిషత్ చైర్మన్.
  - జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్.
- **ప్రత్యేక ఆహ్వానితులు :** సంబంధిత మండల పరిషత్తులోని ఏదైనా రంగంలో విశేష అనుభవం ఉన్న వ్యక్తులను మండల పరిషత్ అధ్యక్షుడితో సంప్రదించి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవొచ్చు.

మండల పరిషత్ అధ్యక్ష/ఉపాధ్యక్షులు

మండల పరిషత్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉంటారు. ఎంపీటీసీ సభ్యులు పార్టీ ప్రాతిపదికపై వీరిని ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం ఐదేళ్లు.

- **తొలగింపు, రాజీనామా:** అవిశ్వాస తీర్మానం ద్వారా మండలాధ్యక్షుడిని, ఉప మండలాధ్యక్షుడిని తొలగించవచ్చు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై మొత్తం సభ్యుల్లో 50 శాతం సభ్యులు సంతకాలు చేసి ఆ నోటీసును సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి ఇవ్వాలి. మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతులకు తగ్గని మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదిస్తే వారు తొలగింపునకు గురవుతారు. ఈ ప్రక్రియలో ఎన్నికైన సభ్యులు (ఎంపీటీసీలు) మాత్రమే పాల్గొంటారు. అయితే ఎన్నికైన మొదటి నాలుగేళ్లలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించేందుకు అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరిని అధికార దుర్వినియోగం, అవినీతి కారణాలపై తొలగించవచ్చు.
- మండల పరిషత్ అధ్యక్షుడు తన రాజీనామా పత్రాన్ని మండల పరిషత్‌కు సమర్పిస్తారు. అలా కాని పక్షంలో జిల్లా పంచాయతీ కార్య నిర్వహణ అధికారికి సమర్పిస్తారు.

ఎంపీడీవో - అధికార విధులు

మండల పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో). వీరిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. గ్రూప్-1 సర్వీసుకు చెంది ఉంటారు.

చట్టపరమైన విధులు

- మండల పరిషత్ సమావేశాల ఏర్పాటు, అజెండా తయారుచేయడం.
- మండల పరిషత్ చేసిన తీర్మానాలను అమలు చేయడం. దీంతోపాటు మండలాల్లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.
- గత సమావేశం నుంచి 90 రోజుల్లోపు మరో సమావేశం ఏర్పాటు చేయకపోతే ఎంపీడీవోపై క్రమశిక్షణ చర్య తీసుకుంటారు.
- మండల పరిషత్ సమావేశానికి హాజరై చర్చలో పాల్గొనవచ్చు. ఓటు వేయడానికి, తీర్మానాలను ప్రతిపాదించడానికి హక్కు లేదు. మండల పరిషత్‌కు బడ్జెట్‌ను తయారుచేసి, జిల్లా పరిషత్ ఆమోదానికి పంపాలి.
- మండల పరిషత్ పరిపాలన నివేదికను తయారు చేసి మండల పరిషత్ ఆమోదానికి పంపుతారు.

పరిపాలనాధికారాలు

మండల పరిషత్‌లో పనిచేసే సిబ్బందిపై పరిపాలనా నియంత్రణ ఉంటుంది. నెలకు కనీసం రెండుసార్లు గ్రామాల్లో బస చేయాలి. అలాగే నెలకు 16 రోజులు మండల పర్యటన చేయాలి. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బీసీ హాస్టళ్లను తనిఖీ చేసే అధికారం ఉంటుంది.

విద్యా సంబంధిత అధికారాలు

- మండల పరిషత్ పాఠశాలలకు సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ఉంటారు. మండల విద్యా కమిటీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండల పరిధిలోని టీచర్ల బదిలీల్లో మెంబర్‌గా వ్యవహరిస్తారు.
- గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తారు.
- మండలంలో జరిగే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు అన్నీ ఎంపీడీవో పర్యవేక్షణ, నియంత్రణలో ఉంటాయి.

మండల మహాసభ

మండల పరిషత్‌కు మండల మహాసభ సలహాపూర్వక అంగంగా వ్యవహరిస్తుంది. మండల పరిషత్తు పరిధిలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, మండల పరిషత్తు సభ్యులు ఉంటారు. దీని సమావేశాలకు మండల పరిషత్ అధ్యక్షుడు అధ్యక్షత వహిస్తారు. మండల మహాసభ.. మండల పరిషత్తుకు సంబంధించిన వార్షిక బడ్జెట్, ఆడిట్ నివేదిక, గత సంవత్సర వార్షిక బడ్జెట్, వార్షిక పరిపాలనా నివేదిక తదితర అంశాలను చర్చిస్తుంది. మండల పరిషత్తుకు, గ్రామాల మధ్య వారధిగా జిల్లా పరిషత్తు పనిచేస్తుంది.

మండల పరిషత్తు అధికార విధులు

- సమాజ అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను మండల పరిషత్ అమలు చేస్తుంది.
- వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించేందుకు రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, గొట్టపు బావుల తవ్వకం, రుణ సదుపాయాలు, ఎరువుల పంపిణీ వంటి చర్యలు చేపడుతుంది.
- గ్రామీణ వైద్యశాలలు, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తుంది.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య, కుటీర పరిశ్రమలు, మహిళా, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంది.

ఆదాయ మార్గాలు


మండల పరిషత్‌కు కింది పద్ధతుల్లో ఆదాయం సమకూరుతుంది.

- రాష్ట్ర ప్రభుత్వ భూమి శిస్తు, పన్నుల్లో వాటా.
- రిజిస్ట్రేషన్ శాఖ ఆస్తి బదిలీలపై వేసే 2 శాతం సర్‌చార్జీలను గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 3:1:1 నిష్పత్తిలో పంపిణీ చేస్తారు.
- లఘు ఖనిజాలపై కొంత సీనరేజ్ రుసుం పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్తులకు 25:50:25 నిష్పత్తిలో పంపిణీ అవుతుంది. అలాగే, ఇసుకపై వచ్చే సీనరేజ్ రుసుంను కూడా పై నిష్పత్తిలోనే పంపిణీ చేస్తారు.
- సామాజిక అభివృద్ధి గ్రాంట్లు.
- గ్రామ పంచాయతీలకు లెవీ ద్వారా వచ్చే వసూళ్లు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు.
- అఖిల భారత సంస్థలు విడుదల చేసే సహాయక గ్రాంట్లు.

బి. కృష్ణారెడ్డి
డైరెక్టర్,
క్లాస్ వన్ స్టడీ సర్కిల్,
హైదరాబాద్.



ఏ లైఫ్ ఇన్ సైన్స్ పుస్తక రచయిత?



కాంపిటీటివ్ గైడెన్స్
జీకే అండ్ కరెంట్ అఫైర్స్

- **ఇందిరా గాంధీ:** ఏ లైఫ్ ఇన్ నేచర్ – జైరాం రమేష్
- **యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్:** ద బ్రిటిష్ ఎంపైర్ ఇన్ ఇండియా – శశి థరూర్
- **కాన్‌ఫ్లిక్ట్స్ ఆఫ్ ఇంట్రెస్ట్:** మై జర్నీ త్రూ ఇండియాస్ గ్రీన్ మూవ్‌మెంట్ –సునీతా నారాయణ్
- ది సర్పెంట్స్ రివేంజ్ – సుధా మూర్తి
- చోక్డ్ – పల్లవి అయ్యర్
- ది లెజెండ్ ఆఫ్ లక్ష్మీప్రసాద్ – ట్వింకిల్ ఖన్నా
- **ఫిరోజ్:** ది ఫర్‌గాటెన్ గాంధీ – బెర్టిల్ ఫాక్
- ది సెల్ ఔట్ – పాల్ బీటీ
- **1991:** హౌ పి.వి.నరసింహారావు మేడ్ హిస్టరీ – సంజయ్ బారు
- **డ్రైవెన్ :** ద విరాట్ కోహ్లీ స్టోరీ – విజయ్ లోకపల్లి
- **ఛాయిసెస్:** ఇన్‌సైడ్ ది మేకింగ్ ఆఫ్ ఇండియాస్ ఫారెన్ పాలసీ – శివ్‌శంకర్ మీనన్
- థింగ్స్ టు లీవ్ బిహైండ్ – నమితా గోఖలే
- **కోహినూర్:** ద స్టోరీ ఆఫ్ ది వరల్డ్స్ మోస్ట్ ఇన్‌ఫేమస్ డైమండ్ – విలియం డాల్‌రింపుల్, అనితా ఆనంద్
- ఎక్సైల్ – తస్లీమా నస్రీన్
- ఏ లైఫ్ ఇన్ సైన్స్ –సి.ఎన్.ఆర్.రావు
- **ది పీపుల్స్ ప్రెసిడెంట్:** ఎ.పి.జె.అబ్దుల్ కలాం – ఎస్.ఎం.ఖాన్
- యాన్ అన్‌సూటబుల్ బాయ్ – కరణ్ జోహార్
- **హిమాలయ:** అడ్వెంచర్స్, మెడిటేషన్స్, లైఫ్ – రస్కిన్ బాండ్, నమితా గోఖలే
- **అఖాడా:** ది ఆథరైజ్డ్ బయోగ్రఫీ ఆఫ్ మహవీర్ సింగ్ ఫోగట్ – సౌరభ్ దుగ్గల్
- స్టాండింగ్ ఆన్ యాన్ ఆపిల్ బాక్స్ – ఐశ్వర్యా ధనుష్
- **డిఫీట్ ఈజ్ యాన్ ఆర్ఫన్:** హౌ పాకిస్తాన్ లాస్ట్ ది గ్రేట్ సౌత్ ఏషియన్ వార్ – మైరా మెక్ డొనాల్డ్
- మాతోశ్రీ – సుమిత్రా మహాజన్
- వాట్ యు కెన్ లెర్న్ ఫ్రమ్ మిలటరీ ప్రిన్సిపుల్స్ – వీరేందర్ కపూర్
- కలెక్టివ్ ఛాయిస్ అండ్ సోషల్ వెల్ఫేర్ – అమర్త్యసేన్
- మిస్టర్ అండ్ మిసెస్ జిన్నా – షీలా రెడ్డి
- ఇండియాస్ బ్రోకెన్ ట్రిస్ట్ – తవ్లీన్ సింగ్
- మై స్టోరీ – మైకేల్ క్లార్క్
- ఏస్ ఎగెనెస్ట్ ఆడ్స్ – సానియా మీర్జా
- డీమానిటైజేషన్ అండ్ బ్లాక్ మనీ – సి.రామ్‌మనోహర్ రెడ్డి
- ఏ లైఫ్ ఇన్ డిప్లొమసీ – మహారాజకృష్ణ రసగోత్ర
- **ది గ్రేట్ డిరేంజ్‌మెంట్:** క్లైమేట్ చేంజ్ అండ్ ది అన్‌థింకబుల్ – అమితావ్ ఘోష్
- కరేజ్ అండ్ కమిట్‌మెంట్ – మార్గరెట్ ఆల్వా
- **ఓల్డ్ హిస్టరీ న్యూ జాగ్రఫీ:** బైఫర్‌కేటింగ్ ఆంధ్రప్రదేశ్ – జైరాం రమేష్
- ఫ్యామిలీ లైఫ్ – అఖిల్ శర్మ
- స్పీకింగ్ ది మోదీ వే – వీరేందర్ కపూర్
- సెలెక్షన్ డే – అరవింద్ అడిగ
- డెమొక్రాట్స్ అండ్ డిసెంటర్స్ – రామచంద్ర గుహ
- ఏ హార్స్ వాక్స్ ఇన్‌టు ఏ బార్ – డేవిడ్ గ్రాస్‌మన్
- **హాఫ్ లయన్:** హౌ పి.వి.నరసింహారావు ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇండియా – వినయ్ సీతాపతి
- హూ మూవ్డ్ మై ఇంట్రెస్ట్ రేట్? – దువ్వూరి సుబ్బారావు
- **అడ్వైస్ అండ్ డిసెంట్:** మై లైఫ్ ఇన్ పబ్లిక్ సర్వీస్ –వై.వి.రెడ్డి
- **ఆన్ మై టర్మ్స్:** ఫ్రమ్ ద గ్రాస్‌రూట్స్ టు ది కారిడార్స్ ఆఫ్ పవర్ – శరద్ పవార్
- ది మినిస్ట్రీ ఆఫ్ అట్‌మోస్ట్ హ్యాపీనెస్ –అరుంధతీరాయ్

గమనిక: ఈ నెల 10వ తేదీన **'భారత రాష్ట్రపతులు'** శీర్షికన ప్రచురితమైన ఆర్టికల్‌లో.. 'జ్ఞానీ జైల్‌సింగ్ 1982 ఏప్రిల్ 25' నుంచిలో.. ఏప్రిల్‌కు బదులుగా జూలై అని చదువుకోగలరు.

ఎన్.విజయేందర్‌రెడ్డి
జనరల్ అవేర్‌నెస్
సీనియర్ ఫ్యాకల్టీ



What is Fiscal Policy?

- **GNP (Gross National Product)**
  The Market Value (in Money terms), of all the final goods and services that are produced in a year by the citizens of a country. It includes the value of exports minus imports.
- **GDP (Gross Domestic Product)**
  The Market Value (in money terms), of all the final goods and services that are produced in a year in a country. It does not consider the value of exports and imports.
- **GVA (Gross Value Added)**
  The Market Value (in Money terms), of all the final goods and services that are produced in a year in a country minus the cost of all inputs and raw materials that are directly used in the production of them.
- **GSDP (Gross State Domestic Product)**
  The term is generally used to denote the income produced in a particular state of our country in a year.
- **DSDP (District State Domestic Product)**
  The term is generally used to denote the income produced in a particular District of a state of our country in a year.
- **Per Capita Income**
  The income of an individual earned in a year on an average. It is calculated by dividing the National Income by the total population of a country.
- **Disposable Income**
  It is the income, equal to Personal Income minus Personal Taxes (Direct Taxes).
- **What is NSO?**
  National Statistical Office (NSO), the statistical wing of Ministry of Statistics and Programme Implementation of Govt. of India. It consists of CSO (Central Statistical Office) and NSSO (National Sample Survey Office).
- **What is Statistics Day?**
  In recognition of the notable contributions made by (Late) Professor Prasanta Chandra Mahalanobis in the field of economic planning and statistical development, the Government of India has designated 29th June every year, coinciding with his birth anniversary, as the Statistics Day in the category of Special Day to be celebrated at the national level.
- **What is MPLADS?**
  Member of Parliament Local Area Development Scheme, initiated in 1993. At present, the annual entitlement per MP/Constituency is 5 crores.
- **What is Economy?**
  Economy is a man made arrangement to provide goods and services, employment, income for a society. Basically, it consists of Primary Sector (Agriculture etc.,), Secondary Sector (Industrial sector etc.,) and Services Sector (Banks, Insurance, Professionals etc.,)
  Ex. World economy, Indian economy, AP economy etc.,
  Economic Activities are the day to day activities of a society with the help of money and to make money.
- **What is the main goal of an Economy?**
  The basic goal of an economy is to achieve Growth/development in the economy. The growth in economy is helpful in providing more employment, income and goods and services. This process when combined with the protection of environment and future generations needs also, it is commonly known as Sustainable Development.
- **What are the goods and services?**
  Goods examples: food, machinery, day to day needs items to satisfy our requirements. They are visible and handmade or produced with the help of machines.
  Services examples: cable tv, cell phone service, bank, insurance, teacher, lawyer, doctor services etc.They are invisible and mostly rendered with the help of human intellectual capabilities and not entirely on machines.
  In earlier days, people are satisfied with limited number of goods and services and exchanged them among themselves through barter system. But, now-a-days, people are interested in large scale production of goods and extensive services and are exchanging with the help of money as a medium of exchange. (Monetary System). Production of more goods and services has become the main goal of any society.
- **What is Growth and What is Development?**
  In Economics, both economic growth and economic development are used as synonyms most of the times. But 'economic growth' is a term broadly used to denote the increase in the National Income in a year as compared to the previous financial year. It is mostly a quantitative phenomenon.
  Whereas, the term 'economic development' has a deeper meaning. It represents the qualitative changes in an economy relating to technological and institutional changes (human rights, press freedom, autonomous institutions like RBI, Election Commission, good policy making etc.,)
  For a country to achieve full employment, high levels of availability of goods and services both growth and development are necessary. They are inseparable and for certain academic purposes, we distinguish them.
- **What is SDG ?**
  United Nations formulated Sustainable Development Goals (SDGs) to direct all the countries to achieve sustainable development. These SDGs consist of 17 goals and 169 measurable targets to be achieved by 2030.
- **What happens in the absence of economic growth/development?**
  If the economy is not able to achieve the needy growth, the situation is known as underdevelopment or backwardness. To achieve growth the economy needs investment. But, if the money circulation exceeds it may lead to inflation. If the level of investment and economic activities decline, it may lead to recession.
- **How does the Monetary Policy help an economy?**
  The policy to control the interest rates and money circulation in an economy is known as Monetary and Credit Policy of RBI. In the absence of proper monetary policy, the economy may face either inflation or recession.
- **What is Fiscal Policy?**
  The activities/policies related to the collection of revenue by the Govt. in the form of taxes and Public Expenditure by the Govt. and Public Debt (loans by the govt.) are collectively known as Fiscal Policy.The annual Budget by the Govts. is an indicator of Fiscal Policy. This policy mainly aims at achieving higher economic growth, reduction in social/economic/regional inequalities, provision of infrastructure (roads, electricity, water etc.,).



Competitive Guidance
Economy- Basic Concepts

బి.శ్రీనివాసరావు,
లెక్చరర్ (ఎకనామిక్స్),
పి.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ,
కాకినాడ.



ఐబీపీఎస్...పీవో/ఎంటీ 3,562 ఖాళీలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. వివిధ బ్యాంకుల్లోని 3,562 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో)/ మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ) ఖాళీలకు కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్-సీడబ్ల్యూఈ పీవో/ ఎంటీ-7 ద్వారా దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు:** ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో)/మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ).
- **మొత్తం ఖాళీలు :** 3,562 (అన్ రిజర్వ్‌డ్-1,738 +ఓబీసీ 961+ ఎస్సీ- 578 + ఎస్టీ-285).
- **అర్హతలు :** ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయో పరిమితి :** 2017 ఆగస్టు 1 నాటికి 20-30 ఏళ్ల లోపు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం :** మూడు దశల్లో ఉంటుంది. అవి.. ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ.
- **పరీక్షల విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్స్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ :** మార్కులు 100; వ్యవధి గంట.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	మీడియం
రీజనింగ్ ఎబిలిటీ	35	35	ఇంగ్లిష్, హిందీ
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30	ఇంగ్లిష్
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	35	35	ఇంగ్లిష్, హిందీ
మొత్తం	**100**	**100**	-----

- **మెయిన్ ఎగ్జామినేషన్:** మొత్తం 225 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్- 45 ప్రశ్నలు 60 మార్కులు (వ్యవధి గంట), జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్.. 40 ప్రశ్నలు 40 మార్కులకు (వ్యవధి 35 నిమిషాలు), ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్.. 35 ప్రశ్నలు 40 మార్కులు (40 నిమిషాలు), డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్.. 35 ప్రశ్నలు 60 మార్కులు (వ్యవధి 45 నిమిషాలు), లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే (ఇంగ్లిష్)-2 ప్రశ్నలు 25 మార్కుల (వ్యవధి 30 నిమిషాలు)కు ఉంటాయి.
- **రుణాత్మక మార్కులు:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్ రెండింట్లోనూ ప్రతి తప్పు సమాధానానికి 0.25 చొప్పున నెగిటివ్ మార్కు ఉంటుంది.
- **ఇంటర్వ్యూ:** మెయిన్ ఎగ్జామినేషన్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ మొత్తం 100 మార్కులకు ఉంటుంది. మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూలో మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో):** ఆంధ్రప్రదేశ్‌లో.. చీరాల, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం; తెలంగాణలో.. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
- **మెయిన్ ఎగ్జామినేషన్ కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో):** ఆంధ్రప్రదేశ్‌లో.. గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం; తెలంగాణలో.. హైదరాబాద్.
- **నోట్:** ఐబీపీఎస్ నిర్ణయాన్ని బట్టి పరీక్షల కేంద్రాల్లో మార్పులు చోటు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.100; మిగిలిన అభ్యర్థులకు రూ.600.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** **www.ibps.in**

ముఖ్య తేదీలు:

- **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:** ఆగస్టు 16, 2017
- **ఆన్‌లైన్ దరఖాస్తుల ముగింపు:** సెప్టెంబర్ 5, 2017
- **ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు ప్రక్రియ:** ఆగస్టు 16, 2017- సెప్టెంబర్ 5, 2017
- **ప్రి-ఎగ్జామ్ ట్రైనింగ్ కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** సెప్టెంబర్, 2017
- **ప్రి-ఎగ్జామ్ ట్రైనింగ్ :** సెప్టెంబర్ 23-29, 2017
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కాల్ లెటర్ డౌన్‌లోడ్:** సెప్టెంబర్, 2017
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్(ఆన్‌లైన్):** అక్టోబర్ 7,8,14,15, 2017
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ ఫలితాలు:** అక్టోబర్, 2017
- **మెయిన్ ఎగ్జామినేషన్ కాల్ లెటర్ డౌన్‌లోడ్:** నవంబర్, 2017
- **మెయిన్ ఎగ్జామినేషన్(ఆన్‌లైన్):** నవంబర్ 26, 2017
- **మెయిన్ ఎగ్జామినేషన్ ఫలితాలు:** డిసెంబర్, 2017
- **ఇంటర్వ్యూ కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** జనవరి, 2018
- **ఇంటర్వ్యూ:** జనవరి/ఫిబ్రవరి, 2018
- **ప్రొవిజినల్ అలాట్‌మెంట్:** ఏప్రిల్ 2018

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో అప్రెంటీస్ 172 ఖాళీలు

కేరళలోని కొచిలో ఉన్న కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. 172 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టు పేరు-ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటీసెస్-72(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-12, మెకానికల్ ఇంజనీరింగ్-27, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-6, సివిల్ ఇంజనీరింగ్-12, కంప్యూటర్‌సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-8, సేఫ్టీ ఇంజనీరింగ్-3, మెరైన్ ఇంజనీరింగ్-2, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్‌బిల్డింగ్-2) ; టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటీసెస్-100(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-22, మెకానికల్ ఇంజనీరింగ్-28, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-8, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్-7, సివిల్ ఇంజనీరింగ్-9, కంప్యూటర్ ఇంజనీరింగ్-6, కమర్షియల్ ప్రాక్టీస్-20).
- **శిక్షణ వ్యవధి:** ఏడాది
- **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కు రూ.8,000; టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటీస్-రూ.7 వేలు
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/ బీటెక్/డిప్లొమా.
- **వయో పరిమితి:** అప్రెంటీస్‌షిప్ నిబంధనల ప్రకారం.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల మార్కుల శాతం అనుసరించి షార్ట్‌లిస్టింగ్.
- **దరఖాస్తు విధానం:** ఎన్ఏటీఎస్ (నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రెనింగ్ స్కీమ్)లో రిజిస్టర్ అయి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 31, 2017.
- **వెబ్‌సైట్:** **www.cochinshipyard.com**



ముంబై పోర్ట్ ట్రస్ట్ స్పోర్ట్స్ క్లబ్‌లో 56 ఖాళీలు

ముంబై పోర్ట్ స్పోర్ట్స్ క్లబ్.. 56 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది.

- **పోస్టు పేరు:** స్పోర్ట్స్ ట్రైనీ
- **పోస్టులు:** 56 (పురుషులు 54+మహిళలు 2).
- **ఖాళీలు:** అథ్లెటిక్స్-5, షటిల్ బ్యాడ్మింటన్-3, బాడీ బిల్డింగ్-2, క్రికెట్-8, ఫుట్‌బాల్-9, హాకీ-9, కబడ్డీ-7, టేబుల్ టెన్నిస్-2, వాలీబాల్-6, వెయిట్ లిఫ్టింగ్-5.
- **నోట్:** అథ్లెటిక్స్ విభాగంలో రెండు పోస్టులను మహిళలకు కేటాయించారు. మిగిలినవన్నీ పురుషులకే.
- **అర్హతలు:** సంబంధిత క్రీడా విభాగాల్లో మూడేళ్లుగా (2014, 2015, 2016) దేశం తరపున అంతర్జాతీయ/జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలి. లేదా జాతీయ స్థాయిలో కంబైన్డ్ యూనివర్సిటీ టీమ్‌లో కానీ, యూనివర్సిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో కానీ పాల్గొని ఉండాలి. 'ఏ' డివిజన్ క్రికెట్ లేదా సూపర్/ఎలైట్ డివిజన్ (హాకీ, ఫుట్‌బాల్)లో ప్రాతినిధ్యం వహించి ఉండాలి.
- **వయో పరిమితి:** 2017 ఆగస్టు 10 నాటికి 18-26 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** క్రీడా విభాగాల్లో సాధించిన విజయాల ఆధారంగా...
- **స్టైపెండ్:** రూ.15 వేలు. ఇదికాక కిట్‌కు రూ.10 వేలు, మెడికల్ క్లైమ్ + యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ రూ.3,500 (ఏడాదికి) ఉంటాయి. ఉచిత వసతి కల్పిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు కాపీలు పంపాల్సిన చిరునామా:** జేటీ.జనరల్ సెక్రెటరీ, ముంబై పోర్ట్ ట్రస్ట్ స్పోర్ట్స్ క్లబ్, సెకండ్ ఫ్లోర్, రైల్వే మేనేజర్స్ బిల్డింగ్, రామ్‌జీ భాయ్ కమని మార్గ్, నియర్ వసంత్ హోటల్, బల్లార్డ్ ఎస్టేట్, ముంబై-400001.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** ఆగస్టు 31, 2017
- **వెబ్‌సైట్:** **www.mumbaiport.gov.in**

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 696 ఖాళీలు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న తన శాఖల్లోని 696 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువరించింది. యూఐఐసీఎల్ భారత ప్రభుత్వ ఆధీనంలోని పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్
- **వేతనం:** రూ.14,435-రూ.32,030+ నిబంధనల మేర ఇతర అలవెన్సులు. ఉద్యోగ ప్రాంతాన్ని బట్టి వేతనంలో స్వల్ప మార్పులు ఉండవచ్చు.
- **మొత్తం పోస్టులు:** 696 (అన్‌రిజర్వ్‌డ్-414, ఓబీసీ-122, ఎస్సీ-110, ఎస్టీ-50).
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-32(అన్‌రిజర్వ్‌డ్-14, ఓబీసీ-6, ఎస్సీ-7, ఎస్టీ-5); తెలంగాణ-20(అన్‌రిజర్వ్‌డ్-13, ఎస్సీ-3, ఎస్టీ-4).
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ. అలాగే స్థానిక భాషలో మంచి పట్టు (మాట్లాడగలగడం, చదవడం, రాయడం) తప్పనిసరి.
- **వయో పరిమితి:** 2017 జూలై 30 నాటికి 18-28 ఏళ్ల లోపు ఉండాలి; ఎస్సీ /ఎస్టీ కేటగిరీలకు అయిదేళ్లు, ఓబీసీ-మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయో పరిమితిలో సడలింపు ఉంది. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ కేటగిరీల్లోని దివ్యాంగ అభ్యర్థులకు, ఎక్స్-సర్వీస్‌మెన్ కేటగిరీకి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఎగ్జామినేషన్. ఇందులో టైర్-1 (ప్రిలిమినరీ ఎగ్జామినేషన్), టైర్-2 (మెయిన్ ఎగ్జామినేషన్) దశలు ఉంటాయి.
- **పరీక్షల (ప్రిలిమినరీ, మెయిన్స్) విధానం:** టైర్-1 (ప్రిలిమినరీ ఎగ్జామినేషన్) ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్-30 ప్రశ్నలు, రెండో విభాగంలో టెస్ట్ ఆఫ్ రీజనింగ్-35, మూడో విభాగంలో టెస్ట్ ఆఫ్ న్యూమెరికల్ ఎబిలిటీ-35 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి గంట. ఇందులో కనీస అర్హత మార్కులు వచ్చిన అభ్యర్థుల్లో రాష్ట్ర, కేటగిరీ ప్రకారం 1:7 నిష్పత్తిలో మెరిట్ జాబితా తయారుచేస్తారు. వీరికి టైర్-2 (మెయిన్) ఎగ్జామినేషన్ ఉంటుంది. టైర్-2 (మెయిన్ ఎగ్జామినేషన్)లో ఐదు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగానికి 50 మార్కుల చొప్పున మొత్తం 250 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులోని ఐదు విభాగాలు.. టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, టెస్ట్ ఆఫ్ న్యూమెరికల్ ఎబిలిటీ. ఇందులోనూ నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారికి స్థానిక భాషపై పరీక్ష (రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్) ఉంటుంది. ఇందులోనూ క్వాలిఫై అయితే ఆర్నెళ్ల ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. అభ్యర్థి పనితీరు, ప్రవర్తన ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ పరీక్ష కేంద్రాలు(తెలుగు రాష్ట్రాల్లో):** ఆంధ్రప్రదేశ్-చీరాల, శ్రీకాకుళం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, చిత్తూరు, కంచికచర్ల, ఏలూరు, విజయనగరం; తెలంగాణ-హైదరాబాద్/రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్, ఖమ్మం.
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.100; మిగిలిన కేటగిరీలకు రూ.500.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 28, 2017.
- **వెబ్‌సైట్:** **www.uiic.co.in**

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 300 ఖాళీలు

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసీఎల్)లో 300 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. ఓఐసీఎల్.. భారత ప్రభుత్వ ఆధీనంలోని పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ.

- **పోస్టు పేరు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1).
- **మొత్తం పోస్టులు:** 300(అన్‌రిజర్వ్‌డ్-158, ఓబీసీ-77, ఎస్సీ-44, ఎస్టీ-21).
- **విభాగాల వారీ ఖాళీలు:** అకౌంట్స్-20, యాక్చురీస్-2, ఇంజనీర్స్ (ఆటోమొబైల్)-15, లీగల్-30, మెడికల్ ఆఫీసర్(ఎంఓ)-10, జనరలిస్ట్ -223.
- **వేతనం:** రూ.32,795-రూ.62,315
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి డిగ్రీ/లా డిగ్రీ/ పీజీ/ ఎంకామ్/సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ/ఎంబీబీఎస్/నాలుగు యాక్చురియల్ పేపర్స్(ఐఏఐ/ఐఎఫ్ఓఏ)లో ఉత్తీర్ణత.
- **వయో పరిమితి:** 2017 జూలై 31 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** మూడు దశల్లో ఎంపిక ఉంటుంది. ఫేజ్-1లో ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, ఫేజ్-2లో మెయిన్ ఎగ్జామినేషన్, ఫేజ్-3లో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- **పరీక్షల (ఫేజ్-1, ఫేజ్-2) విధానం:** ఫేజ్-1లో ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి గంట. నిర్దేశిత మార్కులతో క్వాలిఫైడ్ అభ్యర్థుల నుంచి 1:20 నిష్పత్తిలో మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.
- ఫేజ్-2 (మెయిన్ ఎగ్జామినేషన్)లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో, 30 మార్కులకు డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ టెస్ట్ వ్యవధి రెండు గంటలు. జనరలిస్ట్ పోస్టులకు 4 విభాగాలు, మిగిలిన పోస్టులకు 5 విభాగాలుగా ప్రశ్నపత్రం ఉంటుంది. జనరలిస్ట్‌కు టెస్ట్ ఆఫ్ రీజనింగ్ ఎబిలిటీ, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్.. ఒక్కోటి 50 మార్కులకు చొప్పున 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. మిగిలిన పోస్టులకు టెస్ట్ ఆఫ్ ప్రొఫెషనల్ నాలెడ్జ్ అదనంగా నిర్వహిస్తారు. ఒక్కో విభాగానికి 40 మార్కులకు చొప్పన 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఫేజ్-2 పరీక్ష వ్యవధి గంట; డిస్క్రిప్టివ్ విధానంలో 30 మార్కులకు లెటర్ రైటింగ్, ఎస్సే ఉంటాయి. ఫేజ్-1, ఫేజ్-2 రెండు పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు.
- **ఫేజ్-3 (ఇంటర్వ్యూ):** మెయిన్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణుల మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అనంతరం తుది ఎంపిక చేపడతారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.600(అప్లికేషన్ ఫీ+ఇంటిమేషన్ ఛార్జెస్); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.100 (ఇంటిమేషన్ ఛార్జెస్ మాత్రమే).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 18, 2017.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 15, 2017.
- **వెబ్‌సైట్:** **orientalinsurance.org.in**

యూపీఎస్సీ... 54 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని 54 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** అసిస్టెంట్ డైరెక్టర్ (కెమిస్ట్రీ)-1; అసిస్టెంట్ ఇంజనీర్-3(ఎలక్ట్రికల్-1+ మెకానికల్-2); అసిస్టెంట్ ప్రొఫెసర్ (స్పెషలిస్ట్ గ్రేడ్-3)-37(అనాటమీ-8+ ఒబేస్ట్రిక్ అండ్ గైనకాలజీ-13+ ఆప్తాల్మాలజీ-3 + ఆర్థోపీడియాక్(స్పోర్ట్స్ ఇంజూరీ సెంటర్)-1+ పీడియాట్రిక్ కార్డియాలజీ-2+ రేడియో థెరపీ-10); అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-6; డ్రిల్లర్ ఇంచార్జ్-5; లెక్చరర్-2 (ఎలక్ట్రికల్-1+మెకానికల్-1).
- **వేతనం:** అసిస్టెంట్ డైరెక్టర్ (కెమిస్ట్రీ), అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు -రూ.15,600-రూ.39,100; అసిస్టెంట్ ఇంజనీర్‌కు- రూ.44,900 -రూ.1,42,400; అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు- రూ.56,100 -రూ.1,77,500; డ్రిల్లర్ ఇంచార్జ్‌కు -రూ.9,300-34,800.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా/ఎంఎస్సీ/ఎంబీబీఎస్/డీఎన్‌బీ/ఎంసీహెచ్/డీఎం/ఎండీ/ఎంఎస్. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం, మార్కుల శాతం ఉండాలి.
- **వయోపరిమితి:** పోస్టులను అనుసరించి నిబంధనల మేరకు.
- **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 31, 2017.
- **వెబ్‌సైట్:** **www.upsconline.nic.in**

నిట్-రూర్కెలా 203 ఖాళీలు

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో 203 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **మొత్తం ఖాళీలు:** 203 (అన్‌రిజర్వ్‌డ్-55, ఓబీసీ-82, ఎస్సీ-40, ఎస్టీ-26). ఇందులో కొన్ని పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తారు.
- **పోస్టుల పేరు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- **బోధన విభాగాలు:** ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ డిజైన్, ఆర్కిటెక్చర్, సైన్స్/ హ్యూమానిటీస్ అండ్ సోషియల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.
- **వేతనం:** అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.15,600-రూ.39,100; అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు రూ.37,400-రూ.67,000. వీటిలో పోస్టులవారీ గ్రేడ్ పేలో మార్పులు ఉంటాయి.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీహెచ్‌డీతో పాటు బీఈ/బీటెక్/బీ.డిజైన్/బీఆర్క్/ఎంఆర్క్/మాస్టర్స్ డిగ్రీ/ ఎంబీఏ/ పీజీడీబీఎం. నిబంధనల మేర మార్కుల శాతం ఉండాలి. ఉద్యోగానుభవం అభిలషణీయం.
- **వయో పరిమితి:** 2017 సెప్టెంబర్ 11 నాటికి ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కాంట్రాక్ట్/శాశ్వత ప్రాతిపదికను అనుసరించి 30/35/40 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 11, 2017
- **వెబ్‌సైట్:** **www.nitrkl.ac.in**

ఐఆర్‌డీఏఐ 30 ఖాళీలు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ).. 30 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ మేనేజర్
- **వేతనం:** ప్రారంభ వేతనం రూ.28,150 +అలవెన్సులు.
- **మొత్తం ఖాళీలు:** 30 (అన్‌రిజర్వ్‌డ్-16, ఓబీసీ-7, ఎస్సీ-4, ఎస్టీ-3).
- **విభాగాల వారీ ఖాళీలు:** యాక్చ్యురియల్-4, అకౌంట్స్-4, లీగల్-2, జనరల్-20.
- **అర్హతలు :** 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ. యాక్చ్యురియల్ విభాగం పోస్టులకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చ్యురీస్ ఆఫ్ ఇండియా(ఐఏఐ) పరీక్షలో తొమ్మిది పేపర్ల ఉత్తీర్ణత, అకౌంట్స్ పోస్టులకు ఏసీఏ/ ఏఐసీడబ్ల్యూఏ/ ఏసీఎంఏ/ఏసీఎస్/సీఎఫ్ఏ, లీగల్ విభాగం పోస్టులకు ఎల్ఎల్‌బీ తప్పనిసరి.
- **వయో పరిమితి :** 2017 సెప్టెంబర్ 9 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఫేజ్-1లో ప్రిలిమినరీ, ఫేజ్-2లో డిస్క్రిప్టివ్ ఎగ్జామినేషన్, ఫేజ్-3లో ఇంటర్వ్యూ.
- **పరీక్షల విధానం:** ఫేజ్-1 ప్రిలిమినరీ ఆబ్జెక్టివ్‌లో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నల చొప్పున 160 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి 1/4 మార్కు చొప్పున రుణాత్మక మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి గంట.
- **ఫేజ్-2 (డిస్క్రిప్టివ్) ఎగ్జామినేషన్..** మూడు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో ఇంగ్లిష్, పేపర్-2లో ఎకనమిక్ అండ్ సోషల్ ఇష్యూస్ ఇంపాక్టింగ్ ఇన్సూరెన్స్, పేపర్-3లో ఇన్సూరెన్స్ అండ్ మేనేజ్‌మెంట్. ఒక్కో పేపర్ 100 మార్కులకు చొప్పున 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవధి ఒక్కో విభాగానికి గంట.
- **ఫేజ్-3(ఇంటర్వ్యూ):** ఫేజ్-2 మెరిట్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఫేజ్-2, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
- **పరీక్ష కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో):** ఫేజ్-1.. హైదరాబాద్, విజయవాడ; ఫేజ్-2.. హైదరాబాద్
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/ఎక్స్-సర్వీస్‌మెన్ రూ.100 (ఇంటిమేషన్ ఛార్జెస్); మిగిలిన అభ్యర్థులకు రూ.650(ఎగ్జామినేషన్ ఫీ+ ఇంటిమేషన్ ఛార్జెస్)
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 5, 2017.
- **వెబ్‌సైట్:** **www.irdai.gov.in**

సాక్షి బిజినెస్
బుధవారం 16-8-2017
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)

సెన్సెక్స్	నిఫ్టీ
235 ▲	83 ▲
31,449	9,794

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు సూచీలు రాత్రి 11.30)

నాస్‌డాక్	6,335	▽	5
డోజోన్స్	21,987	▽	7
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,384	△	30
డాక్స్	12,177	△	12
షాంఘై	3,252	△	14
నికాయ్	19,753	△	216

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో (సోమవారం ముగింపు)

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.21	64.88
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	82.01	84.83
€	యూరో	ఎస్‌బీఐ	74.43	77.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.54	59.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.78	51.58
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.31	47.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.48	18.35
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.84	18.52
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.80	11.03

ఉద్దేశపూర్వక ఎగవేతలు రూ.92,000 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక రుణ ఎగవేతలు 20% పెరిగిపోయాయి. 2016–17 ఆర్థిక సంవత్సరం చివరికి 9,000 మంది రూ.92,376 కోట్ల మేర బ్యాంకులకు ఎగ్గొట్టారు. 2016 మార్చి నాటికి ఇలా ఉద్దేశపూర్వకంగా చెల్లించని రుణాల మొత్తం రూ.76,685 కోట్లుగానే ఉన్నాయి. ఇక ఉద్దేశపూర్వక ఎగవేత కేసులు గతేడాది మార్చి నాటికి 8,167గా ఉండగా, ఈ ఏడాది మార్చి నాటికి వాటి సంఖ్య 8,915కు పెరిగింది. వీటిలో రూ.32,484 కోట్ల ఎగవేతలకు సంబంధించి రూ.1,914 కేసులపై బ్యాంకులు కేసులు దాఖలు చేయించాయి. 2016–17 ఆర్థిక సంవత్సరంలో 27ప్రభుత్వ రంగ బ్యాంకులు (ఎస్‌బీఐ, దాని లో విలీనమైన అనుబంధ బ్యాంకులు సహా) రూ.81,683 కోట్ల మొండి బాకీలను రద్దు చేయడం గమనార్హం. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 41 % అధికం.

16 శాతం తగ్గిన శ్రీకాళహస్తి పైప్స్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూన్ త్రైమాసికం స్టాండెలోన్ ఫలితాల్లో శ్రీకాళహస్తి పైప్స్ నికరలాభం క్రితం ఏడాదితో పోలిస్తే 16 శాతం తగ్గి రూ.36 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ రూ.292 కోట్ల నుంచి రూ.446 కోట్లకు ఎగసింది.

లైకోస్ ఇంటర్నెట్ లాభం రూ.94 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో లైకోస్ ఇంటర్నెట్ నికరలాభం 0.36 శాతం పెరిగి రూ.94.68 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 1.23 శాతం అధికమై రూ.538.4 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.163.7 కోట్లు నమోదైంది.

నదుల అనుసంధానంలో మూడు ప్రాజెక్టులు పూర్తి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నదుల అనుసంధానానికి సంబంధించి స్వల్పకాలంలోనే మూడు ప్రాజెక్టులు పూర్తి చేసి రికార్డు సృష్టించినట్లు ఇన్‌ఫ్రా దిగ్గజం ఎంఈఐఎల్ (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) వెల్లడించింది. 2014లో తొలిసారిగా మధ్యప్రదేశ్‌లోని నర్మదా – క్షిపర – సింహస్థ (ఎన్‌కేఎస్) ప్రాజెక్టును పూర్తి చేశామని, తర్వాత పట్టిసీమ ప్రాజెక్టును, తాజాగా గోదావరి–ఏలేరు నదుల అనుసంధానంతో పురుషోత్తపట్నం ప్రాజెక్టును పూర్తి చేశామని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. సుమారు రూ. 1,638 కోట్ల విలువైన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి ఈ ఏడాది జనవరి 5న శంకుస్థాపన జరగ్గా.. ఆరు నెలల్లోనే అడ్డంకులను అధిగమించి ప్రధానమైన పనులన్నింటినీ పూర్తి చేసినట్లు తెలిపింది. ఈ విధంగా మూడేళ్ల వ్యవధిలోనే మూడు ప్రాజెక్టులు విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని ఎంఈఐఎల్ వివరించింది. ఆగస్టు 15న పురుషోత్తపట్నం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేసిన కార్యక్రమంలో ఎంఈఐఎల్ చైర్మన్ పి.పి.రెడ్డి, డైరెక్టర్ సీహెచ్ సుబ్బయ్య, సీజీఎం రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో ఇన్‌సైడర్స్‌కి చెక్

సోషల్ మీడియాపైనా నిఘా ● ఇన్‌సైడర్లు, ఇన్వెస్టర్ల మధ్య లింకులపై సెబీ దృష్టి

ముంబై: ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను అరికట్టే దిశగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా కొత్త వ్యూహాలు అనుసరిస్తోంది. తాజాగా ఫేస్‌బుక్, ట్వీటర్ వంటి సామాజిక మాధ్యమాలపైనా దృష్టి పెట్టింది. సంప్రదాయ మార్గాల్లో పట్టుబడని ఇన్‌సైడర్లు, ఇన్వెస్టర్ల మధ్య లింకులను మరింత లోతుగా పరిశీలిస్తోంది. ఇటీవల వెలుగుచూసిన కొన్ని కేసులే దీనికి ఉదాహరణ. కొన్నాళ్ల క్రితం ఒక కంపెనీ కీలక ప్రకటన చేయడానికి సరిగ్గా కొద్ది రోజుల ముందు ఒక అరవై ఐదేళ్ల మహిళ అసాధారణ స్థాయిలో ఆ కంపెనీ షేర్లు కొనుగోలు చేయడం సెబీ దృష్టికి వచ్చింది. ఇందులో కచ్చితంగా ఇన్‌సైడర్ కోణం ఉంటుందని భావించిన సెబీ.. పలు సంప్రదాయ మార్గాల్లో కేసును పరిశీలించినా సరైన ఆధారాలు చిక్కలేదు. దీంతో సామాజిక మాధ్యమాలపై దృష్టి పెట్టింది. డీల్‌లో కీలకపాత్ర పోషిస్తున్న ఓ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకరుకు, ఆమెకు సోషల్ మీడియాలో పరిచయం ఉన్నట్లు గుర్తించింది. ఆమె కుమార్తెను వివాహమాడే ప్రయత్నాల్లో ఉన్న బ్యాంకరు .. ఒక వివాహ పరిచయ వేదిక ద్వారా కీలకమైన కార్పొరేట్ సమాచారాన్ని ఆమెకు చేరవేసి ఉండొచ్చని, తద్వారా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు తెరతీశారని గుర్తించిన సెబీ తదనుగుణంగా చర్యలకు శ్రీకారం చుట్టింది.

అలాగే, ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా చెన్నైకి చెందిన ఒక ఇన్వెస్టరు, ఓ కంపెనీ అధికారి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిన సంగతీ సెబీ కనిపెట్టింది. కంపెనీ షేరు భారీగా పెరిగే సమాచారం గల సదరు అధికారి.. ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా చెన్నై ఇన్వెస్టరును బినామీగా ఉపయోగించుకుని ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిన అంశాన్నీ నిర్ధారించింది. ఈ రెండు కేసుల్లోనూ సెబీ ఇంకా ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ఇక, ఈ కోవకే చెందిన పాల్‌రెడ్ టెక్నాలజీస్ కేసు విషయంలో దాదాపు 15 మంది రూ. 2.2 కోట్ల మేర అనుచిత లబ్ధి పొందినట్లు గుర్తించిన సెబీ ఆ మొత్తాన్ని జప్తునకు ఆదేశించింది.



వినూత్న వ్యూహాలు...

ఇన్‌సైడర్ సమాచారంతో చట్టవిరుద్ధమైన మార్గాల్లో స్టాక్ మార్కెట్ల నుంచి ప్రయోజనం పొందుతున్న వారిని గుర్తించే క్రమంలో సోషల్ మీడియాను క్షుణ్నంగా పరిశీలించేందుకు సెబీ.. టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తోంది. చట్టాలను ఉల్లంఘించే వాళ్లు చాలా తెలివిగా సంప్రదాయ మాధ్యమాల్లో ఎలాంటి ఆధారాలు దొరక్కుండా జాగ్రత్తపడతారని, అందుకే సెబీ ఈ తరహా వినూత్న వ్యూహాలను అమలు చేస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. చాలా మటుకు ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసుల్లో లావాదేవీలు ఇన్‌సైడర్ లేదా వారికి సన్నిహితులు కాకుండా పూర్తిగా అపరిచితుల పేర్ల మీద జరుగుతూ ఉంటాయని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటివి గుర్తించేందుకే సెబీ కూడా అసాధారణ వ్యూహాలు అమలు చేస్తోందని అధికారులు తెలిపారు.

వాదనలు నిలబడేనా...: ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడే వారిని పట్టుకునేందుకు సెబీ సోషల్ మీడియాను సైతం జల్లెడ పడుతున్నప్పటికీ.. వాటి ఆధారంగా నేరాన్ని రుజువు చేయడం కష్టతరం కావొచ్చని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో మిత్రులైనంత మాత్రాన వారు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి ఉంటారని నిర్ధారించడానికి వీలు ఉండదని వారు చెబుతున్నారు. ఇందుకోసం మరింత బలమైన సాక్ష్యాధారాలు అవసరమవుతాయని, లేదంటే నిందితులు అప్పీలుకు వెళ్లిన పక్షంలో సెబీ వాదనలు వీగిపోవచ్చని అంటున్నారు. ఇక, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై చాటింగ్, కాల్ రికార్డులు కూడా సెబీకి అందుబాటులో ఉండవు. మిగతా యూజర్ల తరహాలోనే బహిరంగంగా కనిపించే సమాచారంపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇన్‌సైడర్ ట్రేడర్లు ఎటువంటి ఆధారాలు లభించకుండా మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారనేది న్యాయనిపుణుల అభిప్రాయం.

స్టాక్ మార్కెట్లో నల్లధనంపై సెబీ ఉక్కుపాదం!

- అనుమానిత సంస్థలు, బ్రోకర్లపై నిఘా
- రికార్డుల తనిఖీలు
- ఇతర దర్యాప్తు సంస్థలకు సహకారం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లను నల్లధన ప్రవాహానికి వేదిక చేసుకోకుండా నివారించే చర్యల్ని నియంత్రణ సంస్థ సెబీ ముమ్మరం చేసింది. అనుమానిత సంస్థలు, బ్రోకర్లపై దృష్టి సారించింది. అంతేకాదు, ఈ విషయంలో ఇతర నియంత్రణ సంస్థలు, దర్యాప్తు సంస్థలతో సహకారాన్ని ముమ్మరం కూడా చేసింది. చాలా షేర్లలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక మూలధన లాభాలకు సంబంధించి ఆదాయపన్ను శాఖ నుంచి 2016–17లో తమ దృష్టికి వచ్చిన కేసుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల ఉందని సెబీ తన వార్షిక నివేదికలో పేర్కొంది. దర్యాప్తు కోసం మొత్తం 245కేసులను తీసుకోగా, వాటిలో 155 కేసుల్లో దర్యాప్తు పూర్తయినట్లు తెలిపింది. 2015–16లో మొత్తం కేసులు 133గా ఉండగా, 123 కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసినట్లు వివరించింది. ఐటీ, ఇతర పరికరాల సాయంతో దర్యాప్తు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నట్లు పేర్కొంది. నిఘా చర్యల్లో భాగంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, డిపాజిటరీలతో గతేడాది భేటీ కూడా నిర్వహించినట్లు తెలిపింది. పన్ను ఎగవేతకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను దుర్వినియోగం చేసుకున్న కేసుల్లో అనుమానిత బ్రోకర్లు, డిపాజిటరీ పార్టిసిపెంట్లపై తనిఖీలను ముమ్మరం చేసినట్లు పేర్కొంది. వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజర్లు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల ఖాతా పుస్తకాలు, ఇతర పత్రాలను తనిఖీ చేసినట్లు వివరించింది. మోసపూరిత ఎస్‌ఎంఎస్‌లను ఇన్వెస్టర్లకు పంపడం పెరిగిపోయిందని, కొన్ని కేసుల్లో చర్యలు కూడా తీసుకున్నట్లు తెలిపింది. ఏఎంఎల్, సీఎఫ్‌టీ నిబంధనల అమలులో లోపాలకు సంబంధించి బీఎస్‌ఈ 195 సంస్థలపై, సీడీఎస్‌ఎల్ 236 సంస్థలపై, ఎంసీఎక్స్ 59 సంస్థలపై, ఎన్‌ఎస్‌ఈ 27 సంస్థలపై చర్యలు తీసుకున్నట్లు వివరించింది.

రిలయన్స్, బీపీకి మరో రూ. 1,700 కోట్ల జరిమానా

లక్ష్యాలకు తగ్గట్లుగా గ్యాస్ ఉత్పత్తి చేయనందుకు చర్యలు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం కేజీ–డీ6 క్షేత్రాల నుంచి నిర్దేశిత లక్ష్యాలకన్నా తక్కువగా గ్యాస్ ఉత్పత్తి చేసినందుకు గాను రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని భాగస్వామ్య సంస్థలపై కేంద్రం మరో 264 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,700 కోట్లు) జరిమానా విధించింది. దీంతో 2010 ఏప్రిల్ 1 నుంచి దాదాపు ఆరేళ్లుగా లక్ష్యాలను సాధించలేకపోవడం వల్ల విధించిన మొత్తం పెనాల్టీ సుమారు 3.02 బిలియన్ డాలర్లకి(దాదాపు రూ. 19,500 కోట్లు) చేరిందని చమురు శాఖ తెలిపింది. వ్యయాల రికవరీని అనుమతించకపోవడం రూపంలో ఈ జరిమానా ఉంటోంది. వాస్తవానికి ఉత్పత్తిలో వాటాల ఒప్పందం (పీఎస్‌సీ) ప్రకారం రిలయన్స్, దాని భాగస్వామ్య సంస్థలు బీపీ, నికో రిసోర్సెస్ ముందుగా తమకైన వ్యయాలను గ్యాస్ అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయంలో నుంచి తగ్గించుకుని మిగతా లాభాలను ప్రభుత్వంతో పంచుకుంటున్నాయి. అయితే, వ్యయాల రికవరీకి అనుమతించని పక్షంలో లాభాల్లో ప్రభుత్వ వాటా పెరుగుతుంది. 2011–12లో కేజీ–డీ6 బ్లాక్‌లోని ధీరూభాయ్–1, 3 గ్యాస్ క్షేత్రాల నుంచి రోజుకు 80 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంసీఎండీ) గ్యాస్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా 35.33 ఎంసీఎండీ మాత్రమే ఉత్పత్తయ్యింది. ఆతర్వాత నుంచి తగ్గుతూ ప్రస్తుతం 4 ఎంసీఎండీ కన్నా తక్కువకి క్షీణించింది. గడిచిన సంవత్సరాలకు సంబంధించి వ్యయాల రికవరీని అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్‌ఐఎల్, బీపీ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో ఆర్బిట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది.

రెంట్‌ఆన్‌గోలో టీవీఎస్ మోటార్స్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్స్ బెంగళూరు కేంద్రంగా పనిచేసే స్టార్టప్ సంస్థ రెంట్‌ఆన్‌గోలో 24 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రెంట్‌ఆన్‌గో నిర్వహణ సంస్థ అయిన కండివిజన్ సొల్యూషన్స్‌లో రూ.1.5 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. రెంట్‌ఆన్‌గో 2012లో ఏర్పాటైంది. 2016–17లో ఈ సంస్థ రూ.31 లక్షల టర్నోవర్ నమోదు చేసింది. రెంట్‌ఆన్‌గో ఆన్‌లైన్ వేదికగా అద్దె బైకుల సేవలను అందిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, ముంబై, పుణె, ఢిల్లీలో ఈ సంస్థ సేవలు అందుబాటులో ఉన్నాయి.

టెల్కోల ఆదాయానికి జియో గండి!

ఉచిత ఫోన్‌తో మరింతగా తగ్గే ప్రమాదం

- టెలికం శాఖకు వొడాఫోన్ ఫిర్యాదు



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో ఉచిత ఫీచర్ల ఫోన్ల వల్ల టెలికం పరిశ్రమపై ప్రతికూల ప్రభావం పడుతుందని దేశీ రెండో అతిపెద్ద టెలికం ఆపరేటర్ వొడాఫోన్ అభిప్రాయపడింది. జియో ఫోన్ల వల్ల ఆపరేటర్ల ఆదాయాలు మరింత తగ్గే ప్రమాదముందని పేర్కొంది. 'ఇప్పటికే టెల్కోల ఆదాయాల్లో గణనీయమైన క్షీణత నమోదవుతోంది. మరొకవైపు తీవ్ర ఒత్తిడిలో ఉన్న టెలికం కంపెనీలు కేంద్ర ప్రభుత్వం విధించే పలు సుంకాలపై తగ్గింపును కోరుకుంటున్నాయి' అని వివరించింది. కొత్త ఆపరేటర్ అయిన జియో తన సర్వీసులను పోటీ ధరల కన్నా తక్కువకే ఆఫర్ చేస్తోందని, అపరిమిత వాయిస్ కాల్స్‌తో కూడిన ఫీచర్ ఫోన్స్ కూడా ఇందులో భాగమేనని పేర్కొంది. దీని వల్ల ప్రస్తుత టెల్కోల ఆదాయాలు మరింత తగ్గే అవకాశముందని తెలిపింది. సంస్థ ఈ విషయాలను పేర్కొంటూ టెలికం కమిషన్ సభ్యులు (ఫైనాన్స్) అనురాధ మిత్రకు ఒక లేఖ రాసింది. 'మాకు టెలికం సర్వీసెస్ నుంచి వచ్చే ఆదాయం క్షీణిస్తూనే ఉంది. 2017 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలోనూ 3.41 శాతం తగ్గుదల నమోదయ్యింది' అని వొడాఫోన్ వివరించింది. స్పెక్ట్రమ్ వాయిదా చెల్లింపులపై వడ్డీ రేట్లను తగ్గించాలని, దీని వల్ల ఆపరేటర్లకు కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపింది. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ (యూఎస్‌వో) సుంకాన్ని 5 శాతం నుంచి 3 శాతానికి తగ్గించాలనే ట్రాయ్ ప్రతిపాదనను పరిశీలించాలని డాట్‌ను కోరింది. అధికారిక సమాచారం ప్రకారం జనవరి–మార్చి త్రైమాసికంలో టెల్కోల సర్వీసుల ఆదాయం 15 శాతం క్షీణతతో రూ.40,831 కోట్లకు తగ్గింది. గతేడాది ఇదే కాలంలో సర్వీసుల ఆదాయం రూ.48,379 కోట్లుగా ఉంది. కాగా ఆర్‌ఐఎల్ అధినేత ముకేశ్ అంబానీ ఇటీవల రూ.1,500ల పూర్తి రిఫండబుల్ డిపాజిట్‌తో ఉచిత 4జీ ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ ఫోన్ల బుకింగ్స్ సెప్టెంబర్ 24 నుంచి ప్రారంభం కానున్నవి.

లైసెన్స్ గడువు పొడిగించండి

కేంద్రానికి బీఎస్‌ఎన్‌ఎల్ వినతి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్ తమ సెల్యులార్ లైసెన్సు, స్పెక్ట్రమ్ గడువును మరో రెండేళ్ల పాటు .. 2022 దాకా పొడిగించాలని కేంద్రాన్ని కోరింది. తమకు 2000లోనే లైసెన్సు ఇచ్చినా కార్యకలాపాలు 2002లో ప్రారంభమయ్యాయని, ఈ నేపథ్యంలో 20 ఏళ్ల లైసెన్సు వ్యవధిని 2022 దాకా పొడిగించాలని కోరినట్లు సంస్థ చైర్మన్ అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. ముంబై, ఢిల్లీ మినహా బీఎస్‌ఎన్‌ఎల్ .. దేశవ్యాప్తంగా సర్వీసులు అందిస్తోంది. సుమారు 10 కోట్ల మంది యూజర్లతో 8.7 శాతం మార్కెట్ వాటా ఉంది. ముంబై, ఢిల్లీలో కార్యకలాపాలు ఉన్న మరో ప్రభుత్వ రంగ టెలికం సంస్థ ఎంటీఎన్‌ఎల్ సైతం తమ లైసెన్సు గడువు కూడా 2021 దాకా రెండేళ్ల పాటు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా పొడిగించాలంటూ ఇటీవలే కేంద్రాన్ని కోరింది. వివిధ కారణాల వల్ల పర్మిట్ అందిన తొలి నాలుగేళ్లలో లైసెన్సును పూర్తి స్థాయిలో వినియోగించుకోలేదని పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 16-8-2017

విశాఖ	360–00
చిత్తూరు	390–00
వరంగల్	353–00
ముంబై	396–00
చెన్నై	397–00
విజయవాడ	357–00
గోదావరి	357–00
నమక్కల్	384–00
15–8–2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	351–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.10
బెంగళూరు	380–00
ఢిల్లీ	370–00
కోల్‌కతా	390–00

మోదీది అద్భుతమైన ఆలోచన

'ఇన్ఫీ' నారాయణమూర్తి

- 'పోటీతో కూడిన సమాఖ్య విధానాని'కి ఆహ్వానం
- పెట్టుబడుల్లో రాష్ట్రాలు పోటీ పడతాయని అభిప్రాయం



బెంగళూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపును ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ ఆర్ నారాయణమూర్తి స్వాగతించారు. ''దేశాభివృద్ధికి రాష్ట్రాలు చాలా కీలకం. నేను ముఖ్యమంత్రిగా చాలా కాలంగా ఉండడంతో నాకీ విషయం తెలుసు. ముఖ్యమంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతను నేను అర్థం చేసుకోగలను. అందుకే మేము సహకారాత్మక సమాఖ్య విధానంపై దృష్టి సారించాం. ఇప్పుడు పోటీతో కూడిన సహకారాత్మక సమాఖ్య విధానం' అనుసరిస్తున్నాం. అన్ని నిర్ణయాలను కలసి కట్టుగా తీసుకుంటున్నాం'' అని ప్రధాని 71వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. బెంగళూరులో జరిగిన సినర్జెటిక్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నారాయణమూర్తి ప్రధాని వ్యాఖ్యలపై స్పందించారు. 'పోటీపడగల సహకారాత్మక సమాఖ్య విధానం' అన్నది గొప్ప ఆలోచనగా అభివర్ణించారు. ప్రధాని పిలుపులోని పోటీతత్వం అనేది పెట్టుబడులు, పారిశ్రామికవేత్తలను ఆకర్షించే విషయంలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీపడేలా చేస్తుందన్నారు. దీనివల్ల మరిన్ని ఉద్యోగాలు ఏర్పడతాయని మూర్తి అభిప్రాయపడ్డారు. నిరక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం తదితర ఎన్నో అంశాల్లో కేంద్రాన్ని నిందించకుండా, వాటిపై పోరాడేందుకు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంతో కలసి నడవాలని సూచించారు. నల్లధనం, జీఎస్టీ అంశాలపైనా మూర్తి స్పందించారు. ''పెద్ద నోట్ల రద్దుతో రూ.1.25 లక్షల కోట్ల నల్లధనాన్ని వెలుగులోకి తీసుకొచ్చి, తొలగించినట్టు ప్రధానే చెప్పారు. ఈ విషయంలో మనం ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. జీఎస్టీతో వ్యాపారులు, ప్రభుత్వానికి ప్రయోజనాలు అందడం మొదలైంది'' అని మూర్తి చెప్పారు. షెల్ కంపెనీలపై ప్రభుత్వం తీసుకున్న చర్యల్ని కూడా ఆయన సమర్థించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందన్నారు.

పొదుపు చర్యలు పాటించడం ద్వారానే కంపెనీలు వృద్ధి చెందగలవని నారాయణ మూర్తి చెప్పారు. 'సంపాదించే దానికన్నా తక్కువ ఖర్చు చేయడం చాలా ముఖ్యం. కంపెనీలు మరింత వృద్ధిలోకి రావాలంటే చైర్మన్, సీఈవోల నుంచి కాపలాదారు దాకా అందరూ పొదుపు చర్యలు పాటించాలి. నిరాడంబరంగా ఉండాలి' అని ఆయన సూచించారు. ఖర్చు చేసే ప్రతి పైసాకు తగిన విలువను కంపెనీ రాబట్టుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విధానాల్లో సంస్కరణలు కావాలి

- ఉద్యోగ కల్పన, మహిళా సాధికారత అవసరం
- పారిశ్రామిక సంఘాల పిలుపు

న్యూఢిల్లీ: నూతన పారిశ్రామిక విధానంతోపాటు విధానాల్లో బలమైన సంస్కరణలు, ఉద్యోగాల కల్పన, పని ప్రదేశాల్లో మహిళా సాధికారత పెంచాల్సిన అవసరం ఉందని భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ) కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అవినీతి, నల్లధనంపై కేంద్ర ప్రభుత్వ చర్యల్ని ప్రశంసించింది. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు కనిష్ట స్థాయికి దిగిరావడాన్ని ఆహ్వానించింది. 2022 నాటికి సురక్షిత, సుసంపన్న, బలమైన భారత్‌ను ఆవిష్కరించాలన్న ప్రధానమంత్రి విధానంపై సీఐఐ ప్రెసిడెంట్ శోభన కామినేని స్పందించారు. '2022 నాటికి అభివృద్ధి విధానం' అన్నది కష్టమైనదని, దీన్ని సాధించేందుకు పలు ఆర్థిక, సామాజిక రంగాల్లో బలమైన, విధానపరమైన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. జీఎస్టీ, వ్యాపార సులభతర నిర్వహణ దేశ ఆర్థిక రంగాన్ని మరింత వ్యవస్థీకృతం చేస్తాయని, పన్ను పరిధి పెరుగుతుందని శోభన పేర్కొన్నారు. 2022 నాటికి మరింత పారదర్శక, సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థను ఆశిస్తున్నట్టు చెప్పారు. బలమైన, ఆర్థిక అవకాశాలతో కూడిన, అవినీతి రహిత దేశాన్ని ప్రధాని ఆవిష్కరించినట్టు ఫిక్కీ పేర్కొంది.

బీమా సంస్థల కొత్త ప్రీమియం ఆదాయంలో 47% వృద్ధి




న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం 24 జీవిత బీమా కంపెనీల కొత్త ప్రీమియం ఆదాయంలో జూలై నెలలో 47.4 శాతం వృద్ధి నమోదయ్యింది. ఇది రూ.20,428 కోట్లకు చేరింది. కాగా గతేడాది ఇదే కాలంలో సంస్థల కొత్త ప్రీమియం ఆదాయం రూ.13,854 కోట్లుగా ఉంది. ఐఆర్‌డీఏ తాజా గణాంకాల ప్రకారం.. ఒకే ఒక ప్రభుత్వ రంగ ఎల్‌ఐసీ ప్రీమియం ఆదాయం 51 శాతం వృద్ధితో రూ.10,738 కోట్ల నుంచి రూ.16,255 కోట్లకు పెరిగింది. ఇక మిగిలిన 23 ప్రైవేట్ సంస్థల ప్రీమియం ఆదాయం 34 శాతం వృద్ధితో రూ.3,117 కోట్ల నుంచి రూ.4,173 కోట్లకు ఎగసింది. ఎస్‌బీఐ లైఫ్ ప్రీమియం ఆదాయం 25 శాతం వృద్ధితో రూ.848 కోట్లకు, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ప్రీమియం ఆదాయం 34 శాతం వృద్ధితో రూ.759 కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ప్రీమియం ఆదాయంలో 69 శాతం వృద్ధి చెందింది. ఇది రూ.521 కోట్ల నుంచి రూ.880 కోట్లకు పెరిగింది. బిర్లా సన్ లైఫ్ ప్రీమియం ఆదాయం 57 శాతం వృద్ధితో రూ.196 కోట్లకు, కెనరా హెచ్‌ఎస్‌బీసీ ఓబీసీ లైఫ్ ప్రీమియం ఆదాయం 75 శాతం వృద్ధితో రూ.100 కోట్లకు చేరింది.

ఈ సంవత్సరం 56 లక్షల ఐటీ రిటర్నులు దాఖలయ్యాయి. ఇది గతేడాది కన్నా రెండింతలు. నల్లధనంపై మన పోరాట విజయాన్ని చెప్పేందుకు ఈ గణాంకాలు చాలు.

దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఓ ఆస్పత్రిలో చిన్నారులు దుర్మరణం పాలయ్యారు. దేశ ప్రజల సానుభూతి వారితో ఉంది.

జీఎస్టీ అమలు ఒక సాంకేతిక అద్భుతం. సహకార సమాఖ్య విధానానికి ఒక మచ్చుతునక.



నిరాశావాదం మధ్య పెరిగాం కానీ ఇప్పుడు సుదృఢ విశ్వాసంతో ముందడుగు వేద్దాం. ఏదో నడుస్తోందిలే.. అనే ఆలోచనాధోరణిని విడనాడుదాం.

నోట్ల రద్దుతో అవినీతికి అడ్డుకట్ట పడింది. పెద్ద నోట్ల రద్దు అనంతరం రూ. 3 లక్షల కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయి. అందులో రూ. 2 లక్షల కోట్లు నల్లధనం.

విశ్వాసాల ప్రాతిపదికన హింస ఎంత మాత్రం సమర్థనీయం కాదు.. మతవాదం, కులతత్వం విషంతో సమానం



ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండా ఎగరేసి సెల్యూట్ చేస్తున్న ప్రధాని మోదీ

మళ్లీ స్వర్గధామం చేద్దాం..!

కశ్మీర్‌పై ప్రధాని మోదీ పిలుపు

- ఆ సమస్య దూషణలు, తూటాలతో పరిష్కారం కాదు
- ఆత్మీయ ఆలింగనంతోనే అది సాధ్యం
- ఉగ్రవాదులు, ఉగ్రవాదంపై మెతక వైఖరి ప్రసక్తే లేదు
- ట్రిపుల్ తలాఖ్‌పై పోరులో మహిళలకు అండగా ఉన్నాం
- 71వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: కల్లోల కశ్మీర్‌ను మరొకసారి భూలోక స్వర్గంగా మార్చేందుకు ప్రతిజ్ఞ చేద్దామంటూ దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కశ్మీర్ సమస్య దూషణలతోనో, తూటాలతోనో పరిష్కారం కాదని తేల్చి చెప్పిన ప్రధాని.. అందుకు కశ్మీరీలను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని, వారితో మమేకం కావడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. కొంత మంది వేర్పాటువాదులు మాత్రం రాష్ట్రంలో సమస్యలు సృష్టించేందుకు పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. సంప్రదాయ కుర్తా, పైజామా, రాజస్తానీ తలపాగాతో స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన ప్రధాని మంగళవారం ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ప్రధానిగా నాలుగోసారి ఎర్రకోట నుంచి ప్రసంగించిన మోదీ.. గత మూడేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలు, కీలక నిర్ణయాల్ని ప్రస్తావించారు. ముఖ్యంగా నోట్ల రద్దు, జీఎస్టీ అమలు సాహసోపేత నిర్ణయాలని అభివర్ణించారు. అవినీతి, నల్లధనంపై పోరు కొనసాగుతుందని, దేశాన్ని దోచుకున్నవారు సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదులపై, ఉగ్రవాదంపై కఠిన వైఖరి కొనసాగుతుందని తేల్చి చెప్పారు. చైనాతో డోక్లాం వివాదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. సముద్రం, సరిహద్దులు ఎక్కడైనా సరే, ఎలాంటి భద్రతా సవాలునైనా ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉందన్నారు. విశ్వాసాల పేరిట జరిగే హింస ఆమోదయోగ్యం కాదని, మతవాదం, కులతత్వం విషంతో సమానమని పేర్కొన్నారు. దేశం ఎదుర్కొన్న ప్రకృతి విపత్తులను, యూపీ ఆస్పత్రిలో ఇటీవలి చిన్నారుల మరణాలను ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని.. వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. తన ముందు శ్రీకృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులను చూపిస్తూ.. దేశ ఘన సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేశారు. ఒక మోహనుడు చక్ర(సుదర్శన) ధారుడైతే.. మరో మోహనుడు(మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ) చరఖాను ప్రసిద్ధం చేశారంటూ ఆసక్తికర వ్యాఖ్యానం చేశారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే...

గత ఏడాదిగా కశ్మీర్‌లో అస్థిర పరిస్థితులు కొనసాగుతున్నాయి. అయితే కశ్మీరీల సమస్యలు బుల్లెట్లు, ఆరోపణలతో పరిష్కారం కావు. కశ్మీరీల ఆత్మీయ కౌగిలితోనే ఆ మార్పు సాధ్యం. కేవలం కొద్దిమంది వేర్పాటువాదులు.. రాష్ట్రంలో సమస్యలు సృష్టించేందుకు వివిధ ఎత్తుగడలు అనుసరిస్తున్నారు. అయితే కశ్మీర్‌కు గత వైభవం తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. మళ్లీ భూతల స్వర్గంగా మార్చుతాం. అభివృద్ధి కోసం కశ్మీరీల కలల్ని నెరవేర్చేందుకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వమే కాకుండా దేశం మొత్తం సాయపడుతోంది. మతతత్వం, కులతత్వం విషం లాంటివి.. స్వాతంత్ర్య సమరంలో భారత్ ఛోడో(క్విట్ ఇండియా) నినాదం భారత్ జోడో(భారత్ అనుసంధానం) నినాదంగా మారాలి. రోజురోజుకూ భారత కీర్తి ప్రతిష్టలు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉగ్రవాదంపై పోరులో అనేక దేశాలు భారత్‌కు అండగా ఉన్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో భారత సైన్యం, నేవీ, వాయుసేనలు తమ సామర్థ్యం, ధైర్యాన్ని ప్రదర్శించాయి.

‘చల్తా హై’ ధోరణి మారాలి

కలసికట్టుగా సాగితేనే దేశంలో గుణాత్మక మార్పు సాధ్యం. 9 నెల్లలో మనం మంగళ్‌యాన్‌ను సుసాధ్యం చేశాం. అదే సమయంలో నాలుగు దశాబ్దాలుగా రైల్వే ట్రాక్ ప్రాజెక్టు మాత్రం పూర్తి చేయలేకపోయాం. ఇలాంటి పరిస్థితులు మారాలి. ‘చల్తా హై’ ధోరణి వదిలిపెట్టాలి. బదల్ సక్తా హై (మార్చాలి) అన్న సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి. బాల గంగాధర్ తిలక్ నినాదమైన స్వరాజ్.. ఇప్పుడు సురాజ్ (సుపరిపాలన) కావాలి. 2022 నాటికి నవ భారతం ఆవిష్కృతమవ్వాలి. ఆ దిశగా ప్రయాణానికి ప్రజలే చోదక శక్తి.

జీఎస్టీతో 30% తగ్గిన సరుకు రవాణా సమయం

జీఎస్టీ అమలు విజయవంతమైన ప్రయోగం, అలాగే సాంకేతికత అద్భుతం. జీఎస్టీతో రాష్ట్రాల సమాఖ్య సహకార స్ఫూర్తి వెల్లడైంది. ఈ ఏకీకృత పన్నుకు మద్దతుగా దేశం మొత్తం కలిసికట్టుగా ముందుకొచ్చింది. జీఎస్టీ అమలుతో చెక్‌పోస్టులు తొలగించడం వల్ల సరుకు రవాణా సమయం 30 శాతం తగ్గింది. దీంతో రూ. వేల కోట్లు ఆదా అవుతున్నాయి. అవినీతి, నల్లధనంపై మన పోరు కొనసాగుతుంది. భారతదేశ ఉజ్వల భవిష్యత్తు, ప్రజల శ్రేయస్సు కోసం ఈ పోరాటం చేస్తున్నాం. దేశ సంపదను దోచుకున్న వారు సమాధానం చెప్పక తప్పదు. రూ. 800 కోట్ల బినామీ ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నాం. అభివృద్ధి వైపు వేగంగా దేశాన్ని తీసుకెళ్తున్నాం. పేదలందరికీ పక్కా ఇళ్లు, విద్యుత్, నీరు అందించగలిగే భారతాన్ని నేను కోరుకుంటున్నా. ఎలాంటి ఆందోళన లేకుండా రైతులు ప్రశాంతంగా నిద్రపోవాలి. వారు విత్తిన దానికి రెండింతలు ఫలసాయం పొందాలి.

ట్రిపుల్ తలాఖ్‌పై వ్యతిరేక వాతావరణం

ట్రిపుల్ తలాఖ్‌పై పోరాడుతున్న మహిళల హక్కుల్ని సాధించే ప్రయత్నంలో దేశం వారి వెంట ఉంది. ఈ విధానంపై యావత్ దేశం ఆందోళన చెందింది. ట్రిపుల్ తలాఖ్ వల్ల దుర్భర జీవితం గడుపుతున్న మహిళలకు నా సానుభూతి తెలుపుతున్నా. వారు ప్రారంభించిన ఉద్యమంతో దేశంలో తలాఖ్‌కు వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించడంలో విజయం సాధించారు.

ఈసారి 56 నిమిషాలే...

- ఉదయం 7.23 గంటలకు ఎర్రకోటకు చేరుకున్న ప్రధాని మోదీకి రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ, సహాయ మంత్రి సుభాష్ బామ్రే స్వాగతం పలికారు.
- ఈసారి వేడుకకు హాజరైనవారిలో అధికంగా స్కూలు విద్యార్థులే ఉన్నారు.
- సరిగ్గా 7.30 గంటలకు మోదీ జాతీయ జెండాను ఎగురవేశారు.
- ఈసారి ప్రొటోకాల్ స్వల్పంగా మారింది. గతంలో జీఓసీ(ఢిల్లీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్) నిల్చొని ఉండగా, ఈ ఏడాది ప్లాట్‌ఫాంకు సమీపంలో ఆయనకు సీటు ఏర్పాటు చేశారు.
- ఈసారి మోదీ ప్రసంగం 56 నిమిషాలే సాగింది. పంద్రాగస్టు వేడుకలో ఆయన ఇంత తక్కువ సమయం మాట్లాడటం ఇదే తొలిసారి. గతేడాది 96 నిమిషాలు ప్రసంగించి ఎక్కువ సమయం మాట్లాడిన ప్రధానిగా రికార్డు సృష్టించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన ప్రసంగం సుదీర్ఘంగా ఉంటోందంటూ ఫిర్యాదులు అందాయని, ఈసారి దాన్ని కుదిస్తానని గత నెల ‘మన్‌కీ బాత్’లో చేసిన వాగ్దానాన్ని మోదీ నిలబెట్టుకున్నారు.
- సారే జహాసే అచ్చా గీతాలాపన సమయంలో మోదీ తన చేతులతో పోడియాన్ని లయబద్ధంగా తట్టడం కనిపించింది.
- వరసగా నాలుగో ఏడాది కూడా మోదీ బుల్లెట్ ప్రూఫ్ ఎంక్లోజర్ కాకుండా బహిరంగ పోడియం నుంచే ప్రసంగించారు.



గతేడాది ఉగ్రదాడిలో అమరుడైన సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ప్రమోద్ కుమార్ భార్య శ్రీనగర్‌లో సీఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యాలయంలో జెండా ఎగరేస్తున్న దృశ్యం



రాష్ట్రపతిభవన్‌లో జరిగిన ‘ఎట్ హోమ్’ కార్యక్రమంలో సోనియా, మోదీ, సుమిత్రా మహాజన్

నల్లధనానికి అడ్డుకట్ట వేశాం: మోదీ

నోట్ల రద్దుతో నల్లధనం ప్రవాహానికి, అవినీతికి అడ్డుకట్ట వేశాం. నల్లధనాన్ని బ్యాంకులకు తీసుకురావడం, చలామణీలో ఉన్న నగదులో భాగం చేసేందుకు చేసిన ప్రయత్నాల్లో విజయం సాధించాం. నల్లధనంపై పోరు కొనసాగిస్తాం. దేశాన్ని, పేదల్ని దోచుకున్నవారు ఈ రోజు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. నోట్ల రద్దు అనంతరం బ్యాంకుల్లో జమ చేసిన 1.75 లక్షల కోట్ల అనుమానిత నగదుపై ప్రభుత్వం ఆరాతీస్తోంది. 18 లక్షల ప్రజల అక్రమార్జనపై కూడా విచారణ కొనసాగుతోంది. నోట్ల రద్దుతో లెక్కల్లో లేని రూ. 3 లక్షల కోట్ల సంపదను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకొచ్చాం. ఇది ప్రభుత్వ వేసిన లెక్క కాదు. నిపుణులే స్వయంగా చెప్పిన వాస్తవం. అందువల్ల బ్యాంకులకు వడ్డీని తగ్గించే అవకాశం ఏర్పడింది. బ్యాంకుల్లో నల్లధనం జమ చేసిన వారు వాటికి లెక్క చెప్పాల్సిన పరిస్థితి తీసుకొచ్చాం. పన్ను చెల్లింపుదారుల సంఖ్య రెండింతలై 56 లక్షలకు చేరింది. గతేడాది ఆ సంఖ్య కేవలం 22 లక్షలే. మొత్తం 3 లక్షల షెల్ కంపెనీలను గుర్తించగా.. అందులో 1.75 లక్షలు మూతపడ్డాయి. గత ఏడాది కాలంలో డిజిటల్ చెల్లింపులు 34 శాతం పెరిగాయి. గత మూడేళ్లలో రూ. 1.25 లక్షల కోట్లకు పైగా నల్లధనాన్ని గుర్తించాం.


కొత్తదనమేం లేదు: విపక్షాలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పంద్రాగస్టు ప్రసంగంపై ప్రతిపక్షాలు పెదవి విరిచాయి. అది పూర్తి నిరాశజనకంగా ఉందని కాంగ్రెస్ ఆరోపించగా, కొత్తదనమేం లేదని లెఫ్ట్ పార్టీలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ స్పందిస్తూ...గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో చిన్నారుల మరణాలను మోదీ ప్రకృతి విపత్తులతో పోల్చడం సరికాదని అన్నారు. రైతులు, యువత, బలహీన వర్గాలకిచ్చిన హామీల అమలులో వైఫల్యంపై ప్రధాని సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ కల్పనను ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.

జూన్ 3న సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష

న్యూఢిల్లీ: అఖిల భారత స్థాయి అధికారుల నియామకం కోసం నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష 2018 జూన్ 3న ఉంటుందని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటించింది. ఫిబ్రవరి 7న నోటిఫికేషన్ విడుదలవుతుందనీ, దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మార్చి 6 అని యూపీఎస్సీ పేర్కొంది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ తదితర అత్యున్నత స్థాయి అధికారుల నియామకానికి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఈ ఉద్యోగాలకు ఎంపిక చేస్తుంది.

ఉత్తర్వులు ఉల్లంఘించిన భగవత్



పలక్కాడ్(కేరళ)/న్యూఢిల్లీ: తమ రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో జెండా ఎగుర వేయద్దంటూ కేరళ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భగవత్ ఉల్లంఘించారు. కేరళలోని పలక్కాడ్ జిల్లాలోని కర్నాగీ అమ్మన్ పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన నిబంధనలకు విరుద్ధంగా జెండా ఎగురవేశారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో ప్రజాప్రతినిధులు, స్కూల్ అధికారులు మాత్రమే జెండా ఎగుర వేయాల్సి ఉంటుంది. ఉత్తర్వులను లెక్కచేయకుండా జెండా ఎగుర వేసినందుకుగాను భగవత్‌పై కేసు నమోదు చేసేందుకు కేరళ ప్రభుత్వం సిద్ధమౌతోంది.

లడఖ్‌లో చైనా చొరబాటు యత్నం

లడఖ్: భారత్ భూభాగంలోకి చొచ్చుకొచ్చేందుకు చైనా చొరబాటు యత్నాల్ని భారత్ బలగాలు దీటుగా తిప్పికొట్టాయి. జమ్మూ కశ్మీర్ లడఖ్ ప్రాంతంలోని ప్యాంగ్యాంగ్ సరస్సు సమీపంలో మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాళ్ల దాడి జరగడంతో ఇరువైపులా కొందరు స్వల్పంగా గాయపడ్డారని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. భారత్ వైపు సరస్సు ఒడ్డున ఉన్న ఫింగర్ ఫోర్, ఫింగర్ ఫైవ్ ప్రాంతాల్లో ఉదయం 6–9 గంటల మధ్య చైనా చొరబాటుకు ప్రయత్నించిందని, అయితే భారత బలగాల అప్రమత్తంగా ఉండడంతో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయని వారు తెలిపారు. అనంతరం చైనా బలగాలు మానవహారంగా ఏర్పడి రాళ్ల దాడికి పాల్పడ్డాయని భారత సరిహద్దు దళం కూడా దీటుగా బదులిచ్చిందని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని ఆర్మీ అధికారులు వెల్లడించారు.

త్రిపుర సీఎం ప్రసంగానికి దూరదర్శన్ నో!



అగర్తలా: దూరదర్శన్, ఆలిండియా రేడియో తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి నిరాకరించాయని త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ ఆరోపించారు. ప్రసంగ పాఠంలో మార్పులు చేస్తేనే ప్రసారం చేస్తామని అవి చెప్పటం అప్రజాస్వామిక, నిరంకుశ, అసహన చర్య అని అభివర్ణించారు. త్రిపుర ప్రభుత్వం మంగళవారం జారీచేసిన ప్రకటన ప్రకారం...డీడీ, ఆకాశవాణి ఆగస్టు 12నే సర్కార్ ప్రసంగాన్ని రికార్డు చేశాయి. అయితే అందులో మార్పులు చేస్తేనే ప్రసారం చేస్తామంటూ సోమవారం సీఎం కార్యాలయానికి లేఖ వచ్చింది.‘సీఎం ప్రసంగాన్ని అధికారులు పరిశీలించారు. ప్రస్తుత రూపంలో దాన్ని ప్రసారం చేయలేం. ప్రజల సెంటిమెంట్లు, సందర్భోచితంగా సీఎం తన సందేశంలో మార్పులు చేస్తే మంచిది’ అని పేర్కొన్నారు. అయితే తన ప్రసం గంలో అక్షరం కూడా మార్చడానికి సీఎం ఒప్పుకోలేదని ఆయన కార్యాలయం చెప్పింది.

దేశవిదేశాల్లో స్వేచ్ఛా గీతిక

ఘనంగా 71వ స్వాతంత్ర్య వేడుకలు

న్యూఢిల్లీ/బీజింగ్/మెల్‌బోర్న్: మువ్వన్నెలు రెపరెపలాడాయి. మహాత్ములను స్మరిస్తూ... వారి త్యాగాలను కీర్తిస్తూ... గుండెలు ఉప్పొంగాయి. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ దేశంలోనే కాదు... విదేశీ గడ్డపైనా భారత 71వ స్వాతంత్ర్య వేడుకలు మిన్నంటాయి. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. అభివృద్ధి పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించారు. జమ్మూ కశ్మీర్‌ను భారత్‌కు కిరీటంలా దేశ ప్రజలంతా విశ్వసిస్తారని, ఎప్పటికీ తమ రాష్ట్రం అలానే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదని సీఎం ముఫ్తీ స్పష్టం చేశారు.

పట్నాయక్‌కు అస్వస్థత: మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో వేడుకల వేదికల వద్ద రుణమాఫీ చేయాలంటూ రైతులు నిరసనలు తెలిపారు. పతాక ఆవిష్కరణలకు అంతరాయం కలిగించారు. ఒడిశా ఉత్సవాల్లో ప్రసంగిస్తుండగా సీఎం నవీన్ పట్నాయక్ హఠాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. అయినా జెండా వందనం అయ్యే వరకు ఉండి, తరువాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన ఆరోగ్యం స్థిరంగానే ఉందని అనంతరం అధికారులు ప్రకటించారు.



విదేశీ గడ్డపై భారతీయం

ప్రపంచం నలుమూలలా ఉన్న వేలాది మంది భారతీయులు స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోయారు. మువ్వన్నెల జెండాలు చేతపట్టి... జాతీయ గీతాలు ఆలపించి భారత మాతకు జేజేలు పలికారు. చైనా, ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్, సౌదీ, బ్రిటన్, ఈజిప్ట్, ఇజ్రాయెల్, దక్షిణాఫ్రికాల్లో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఆస్ట్రేలియాలోని భారతీయులకు ఆ దేశ ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ శుభాకాంక్షలు చెప్పారు. జపాన్ ప్రముఖులు భారతీయులకు అక్కడి వార్తాపత్రికల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటన్‌లోని భారతీయులు చారిత్రక పార్లమెంట్ స్క్వేర్ నుంచి తొలిసారిగా ఫ్రీడమ్ రన్ చేపట్టారు. దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియా, డర్బన్, కేప్‌టౌన్, జోహన్నెస్‌బర్గ్‌ల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ స్వాతంత్ర్య సందేశాన్ని వినిపించారు.

సీఎం రాజీనామా చేయాలి

కమల్ హాసన్ డిమాండ్



చెన్నై: తమిళనాడు సీఎం కె.పళనిస్వామి అవినీతిలో కూరుకుపోయారని ఆరోపిస్తూ ఆయన రాజీనామా చేయాలని నటుడు కమల్ హాసన్ మంగళవారం పరోక్షంగా డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఓ ఆసుపత్రిలో 60 మందికిపైగా చిన్నారులు మరణించగా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండటం తెలిసిందే. ఈ అంశాన్ని ప్రస్తావించిన కమల్ ‘ఓ రాష్ట్రంలో దుర్ఘటన జరిగితే సీఎం రాజీనామా చేయాలని కోరుతున్నారు. కానీ తమిళనాడులో ఏ పార్టీ కూడా రాజీనామాకు డిమాండ్ చేయడం లేదు. చేయాల్సినన్ని నేరాలు చేశారు’ అని ట్వీట్ చేశారు. ఈ వ్యాఖ్యలపై సీఎం, మంత్రులు మండిపడ్డారు. ఆరోపణలకు కమల్ ఆధారాలను చూపించాలన్నారు. కమల్ రాజకీయాల్లో చేరితే ఆయనకు ప్రభుత్వం నుంచి స్పందన అందుతుందని పళనిస్వామి పేర్కొన్నారు. ‘సమాజానికి నువ్వేం చేశావ్’ అని కొందరు మంత్రులు కమల్‌ను ప్రశ్నించారు. అనంతరం అవినీతిపై సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదులు నమోదు చేయాల్సిందిగా కమల్ తన అభిమానులను కోరారు. అవినీతి నుంచి స్వాతంత్ర్యం లేకుంటే మనమంతా బానిసలమేననీ, ధైర్యమున్నవారు కొత్త స్వాతంత్ర్యోద్యమం కోసం సంకల్పం తీసుకోవాలనీ, గెలుపు సాధిస్తామని కమల్ తన తర్వాతి ట్వీట్లలో పేర్కొన్నారు.



మంగళవారం సియోల్‌లో నిర్వహించిన దక్షిణకొరియా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆ దేశ అధ్యక్షుడు మూన్‌జే ఇన్, ఆయన సతీమణి తదితరులు

గోరక్షక దాడులు పెరిగాయి

అమెరికా నివేదిక

వాషింగ్టన్: 2016లో భారత్‌లో గోరక్షక దాడులు పెరిగాయని అమెరికా అధికారిక నివేదిక ఒకటి తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ మతస్వేచ్ఛపై తెచ్చిన ఈ నివేదికను అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ విడుదల చేశారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక వచ్చిన తొలి నివేదిక ఇదే. ఈ దాడులు ముస్లింలపై ఎక్కువగా జరిగాయనీ, కొన్నిసార్లు అధికారులు విచారణ జరపడంలోనూ విఫలమయ్యారని నివేదిక పేర్కొంది. బీజేపీ ప్రభుత్వంలో హిందుత్వ వాదులు హిందూయేతరులపై హింసకు పాల్పడుతుండటంతో మైనారిటీ ప్రజలు భయంతో ఉన్నారని వెల్లడించింది. మతపరమైన హత్యలు, దాడులు, అల్లర్లు, వివక్ష, విధ్వంసం, మత విశ్వాసాలను పాటించకుండా అడ్డుతగలడం, మత మార్పిడులు వంటివి భారత్‌లో 2016 సంవత్సరంలో పెరిగాయని నివేదిక పేర్కొంది.

‘బ్లూవేల్’ లింక్‌లను తొలగించండి

ఇంటర్నెట్ దిగ్గజాలను ఆదేశించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: ప్రమాదకర ‘బ్లూవేల్ చాలెంజ్’ గేమ్, ఆ తరహా ఆన్‌లైన్ ఆటలకు సంబంధించిన అన్ని లింక్‌లను తక్షణం తొలగించాలని కేంద్రం ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఆగస్టు 11న గూగుల్, యాహూ, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్‌లకు ఓ లేఖ రాసింది. 50 రోజులపాటు సాగే బ్లూవేల్ ఆన్‌లైన్ గేమ్‌లో చివరి టాస్క్ ఆత్మహత్య చేసుకోవడం. ఈ గేమ్‌లో లీనమై ఇటీవల మహారాష్ట్రలో ఒకరు, పశ్చిమబెంగాల్‌లో ఒకరు పాఠశాల విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయాన్ని భారత ఇంటర్నెట్ సేవల సరఫరాదారుల (ఐఎస్‌పీ) సంఘం సమర్థించింది. సామాజిక మాధ్యమాలు ప్రభుత్వం ఆదేశించే వరకు నిర్లక్ష్యం వహించకుండా... ఈ గేమ్ వ్యాప్తి చెందకుండా ముందే అడ్డుకోవాల్సిందనీ ఐఎస్‌పీ సంఘం అధ్యక్షుడు అన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు ఓ నియంత్రణ వ్యవస్థ ఉండాల్సిన అవసరాన్ని బ్లూ వేల్ గేమ్ తెలియజేస్తోందని ముంబైకి చెందిన ఓ సైబర్ నిపుణుడు అన్నారు. భారత సంస్కృతికి, చట్టాలకు సరిపోయే ఆటలనే అనుమతించాలన్నారు.

చండీగఢ్‌లో బాలికపై అత్యాచారం

పంద్రాగస్టు వేడుకలకు వెళ్తుండగా దారుణం

చండీగఢ్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పాఠశాలకు వెళ్తున్న బాలికను అపహరించి, అత్యాచారం చేసిన సంఘటన చండీగఢ్‌లో చోటుచేసుకుంది. ఉదయం 8.15 గంటలకు బాధితురాలు(12) చిల్డ్రన్స్ పార్కు దాటుతుండగా 40 ఏళ్ల వ్యక్తి ఆమెను అపహరించి అఘాయిత్యానికి పాల్పడ్డాడని చండీగఢ్ సీనియర్ ఎస్పీ ఈష్ సింఘాల్ చెప్పారు. జరిగినదంతా బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ సంఘటన జరిగిన ప్రదేశమంతా దట్టమైన పొదలతో నిండి ఉందని సింఘాల్ వెల్లడించారు. మేజిస్ట్రేట్ ముందు బాలిక తన వాంగ్మూలాన్ని ఇచ్చిందని, నిందితుడితో తనకు పరిచయం లేదని పోలీసులకు చెప్పిందని పేర్కొన్నారు. బాలికను ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. నిందితుడిని గుర్తించేందుకు సమీప ప్రాంతం లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తామని వెల్లడించారు. బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది.

వర్ధమాన నటిపై లైంగిక వేధింపులు



విజయవాడ: విజయవాడ సమీపంలో నిడమానూరు వద్ద ఓ వర్ధమాన నటిని లైంగిక వేధింపులకు గురి చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ఆ వర్ధమాన నటి మంగళవారం రాత్రి విజయవాడ పటమట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తనకు సినిమాలో హీరోయిన్ చాన్స్ ఇస్తామని హైదరాబాద్‌కు చెందిన వర్ధమాన దర్శకుడు చలపతి, వర్ధమాన హీరో సుజన్‌లు ఆశ కల్పించి తన కారులో హైదరాబాద్ నుంచి భీమవరం తీసుకువెళుతున్నారని పేర్కొన్నారు. తాను ముందు సీట్లో కూర్చున్నానని, డ్రైవింగ్ చేస్తున్న దర్శకుడు చలపతి తనపై చెయ్యివేసి అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. హీరో సృజన్ కూడా తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని పేర్కొన్నారు. గొడవ జరుగుతుండగా తన కారు.. పక్కనే వెళుతున్న ఓ లారీని ఢీకొందని, దీంతో గాయాలపాలైన తనను విజయవాడలో ఓ ప్రైవేట్ ఆస్పతిలో చేర్పించారని పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని తన కుటుంబసభ్యులకు చెప్పగా, వారు హైదరాబాద్ నుంచి వచ్చి తనతో ఫిర్యాదు చేయించారని బాధితురాలు పటమట పోలీసు స్టేషన్ వద్ద మీడియాకు చెప్పారు. నిందితుడు చలపతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సృజన్ పరారయ్యాడు. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పటమట పోలీసు స్టేషన్ ఇన్‌ఛార్జి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ చెప్పారు.

చెట్టును ఢీకొన్న స్కూల్‌బస్సు.. ఏడుగురికి గాయాలు

భోగాపురం: స్వాతంత్ర్య సంబరాల వేళ విజయనగరం జిల్లాలో అపశ్రుతి చోటు చేసుకుంది. స్కూల్‌బస్సు చెట్టును ఢీకొన్న సంఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. వివరాల ప్రకారం.. భోగాపురంలో చంద్రావిద్యానికేతన్ అనే ప్రైవేటు స్కూలు బస్సు అప్పన్నపేట సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన తాటి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో బస్సులో ఉన్న 25 మంది విద్యార్థుల్లో ఏడుగురికి తీవ్రగాయాలవ్వగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి, పీహెచ్‌సీకి తరలించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్ఐ మహేశ్ చెప్పారు.

అరకొర వసతుల ఒంగోలు ట్రిపుల్ ఐటీ

- తరగతి గదుల్లో ల్యాప్‌ట్యాప్‌లు లేకుండానే విద్యాభ్యాసం
- మంచాల్లేక కింద పరుపులు వేసుకొని పడుకుంటున్న వైనం
- అధ్యాపకుల కొరత.. ఆందోళనలో విద్యార్థులు

వేంపల్లె: ఒంగోలు ట్రిపుల్ ఐటీ మొదటి సంవత్సరం విద్యార్థులు అరకొర వసతులతో కాలం వెల్లదీస్తున్నారు. తరగతులు ప్రారంభమై రెండు వారాలు పూర్తయినా విద్యార్థులకు ఇంకా ల్యాప్‌ట్యాప్‌లు అందలేదు. దీంతో విద్యార్థులు తరగతి గదిలో ఖాళీగా కూర్చొని వెనుదిరుగుతున్నారు. ట్రిపుల్ ఐటీ విద్య అంటేనే ల్యాప్‌ట్యాప్‌లతో కొనసాగే విధానం. రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఆధ్వర్యంలో నడిచే ట్రిపుల్ ఐటీలన్నీ వైజ్ఞానిక పద్ధతిలోనే నడవాలి. వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఉన్న ఒంగోలు ట్రిపుల్ ఐటీలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇందులోని మొదటి సంవత్సరం విద్యార్థులకు గత నెల 26న ఓరియెంటేడ్ క్లాస్‌లు ప్రారంభం కాగా.. ఈ నెల 1వ తేదీ నుంచి పూర్తి స్థాయి తరగతులు ప్రారంభమయ్యాయి. కానీ ఇప్పటికీ విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు అందుబాటులో లేకపోవడంతో తరగతి గదిలో ఖాళీగా కూర్చుకుంటున్నారు. ల్యాప్‌ట్యాప్‌లకు సంబంధించి టెండర్ల పక్రియ కొనసాగుతోందని మరో మాసానికి ఇవి వస్తాయని అధికారులు చెబుతున్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్లే ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు ఉన్నాయి.

ఒకే గదిలో 24 మంది విద్యార్థులు

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి 2 వేల మంది విద్యార్థులు ఇక్కడ ఉండగా, ఈ ఏడాది కొత్తగా చేరిన 1,000 మంది విద్యార్థులు మాత్రం అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్న పాత క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్ ఐటీని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న గదుల్లో మంచాలు, పరుపులు ఉన్నప్పటికీ ఇంకా వాటిని అమర్చే పనిలోనే ఉన్నారు. ప్రస్తుతం హాస్టల్ గదుల్లో విద్యార్థులు నేలపైన పరుపులు వేసుకొని నిద్రిస్తున్నారు. 20 నుంచి 24 మంది విద్యార్థులు ఒకే గదిలో కాలం వెళ్లదీస్తున్నారు. తరగతులు ప్రారంభమై రెండు వారాలైనా ఇంకా అరకొర వసతులు కల్పిస్తుండటం దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. అడ్మిషన్లకు మూడు నెలల ముందుగానే వీటిపై అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉందని పలువురు అంటున్నారు.



ల్యాప్‌ట్యాప్‌లు అందక విద్యార్థుల ఇక్కట్లు

సాధారణంగా తరగతులు ప్రారంభమయ్యాక విద్యార్థులకు తరగతి గదిలో ఎవరి సీటు వద్ద వారికి ల్యాప్‌ట్యాప్‌లు అమర్చి ఉంచుతారు. ప్రస్తుతం విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు ఎదురుగా లేకపోవడంతో, కేవలం స్క్రీన్‌పై అధ్యాపకులు చెప్పే పాఠాలను వినాల్సి వస్తోంది.

అధ్యాపకుల పరిస్థితీ అంతే..

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి అధ్యాపకులు పూర్తిస్థాయిలో లేరు. ఈ మధ్య 130 మంది అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఈ సమస్య కోర్టులో ఉండటంతో భర్తీ జరగలేదు. గెస్ట్ ఫ్యాకల్టీ పేరుతో కొందరిని భర్తీ చేసినా, కేవలం 51 మందిని మాత్రమే తీసుకున్నారు. కాగా, ఇడుపులపాయలో చదువుతున్న ఈ 3, ఈ 4 విద్యార్థులను, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చదువుతున్న పీ 1, పీ 2 విద్యార్థులను గెస్ట్ ఫ్యాకల్టీలుగా తీసుకొని వారితోనే చదువులు చెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చదువులు కుంటుపడకుండా చూస్తాం



విద్యార్థుల చదువులు కుంటుపడకుండా చూస్తాం. నెల లోపు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ల్యాప్‌ట్యాప్‌లు విద్యార్థులకు అందకుండా పోయాయి. టెండర్ల పక్రియ కొనసాగుతోంది. త్వరలో అందజేస్తాం. అంతవరకు విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌ల బదులు.. కేబుల్ క్యాబ్‌ట్యాప్‌లను అందజేస్తాం.

– ఆచార్య ఉడత వెంకట బసవరావు (ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్), ఇడుపులపాయ

తిరగబడ్డ జెండా ఆవిష్కరించిన మంత్రి

మచిలీపట్నం టౌన్: మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో అపశ్రుతి ఎదురైంది. జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో తిరగబడి ఉన్న జాతీయ జెండాను రాష్ట్ర న్యాయ, క్రీడల, యువజన సర్వీసులు, ఎన్ఆర్ఐ సాధికారత శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ఎగురవేశారు. ఇలా ఎగరేయటం చట్టప్రకారం నేరం. దీంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. ఆ సమయంలో ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి సోమశేఖర్, సభ్యులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయకుమార్, ఆర్ఎంవో డాక్టర్ అల్లాడ శ్రీనివాసరావు, సిబ్బంది అక్కడే ఉన్నారు.



కాషాయం కిందకు, ఆకుపచ్చ పైకి ఉన్న జెండాను ఎగురవేస్తున్న మంత్రి

771 అడుగుల జెండా

పుత్తూరు: 771 అడుగుల పొడవున్న జాతీయ జెండాతో ఎమ్మెల్యే ఆర్కే రోజా ర్యాలీ నిర్వహించారు. మంగళవారం 71వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని పుత్తూరులో విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను ఊరేగించారు. ర్యాలీకి ముందుగా భారతమాత వేషధారణతో విద్యార్థిని జాతీయపతాకాన్ని చేతపట్టుకోగా, ఎమ్మెల్యే రోజా వందేమాతరం నినాదాలు చేస్తూ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్ నుంచి ఊరేగింపుగా బయల్దేరి టీబీరోడ్డు, మెయిన్ రోడ్డు, బజారు వీధి, కేవీఎస్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడి భారతమాతకు జై నినాదాలు చేశారు.



పెనుప్రమాదంలో ప్రజాస్వామ్యం: రామకృష్ణ



సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యం పెనుప్రమాదంలో ఉందని, స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం (దాసరి భవన్) వద్ద మంగళవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని, వారి ఆశయాలు ఎంత వరకు నెరవేరాయో మేధావులు, లౌకికవాదులు, రాజకీయ పార్టీలు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కమ్యూనిజం సంపాదకులు యంసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులపాటు వర్షాలు

17న వాయవ్య బంగాళాఖాతంలో ఆవర్తనం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సాధారణ వర్షాలు మరో నాలుగు రోజులపాటు కొనసాగనున్నాయి. ప్రస్తుతం కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర–దక్షిణ ద్రోణి రాయలసీమ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విస్తరించి సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉంది. మరోవైపు ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకూ మరో అల్పపీడనద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. వీటి ఫలితంగా బుధ, గురు, శుక్ర, శనివారాల్లో కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో పేర్కొంది. మరోవైపు ఈనెల 17న వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందని ఐఎండీ తెలిపింది. గడచిన 24 గంటల్లో ఆళ్లగడ్డ, కుప్పంలలో 7, యర్రగొండపాలెం, తిరువూరుల్లో 5, కందుకూరులో 4, గంట్యాడ, టెక్కలి, గజపతినగరం, బొబ్బిలిల్లో 3, గరివిడి, ఒంగోలులో 2 సెం.మీల చొప్పున వర్షపాతం రికార్డయింది.

గోవిందుని ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం

సాక్షి, తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం గోకులాష్టమి ఆస్థానం ఘనంగా జరిగింది. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామివారినే ద్వాపర యుగపురుషుడైన శ్రీకృష్ణునిగా స్మరించుకుని ఆలయంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహించటం సంప్రదాయం. ఇందులో భాగంగా రాత్రి 8 నుండి 10 గంటల నడుమ బంగారు వాకిలి చెంత ఉత్సవమూర్తులైన ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. ద్వాదశ తిరువారాధనం, అభిషేక నివేదన అనంతరం ఉగ్రశ్రీనివాసమూర్తి దేవేరులతో కూడి ఆనంద నిలయంలోకి వేంచేపు చేశారు. బంగారు సర్వభూపాల వాహనంలో వెన్నముద్ద ధరించిన శ్రీకృష్ణస్వామిని శయనించినట్లుగా అలంకరించి దివ్యప్రబంధంతో పారాయణం నివేదించారు. సేవాకాలం ముగిసిన తర్వాత తులసితో అర్చించారు. ఇదే సందర్భంగా శ్రీ మద్భాగవతంలోని తృతీయ అధ్యాయంలోని శ్రీకృష్ణ అవతార ఘట్టాన్ని అర్చకులు పురాణ పఠనం, పూజా నివేదనలతో ఆస్థానం ఘనంగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం వేళ ఆలయ పురవీధుల్లో ఉట్లోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార ఆర్జిత సేవలు టీటీడీ రద్దు చేసింది.

ఫిట్‌మెంటు కోసం అధ్యాపకుల మహాధర్నా రేపే..

సాక్షి, అమరావతి: తమకు న్యాయబద్ధంగా అమలు కావలసిన ఫిట్‌మెంటు కోసం ఈనెల 17న విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద మహాధర్నాను చేపట్టనున్నామని ప్రభుత్వ కాలేజీల గెజిటెడ్ టీచర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కరరావు, ఏఆర్ చంద్రశేఖర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ అధ్యాపకులకు ఇంతవరకు ఫిట్‌మెంటు ఫార్ములా ప్రకారం వేతనాలు అమలు చేయడం లేదని చెప్పారు. దీనికి నిరసనగా 17న మహాధర్నాను చేపడుతున్నామని, ఇందులో అధ్యాపకులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'బుద్ధిలేని బుద్దా వెంకన్న.. మతిలేని మంత్రి ఉమా'

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు సీఎం చంద్రబాబుకు రాసిన లేఖపై సమాధానం చెప్పకుండా టీడీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ, ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి నరసింహారావు ధ్వజమెత్తారు. మంగళవారం విజయవాడలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టుకు కేవీపీ అడ్డుపడుతున్నారనడం సరికాదన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న బుద్ధిలేని విధంగా, మంత్రి దేవినేని ఉమా మతిలేని విధంగా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

ఒకే కాన్పులో నలుగురు శిశువుల జననం



తిరువూరు: కృష్ణా జిల్లా తిరువూరులోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది. గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన రామకృష్ణ భార్య భవాని తొలి కాన్పు కోసం బోసుసెంటర్లోని కల్యాణి నర్సింగ్ హోంలో చేరింది. సాధారణ కాన్పులో ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ జన్మించారు. మగశిశువు బలహీనంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్టు డాక్టర్ రామకోటేశ్వరరావు విలేకర్లకు తెలిపారు.

పంద్రాగస్టు వేడుకల్లో పచ్చి అబద్ధాలు

- మూడేళ్ల క్రితం ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు
- చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు
- చంద్రబాబు జీవితమంతా మోసమే
- భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజం

సాక్షి బృందం, నంద్యాల: పవిత్రమైన స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పచ్చి అబద్ధాలు చెబుతూ.. అబద్ధాలు నా వృత్తి, నా ప్రవృత్తి, నా నైజం అని నిరూపించుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల క్రితం కాపులను బీసీల్లో చేరుస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని, డ్వాక్రా సంఘాల రుణాలు బేషరతుగా రద్దుచేస్తామని, ఇంటికో ఉద్యోగం, లేకపోతే నెలకు రూ. 2వేల నిరుద్యోగ భృతి ఇస్తానని.. ఇలాంటి హామీలు 600లకు పైగా ఇచ్చి ఏ ఒక్కటీ అమలు



మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జయరాం తదితరులు

చేయలేదన్నారు. చట్టాలను పరిరక్షించాల్సిన స్థానంలో ఉండి.. వాటి పట్ల ఏమాత్రమూ గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 21 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని గుర్తు చేశారు. వారితో రాజీనామాలు చేయించి చట్టసభలకు గౌరవాన్ని కల్పించి ఉంటే ఆదర్శప్రాయమైన సీఎం అని అందరూ పొగిడేవారన్నారు. కానీ చంద్రబాబు చట్టాలలో ఉండే లొసుగులను వాడుకుని వాటిని తుంగలో తొక్కారన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలో చేరిన శిల్పా చక్రపాణిరెడ్డితో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని ప్రశంసించారు. చేయబోయే కార్యక్రమాలు స్వాతంత్ర్య దినోత్సవంనాడు చంద్రబాబు నోటివెంట వెలువడుతుంటే భూతాలు, దెయ్యాలు భగవద్గీత చదివినట్లుగా ఉంటుందని ఎద్దేవా చేశారు.

నీ చరిత్ర నీచ సంస్కృతితో ప్రారంభం

'చంద్రబాబూ నీ గతం, నీ చరిత్ర నీచపు సంస్కృతితో ప్రారంభించావు. దాన్ని అవినీతి పుట్టగా మార్చివేశావు. దేశ రాజకీయ చరిత్రలోనే అత్యంత నీచాతి నీచమైన నికృష్టుడివిగా పేర్గాంచావు. రాజకీయాల్లో నాలాంటి నిప్పులేదు.. ఉప్పులేదు.. అంటూ పప్పులాంటి కొడుకును కన్న నీవు నీతుల గురించి మాట్లాడుతున్నావంటే ఇంతకంటే దౌర్భాగ్యం రాష్ట్ర ప్రజలకు మరొకటి ఉండదు. నీతోపాటు నీమంత్రులు, టీడీపీ నాయకులు జలగల్లాగా మానవ రక్తాన్ని పీలుస్తున్న నర రూప రాక్షసులు. నిజంగా నీవు అభివృద్ధి చేసి ఉంటే నంద్యాల ఉప ఎన్నికలో ఇంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలను మోహరించడం ఎందుకు? అని ప్రశ్నించారు. సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు: కేసన

ఏఎన్‌యూ (గుంటూరు): కాపు రిజర్వేషన్ల పేరుతో సీఎం చంద్రబాబు బీసీలకు అన్యాయం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లకు ఏకైక అర్హత సాంఘిక, విద్యారంగాల్లో వెనుకబాటుతనమేనని చెప్పారు. కాపులు ఆయా రంగాల్లో బీసీల కంటే మెరుగైన స్థితిలోనే ఉన్నారని, వారికి రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయంగా ఎదిగిన కాపులు.. వెనుకబాటుతనం అనుభవిస్తున్న బీసీలతో పోటీపడటం అన్యాయమన్నారు. బీసీలు అనేక వివక్షలు, అవమానాలు ఎదుర్కొంటున్నారని, కాపులకు ఇలాంటి పరిస్థితి లేదు కదా? అని ఆయన ప్రశ్నించారు. కాపులది బీసీలతో చాకిరీ చేయించుకున్న కులమే కానీ.. చాకిరీ చేసే కులం కాదన్నారు. నష్టం కలగకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామంటూ సీఎం చెబుతున్న మాటలు.. కేవలం బీసీలను మభ్య పెట్టేందుకేనని విమర్శించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అంగిరేకుల ఆదిశేషు, కుమ్మరి క్రాంతికుమార్, షేక్ అన్వర్, ఈడే మురళీకృష్ణ, కన్నా మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సీమలో వెయ్యి ఎకరాలకైనా నీరిచ్చారా?

- కేసీ ఆయకట్టులో పంటలు ఎండిపోవడానికి చంద్రబాబే కారణం
- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి

సాక్షి బృందం, నంద్యాల: చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాయలసీమలో కనీసం వెయ్యి ఎకరాలకై నా సాగునీరు ఇచ్చారా అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమలో కేసీ కెనాల్ కింద పంటలు ఎండిపోవడానికి చంద్రబాబే కారణమన్నారు. కర్ణాటకలో జలాశయాలు నిండినా ఏపీకి నీళ్లు రావడం లేదని, దీంతో సీమలో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. ఏపీకి నీటిని విడుదల చేయాలని సీఎం కర్ణాటక ప్రభుత్వానికి, కృష్ణా బోర్డుకు లేఖ ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. కేసీ కెనాల్ స్థిరీకరణకు అవసరమైన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఎస్ నాగిరెడ్డి

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది దాటినా పట్టించుకోలేదన్నారు. శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల సాధారణ నీటిమట్టం ఉంటేనే కేసీకి, ఎస్సార్బీసీకి నీటి విడుదల సాధ్యమని, ఆ మేరకు నీరు నిలపకుండా దిగువకు విడుదల చేస్తూ రాయలసీమకు ద్రోహం చేస్తున్నారన్నారు. కేసీ కెనాల్‌లో చుక్క నీరు లేక నంద్యాల నియోజకవర్గంలో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు ప్రమాదంలో పడటానికి బాబే కారణమన్నారు. వీటిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

ఏడేళ్ల సంప్రదాయానికి తెర

ఖైరతాబాద్ గణపయ్యకు నిలిచిపోయిన సురుచి లడ్డూ కానుక

మండపేట (తూర్పుగోదావరి): కేజీల నుంచి మొదలై టన్నుల్లోకి పెరిగిన ఖైరతాబాద్ గణపయ్య మహా లడ్డూ తయారీ ఈ ఏడాది నిలిచిపోయింది. మహా గణపతికి ఏడేళ్ల నుంచి మహా నైవేద్యాన్ని సమర్పిస్తూ వచ్చిన సంప్రదా యానికి తెరపడింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ కమిటీ నుంచి స్పందన లేకపోవడంతో కానుకను అందించే ప్రయత్నాన్ని తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం తాపేశ్వరంలోని సురుచి ఫుడ్స్ సంస్థ విరమించుకుంది. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో కొలువుదీరే గణనాథునికి 500 కిలోల లడ్డూను కానుకగా ఇస్తున్నట్లు సురుచి సంస్థ ప్రకటించింది. ప్రతి ఏటా వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సభ్యులు సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు ఆహ్వానించి, లడ్డూ పరిమాణంపై చర్చించేవారు. అయితే ఈ ఏడాది కమిటీ నుంచి ఆహ్వానం లేకపోవడంతో లడ్డూ కానుక ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు మల్లిబాబు తెలిపారు.



ఖైరతాబాద్ గణనాథుని చేతిలో కొలువుదీరిన సురుచి 6,000 కిలోల మహాలడ్డూ నైవేద్యం (ఫైల్)

ఐడీటీఆర్ టెండర్లకు గ్రహణం

- రెండేళ్ల కిందటే రూ.18.61కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- శంకుస్థాపన చేసినా ఇప్పటికీ ఖరారు కాని టెండర్లు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రం ఆరా

సాక్షి, అమరావతి: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్నట్లుగా అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం (ఐడీటీఆర్) ఏర్పాటుకు కేంద్రం నిధులు కేటాయించినా ఏపీ సర్కారు మాత్రం పట్టించుకోవడం లేదు. 16 నెలల క్రితం ఐడీటీఆర్‌కు శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు టెండర్లను ఖరారు చేయకపోవడమే సర్కారు నిర్లిప్తతకు అద్దం పడుతోంది. డ్రైవింగ్‌లో నైపుణ్యం పెంపొందించడానికి, పరిశోధనలు జరపడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ టెస్ట్ రీసెర్చి సెంటర్ (ఐడీటీఆర్)ను రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం ఏపీకి కేటాయించింది. రెండేళ్ల క్రితం ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు పీపీపీ విధానంలో మారుతీ సుజుకీ కంపెనీ భాగస్వామ్యంతో రూ.18.61 కోట్లు మంజూరు చేసింది. ఐడీటీఆర్‌ను ప్రకాశం జిల్లా దర్శి మండంలో వెంకటాచలంలో ఏర్పాటు చేస్తామన్న ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం 20 ఎకరాలు కేటాయించగా.. మారుతీ సుజుకీ కంపెనీతో రవాణా శాఖ ఎంఓయూ కుదుర్చుకుంది. గతేడాది ఏప్రిల్‌లో ఐడీటీఆర్‌కు శంకుస్థాపన చేశారు. టెండర్ల బాధ్యతను ఆర్ అండ్ బీకి అప్పగించి 2018 నాటికల్లా పనులు పూర్తయ్యేలా చూడాలని రవాణా శాఖ కోరింది. అయితే ఆర్‌అండ్‌బీ ఇప్పటివరకు టెండర్లను ఖరారు చేయకపోవడం గమనార్హం. ప్రీ బిడ్ సమావేశం నిర్వహించకుండా దాఖలైన టెండర్లను సర్కారు పెద్దల సూచనతో పక్కన పెట్టినట్లు సమాచారం. నిధులు కేటాయించినా.. ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడంపై ఏపీ సర్కారుకు కేంద్రం లేఖ రాసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.18 కోట్లను ఖర్చు చేసి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయకపోతే నిధులు వెనక్కు మళ్లే అవకాశం ఉందని రవాణారంగ నిపుణులు చెప్పడం గమనార్హం.

ఐడీటీఆర్‌తో ఉపయోగాలు

- ఐడీటీఆర్ ఏర్పాటుతో సుమారు 250 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధితో పాటు రోడ్డు ప్రమాదాలపై విశ్లేషించి వాటిని తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందిస్తారు.
- ఏటా 20 వేల మంది నూతన డ్రైవర్లకు శిక్షణతో పాటు వాహనాలు నడిపే డ్రైవర్లకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారు.
- రవాణా శాఖలో నూతన ఆవిష్కరణలపై పరిశోధనలు నిర్వహిస్తారు.
- రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తారు.

మున్సిపల్ డైరెక్టరేట్ వద్ద 17న టీచర్ల ధర్నా


సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్ల, టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి స్పందన లేనందున ఈ నెల 17న గురువారం గుంటూరులోని మున్సిపల్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నాను చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఇంతకు ముందు మున్సిపల్, కార్పొరేషన్ కార్యాలయాల ముందు ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మొత్తం 21 సమస్యల పరిష్కార డిమాండ్‌తో ఈ మహాధర్నాను చేపడుతున్నట్లు తెలిపారు.

శ్రీకాళహస్తి ఫారెస్ట్ ఆఫీసర్‌కు స్మారక అవార్డు

హైదరాబాద్: చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.వెంకట సుబ్బయ్యకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన కేవీఎస్ బాబు ఐఎఫ్ఎస్ స్మారక బంగారు పతకానికి ఎంపికయ్యారు. స్వాత్రంత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ శివారు దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్టు అకాడమీలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ మనోరంజన్ భాంజా చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. రూ.15 వేల నగదు, ప్రశంసా పత్రం, బంగారు పతకాన్ని ఆయనకు అందజేశారు. అటవీ శాఖలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ఈ అవార్డును అందజేస్తారు. వెంకట సుబ్బయ్య 2016–17లో 2,844 కిలోల ఎర్రచందనం దుంగలు, 8 వాహనాలను పట్టుకున్నారు. 300 హెక్టార్లలో ఎర్రచందనం మొక్కలు పెంచి 90% బతికేలా చర్యలు తీసుకున్నందుకు గాను ఆయన ఈ పతకానికి ఎంపికయ్యారు.

సాక్షి స్పోర్ట్స్
బుధవారం 16-8-2017





సప్తవర్ణ శోభితం...

ఒలింపిక్స్ వెలుగులు... క్రికెట్ మెరుపులు...

70 ఏళ్ల భారత క్రీడా ప్రస్థానం

ఏడు దశాబ్దాలు... ఒక దేశం సొంతంగా క్రీడల్లో సాధించిన ప్రగతి గురించి చెప్పుకునేందుకు ఈ సమయం సరిపోతుంది. భారత్‌కు సంబంధించి ఇందులో తొలి సగం క్రీడల్లో ఉనికి కోసం చేసిన ప్రయత్నం కాగా... మిగతా సగం క్రికెట్ ప్రాభవం, దాని కారణంగా ఆదరణ కోల్పోయిన ఇతర క్రీడలు కనిపిస్తాయి.

ప్రపంచ కప్ విజయాలు, ఒలింపిక్ పతకాలు, వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనలు, దేశంలో ఆటకు దిశానిర్దేశం చేసిన క్షణాలు, ఫలితంతో సంబంధం లేకుండా అభిమానుల గుండెల్లో నిలిచిపోయిన ఘటనలు... స్వాతంత్ర్యానంతరం భారత క్రీడా రంగం పురోగతిలో చెప్పుకోదగ్గ ఘటనలు ఎన్నో. అలాంటి విశేషాల సమాహారం... -సాక్షి క్రీడావిభాగం

హాకీ (5 స్వర్ణాలు, 1975 ప్రపంచకప్)



స్వాతంత్ర్యానికి ముందు 3 ఒలింపిక్స్‌లలో స్వర్ణాలతో సత్తా చాటిన భారత జట్టు 1947 తర్వాత మరో 5 బంగారు పతకాలతో వెలుగులు విరజిమ్మింది. 1948 లండన్ ఒలింపిక్స్ నుంచి 1980 మాస్కో ఒలింపిక్స్ వరకు ఈ ప్రస్థానం కొనసాగింది. వీటికి తోడు 1975లో జరిగిన ప్రపంచకప్‌ను కూడా గెలుచుకొని హాకీలో తమ ఆధిక్యాన్ని భారత్ బలంగా ప్రదర్శించింది. కానీ 1983 తర్వాత క్రికెట్ పురోగతికి తోడు స్వీయ వైఫల్యాలతో భారత హాకీ ప్రాభవం తగ్గిపోయింది. ఆ తర్వాత 9 ఒలింపిక్స్ క్రీడలు జరిగితే ఐదో స్థానమే అత్యుత్తమ ప్రదర్శన. ఒకసారి అయితే కనీసం అర్హత కూడా సాధించలేకపోయింది. ఇక గత దశాబ్ద కాలంలో పడుతూ లేస్తూ మన హాకీ ప్రయాణం సాగుతోంది. ఆహా అనిపించే ఒక్క విజయం లభించే లోపే, అయ్యో అనిపించే మరో నాలుగు పరాజయాలతో తీవ్రంగా నిరాశపర్చడం జట్టుకు అలవాటైంది.

బ్యాడ్మింటన్ (2 ఆల్ ఇంగ్లండ్ టైటిల్స్, 2 ఒలింపిక్ పతకాలు)



భారత బ్యాడ్మింటన్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన క్షణం 1980 ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్. 9 సార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన ప్రకాశ్ పడుకోన్ ఆల్ ఇంగ్లండ్ టైటిల్ గెలుచుకొని ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌తో సమాన విలువ గల ఈ టైటిల్‌ను ఆ తర్వాత 2001లో తెలుగు తేజం పుల్లెల గోపీచంద్ కూడా సొంతం చేసుకొని మన కీర్తిని పెంచాడు. దీని తర్వాత మరో రెండు ఘటనలు భారత్‌లో బ్యాడ్మింటన్ మేనియాను పెంచాయి. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కాంస్య పతకం సాధించి అందరి దృష్టినీ ఆకర్షించింది. నాలుగేళ్ల తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌లో పూసర్ల వెంకట (పీవీ) సింధు దీనికంటే మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తూ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు దేశంలో క్రికెట్ తర్వాత రెండో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడగా బ్యాడ్మింటన్ మారిందంటే ఈ ఘనతలే కారణం.

అంజూ అద్భుతం...




ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు ఒకే ఒక్క పతకం దక్కింది. దిగ్గజాలు పాల్గొనే ఈ పోటీల్లో సాధించిన గెలుపు మన అథ్లెటిక్స్ చరిత్రలోనే అరుదైన ఘట్టం. 2003 పారిస్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అంజూ బాబీ జార్జ్ లాంగ్ జంప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత మరే భారత అథ్లెట్‌కు పతకం దక్కలేదు.

టెన్నిస్ (ఒలింపిక్ పతకం, గ్రాండ్‌స్లామ్ డబుల్స్ విజయాలు)



ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ సాధించిన కాంస్య పతకమే నిస్సందేహంగా భారత టెన్నిస్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా చెప్పవచ్చు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో అతను ఈ ఘనత సాధించి అందరినీ అబ్బుర పరిచాడు. ఇక సింగిల్స్‌లో ఓపెన్ శకానికి ముందు 1961 సమయంలో రామనాథన్ కృష్ణన్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరుకోవడం గొప్ప ఘనత. ఈ తరంలో భారత టెన్నిస్‌కు గుర్తింపు తెచ్చిన త్రయంగా పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జాలను చెప్పవచ్చు. ఈ ముగ్గురూ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నవారే. ఈ ముగ్గురి ఖాతాలో కలిపి మొత్తం 36 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ ఉన్నాయి.

అథ్లెటిక్స్ (మిల్కా సింగ్, పీటీ ఉష ప్రదర్శనలు)





భారత్‌లో పరుగుకు గుర్తింపు తెచ్చిన మొదటి వ్యక్తి మిల్కా సింగ్. స్వాతంత్ర్యానంతరం 1960 రోమ్ ఒలింపిక్స్‌లో అతని ప్రదర్శన ఎప్పటికీ భారత క్రీడల్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ఈ పోటీల 400 మీటర్ల పరుగులో అతను నాలుగో స్థానంలో నిలిచాడు. కేవలం 0.1 సెకను వ్యవధిలో కాంస్యం కోల్పోయాడు. కానీ నాటి పరిస్థితులు, సౌకర్యాలను బట్టి చూస్తే దీనిని చాలా పెద్ద ఘనతగా చెప్పవచ్చు. అథ్లెటిక్స్‌లో కూడా మన విజయాల గురించి మాట్లాడటం, అథ్లెట్లకు గుర్తింపు లభించడం పీటీ ఉషతోనే సాధ్యమైంది. ఈ 'పయ్యోలి ఎక్స్‌ప్రెస్' 1984 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో సెకనులో వందో వంతు తేడాలో 400 మీటర్ల విభాగంలో కాంస్య పతకాన్ని కోల్పోయింది. అయితే 1986 సియోల్ ఆసియా క్రీడల్లో ఏకంగా 4 స్వర్ణాలు సాధించి భారత్ ఘనతను చాటింది. అప్పటి నుంచి పరుగెత్తే ప్రతీ పాపను పీటీ ఉషతో పోల్చడం మన దేశంలో అలవాటుగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

క్రికెట్ (1983, 2011 వన్డే ప్రపంచ కప్‌లు, 2007 టి20 ప్రపంచకప్)



స్వాతంత్ర్యానికి ముందు భారత క్రికెట్ జట్టు ఒక్క ఇంగ్లండ్‌తోనే నాలుగు టెస్టు సిరీస్‌లు ఆడి నాలుగూ ఓడింది. 1947 నవంబర్‌లో ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌తో భారత్ కొత్త ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత పలు గొప్ప విజయాలు, అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చినా... 1983 వరకు కూడా క్రికెట్‌పై అభిమానం దేశంలో కొద్ది మందికే పరిమితం. వన్డే క్రికెట్ వచ్చిన తర్వాత 1975, 1979లలో మన ఘోర ప్రదర్శన ఆటపై ఆసక్తిని మరింత తగ్గించింది. అయితే 1983లో కపిల్ దేవ్ నాయకత్వంలోని భారత జట్టు వన్డేల్లో విశ్వవిజేతగా నిలవడంతో ఒక్కసారి అంతా మారిపోయింది. ఈ గెలుపు తర్వాత దేశ ప్రజల జీవితాల్లో క్రికెట్ ఒక భాగంగా మారిపోయింది.



ఇంటింటా అభిమానులు, ప్రత్యక్ష ప్రసారాలు, భారీ ఎత్తున ఆదాయం, క్రికెటర్లను దేవుడిలా కొలవడం... ఇలా అన్నింటికీ ఈ విజయమే నాంది పలికింది. 28 ఏళ్ల తర్వాత 2011లో భారత్ మరోసారి ప్రపంచ కప్ గెలవడం అభిమానులను ఆనంద పర్చింది. అంతకుముందే 2007లో భారత్ మరో క్రికెట్ విప్లవానికి కారణమైంది. ఆ ఏడాది తొలి టి20 ప్రపంచ్‌కప్‌ను భారత్ గెలుచుకోవడం కూడా క్రికెట్‌లో కొత్త శకానికి తెర తీసింది. టి20 ఫార్మాట్ ఉజ్వలమైన భవిష్యత్తుకు, ఆటగాళ్ల కోసం బంగారు బాతులా పరిణమించేందుకు ఈ వరల్డ్ కప్ మేలి మలుపుగా చెప్పవచ్చు.

ఆనందుడి విజయం...



చదరంగ క్రీడలో ఒక భారతీయుడు సాధించిన అద్భుతం ఇది. తన చతురంగ బలాలను సమర్థంగా నడిపిస్తూ చెస్ ప్రపంచానికి రారాజుగా నిలిచిన ఘనత మన విశ్వనాథన్ ఆనంద్‌కు దక్కింది. 2000లో తొలిసారి ఆనంద్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచి ఈ క్రీడలో భారత కీర్తిని శిఖరాన నిలిపాడు. ఆ తర్వాత కూడా మరో నాలుగు సార్లు ఆనంద్ విశ్వ విజేత కావడం విశేషం.

ఫుట్‌బాల్ (ఒలింపిక్స్‌లో నాలుగో స్థానం)



ప్రపంచ ఫుట్‌బాల్‌లో భారత్ పరిస్థితి ఇప్పుడు చూస్తే అంతా అగమ్య గోచరం. ర్యాంకు 100కు చేరువలో... ఆట చూస్తే అంతకన్నా ఘోరమే. కానీ 1950 నుంచి 1962 వరకు పుష్కర కాలం పాటు మన ఫుట్‌బాల్ కూడా వెలిగింది. ఎంతో మంది గొప్ప ఆటగాళ్లు తయారయ్యారు. 1951, 1962 ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచిన మన జట్టు 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో కూడా నిలవడం విశేషం. అయితే 80వ దశకం నుంచి తిరోగమన బాట పట్టిన ఈ ఆట క్రికెట్ వెల్లువలో దాదాపు కొట్టుకుపోయింది. లీగ్‌ల ద్వారా ప్రస్తుతం నిలబెట్టే ప్రయత్నం కొంత చేస్తున్నా అది కంటితుడుపుగానే సాగుతోంది.

పసిడి గురి (2008 ఒలింపిక్స్)



భారత షూటర్ అభినవ్ బింద్రా ఒలింపిక్ క్రీడల్లో సాధించిన స్వర్ణం మన ఆటల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో బింద్రా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో పసిడి పతకం గెలుచుకున్నాడు. మన ఒలింపిక్ చరిత్రలో వ్యక్తిగత విభాగంలో ఇదే ఏకైక స్వర్ణం.

కబడ్డీలో అజేయం...



గ్రామీణ క్రీడ కబడ్డీలోనూ భారత్‌దే ఆధిపత్యం. 1990 బీజింగ్ ఆసియా క్రీడల్లో తొలిసారి కబడ్డీని మెడల్ ఈవెంట్‌గా ప్రవేశ పెట్టారు. అప్పటి నుంచి భారత్ వరుసగా ఏడు ఆసియా క్రీడల్లో అజేయంగా నిలిచి ఏడు స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. మూడుసార్లు నిర్వహించిన ప్రపంచకప్ పోటీల్లోనూ భారత్ చాంపియన్‌గా నిలిచింది. దక్షిణాసియా క్రీడల్లో మూడుసార్లూ టీమిండియాకు ఎదురేలేదు.

కొన్నింట్లో ఇంకా వెనుకబాటే...

స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా కొన్ని రకాల క్రీడల్లోనే భారత జట్టు పరిస్థితి మెరుగ్గా ఉంది. వాటిలోనే మంచి ఫలితాలు కూడా వస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉన్నా... ఇంకా మన ముద్ర చూపించని క్రీడలు కూడా చాలా ఉన్నాయి. ఆర్చరీ, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్క్వాష్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్‌లలో మన ఆట అంతంత మాత్రమే. మున్ముందు అయినా వీటిలో కూడా మన వైభవం పెరుగుతుందని ఆశిద్దాం.

జాదవ్ నుంచి సాక్షి వరకు...



భారత్‌కు స్వాతంత్ర్యం లభించేనాటికి మన దేశం తరఫున ఒక్కరు కూడా వ్యక్తిగత విభాగంలో ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయారు. అయితే ఐదేళ్ల తర్వాత 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో ఆ కల ఫలించింది. ఖాషాబా జాదవ్ కుస్తీ పోటీల్లో కాంస్యం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. మెక్సికో, కెనడా, జర్మనీలకు చెందిన స్టార్ రెజ్లర్లను ఓడించి అతను సాధించిన ఈ విజయం అసమానం. ఆ తర్వాత కరణం మల్లీశ్వరి (2000 సిడ్నీ ఒలింపిక్స్; వెయిట్‌లిఫ్టింగ్-కాంస్యం), రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ (2004 ఏథెన్స్; షూటింగ్-రజతం), విజేందర్ సింగ్ (2008 బీజింగ్; బాక్సింగ్-కాంస్యం), సుశీల్ కుమార్ (2008 బీజింగ్; రెజ్లింగ్-కాంస్యం) కూడా ఒలింపిక్స్‌లో తమ సత్తాను ప్రదర్శించారు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో భారత్ ఏకంగా ఆరు పతకాలు సాధించి తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. రెజ్లర్ సుశీల్ కుమార్, షూటర్ విజయ్ కుమార్‌లు రజత పతకాలు గెలుపొందగా...యోగేశ్వర్ దత్ (రెజ్లింగ్), మేరీ కోమ్ (బాక్సింగ్), గగన్ నారంగ్ (షూటింగ్), సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్) కాంస్య పతకాలు సాధించారు. భారత ఒలింపిక్ చరిత్రలో వ్యక్తిగత క్రీడాంశంలో రెండు పతకాలు (రజతం, కాంస్యం) సాధించిన ఏకైక క్రీడాకారుడిగా సుశీల్ కుమార్ నిలిచాడు. 2016 రియో ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో సాక్షి మలిక్ కాంస్యంతో, షట్లర్ పీవీ సింధు రజతంతో తమ విలువను చూపించారు.

మూడేళ్ల తర్వాత... నాదల్ నంబర్‌వన్



ఒహాయో: స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంకర్ అవుతున్నాడు. ఈ నెల 21న అధికారిక ఏటీపీ సింగిల్స్ ర్యాంకుల్లో అతను టాప్ ర్యాంకులో నిలువనున్నాడు. దీంతో మూడేళ్ల తర్వాత అతను అగ్రస్థానానికి చేరుకోనున్నాడు. ఈ 31 ఏళ్ల స్పెయిన్ దిగ్గజం చివరిసారిగా 2014 జూన్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. సిన్సినాటి మాస్టర్స్ సిరీస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో నాదల్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఈ టోర్నీ నుంచి స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెడరర్, ప్రస్తుత నంబర్‌వన్ ర్యాంకర్ ఆండీ ముర్రే తప్పుకోవడంతో నాదల్ టాప్ ర్యాంక్‌కు మార్గం సుగమమైంది. రికార్డు స్థాయిలో 19 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన ఫెడరర్... ఈ ఏడాది ఆస్ట్రేలియా, వింబుల్డన్ టైటిళ్లతో తన ఫామ్ చాటాడు. మరోవైపు పదో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో చరిత్ర సృష్టించిన నాదల్ కెరీర్‌లో 15 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లున్నాయి. త్వరలోనే యూఎస్ ఓపెన్‌కు సన్నద్ధమవుతున్న అతనికి సిన్సినాటి ఈవెంట్ సన్నాహకంగా ఉపయోగపడనుంది.

లంకలో భారత క్రికెటర్ల స్వాతంత్ర్య సంబరాలు

కాండీ: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని జాతీయ క్రికెట్ జట్టు సభ్యులు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రీలంకలోని కాండీలో జరిగిన ఈ వేడుకల్లో జట్టు ఆటగాళ్లు, వారి కుటుంబ సభ్యులతో పాటు సహాయక సిబ్బంది కూడా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సంబరాల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి జాతీయ జెండాను ఆవిష్కరించాడు. మూడు టెస్టుల సిరీస్‌లో చివరి మ్యాచ్ రెండు రోజుల ముందే సోమవారం ముగియడంతో టీమిండియా సభ్యులంతా మిగిలిన సమయాన్ని సరదాగా గడుపుతున్నారు.

ఆఫ్రిది శుభాకాంక్షలు...

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మన దేశ ప్రజలకు పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ ఆఫ్రిది శుభాకాంక్షలు తెలిపాడు. 'మన పొరుగున ఎవరు ఉండాలో నిర్ణయించుకునే అవకాశం మనకు లేదు. కాబట్టి ప్రేమాభిమానాలు, శాంతి దిశగా కలిసి పని చేద్దాం. మానవత్వం వర్ధిల్లుగాక' అని ఆఫ్రిది ట్వీట్ చేశాడు. మరోవైపు ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మ్యాథ్యూ హేడెన్ కూడా జనగణమన గీతంలోని కొన్ని వాక్యాలకు అనువాదం కూడా రాస్తూ భారతదేశానికి శుభాకాంక్షలు చెప్పాడు.

టాప్–10లోకి రాహుల్

భారత జట్టు ఓపెనర్ కేఎల్ రాహుల్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్–10లోకి ప్రవేశించాడు. రెండు స్థానాలు మెరుగుపర్చుకున్న అతను 9వ స్థానానికి చేరుకున్నాడు. శ్రీలంకతో పోరులో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన శిఖర్ ధావన్ పది స్థానాలు మెరుగుపర్చుకొని 28వ స్థానానికి చేరుకున్నాడు. సస్పెన్షన్‌తో మూడో టెస్టుకు దూరమైన జడేజా ఆల్‌రౌండర్ల జాబితాలో నంబర్‌వన్ నుంచి రెండో స్థానానికి పడిపోయాడు.



భారత్ 'ఎ' పరాజయం

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా 'ఎ'తో జరిగిన తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టుకు భంగపాటు ఎదురైంది. ఇటీవలే వన్డే టోర్నీ గెలిచి ఊపు మీదున్న భారత్, మంగళవారం ముగిసిన తొలి టెస్టులో 235 పరుగుల తేడాతో ఓడింది. 447 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలింది. అంకిత్ బావ్నే (46), ఇషాన్ కిషన్ (39) కొద్దిగా పోరాడారు. పేసర్ జూనియర్ డాలా (5/36) భారత్‌ను దెబ్బ తీశాడు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1–0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టు శనివారం నుంచి ప్రిటోరియాలోనే జరుగుతుంది.

గుజరాత్ జెయింట్స్ ఖాతాలో ఐదో గెలుపు

అహ్మదాబాద్: హోరాహోరీ పోరులో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 27–24 స్కోరుతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. తొలి పది నిమిషాల్లో 11–3తో ఆధిక్యం కనబరిచిన బెంగళూరు బుల్స్ తొలి అర్ధభాగాన్ని 14–9తో ముగించింది. అయితే రెండో అర్ధభాగంలో గుజరాత్ అనూహ్యంగా పుంజుకోవడంతో మ్యాచ్ జరిగే కొద్దీ ఉత్కంఠ పెరిగింది. రైడర్లు వరుసగా పాయింట్లు చేయడంతో ఈ టోర్నీలో గుజరాత్ ఐదో విజయాన్ని సాధించింది. టాకిల్‌లో పర్వేశ్ (4) ఆకట్టుకున్నాడు. టాకిల్ చేసిన నాలుగు సార్లు పాయింట్లు తెచ్చిపెట్టాడు. రైడింగ్‌లో సచిన్ (4), రోహిత్ గులియా (4), సునీల్ కుమార్ (3) రాణించారు. అంతకుముందు జరిగిన పోరులో పుణేరి పల్టాన్ 34–17తో బెంగాల్ వారియర్స్‌పై అలవోక విజయం సాధించింది. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో హర్యానా స్టీలర్స్‌తో తమిళ్ తలైవాస్, గుజరాత్ జెయింట్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడతాయి. ఈ మ్యాచ్‌లను 'స్టార్ స్పోర్ట్స్-2' చానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

భారత హాకీ జోరుగా...

రెండో మ్యాచ్‌లోనూ నెదర్లాండ్స్‌పై విజయం
2–0తో సిరీస్ సొంతం



ఆమ్‌స్టర్‌డామ్: యూరోప్ పర్యటనలో భారత హాకీ జట్టుకు చక్కటి విజయం లభించింది. ప్రపంచ నాలుగో ర్యాంకర్ నెదర్లాండ్స్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2–0తో సొంతం చేసుకుంది. సోమవారం రాత్రి జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌ను బోల్తా కొట్టించింది. భారత జట్టులో 9 మంది జూనియర్ ఆటగాళ్లు ఉన్నా... పటిష్టమైన నెదర్లాండ్స్‌పై మనదే పైచేయి కావడం విశేషం. 4వ నిమిషంలో గుర్జంత్ సింగ్, 51వ నిమిషంలో మన్‌దీప్ సింగ్ ఒక్కో గోల్ చేసి భారత్‌ను విజేతగా నిలిపారు. మ్యాచ్ నాలుగో నిమిషంలో వరుణ్ డ్రాగ్ ఫ్లిక్ ద్వారా గోల్ చేసే ప్రయత్నం చేయగా డచ్ కీపర్ దానిని అడ్డుకున్నాడు. అయితే రీబౌండ్‌లో రివర్స్ స్టిక్‌తో బంతిని పోస్ట్‌లోకి పంపించిన గుర్జంత్ అంతర్జాతీయ హాకీలో తన తొలి గోల్ నమోదు చేశాడు. ఆ తర్వాత భారత్ పదే పదే ప్రత్యర్థిపై ఎదురుదాడి చేసింది. అర్మాన్ ఖురేషీకి గోల్ చేసేందుకు మంచి అవకాశం వచ్చినా... దురదృష్టవశాత్తూ బంతి గోల్‌పోస్ట్‌కు కాస్త దూరంగా వెళ్లింది. చివరి క్వార్టర్‌లో పెనాల్టీని మన్‌దీప్ గోల్‌గా మలచడంతో ఆధిక్యం 2–0కు పెరిగింది. చివరకు 58వ నిమిషంలో నెదర్లాండ్స్ ఆటగాడు సాండర్ గోల్ సాధించినా... అది ఆ జట్టును పరాజయం నుంచి కాపాడలేకపోయింది.



మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు హాజరైన తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు. చిత్రంలో నరసింహన్ సతీమణి విమల

ఎట్ హోమ్‌లో.. ఇద్దరు సీఎంలు

- గవర్నర్ సమక్షంలో గంటన్నరకు పైగా భేటీ
- విభజన అంశాలు, సమస్యలపై చర్చ!
- ఉల్లాసంగా జరిగిన గవర్నర్ తేనీటి విందు
- తొలిసారి రాజ్‌భవన్‌కు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్
- హాజరైన ఇరు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం రాజ్‌భవన్‌లో తేనీటి విందు (ఎట్ హోమ్) ఇచ్చారు. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు ఎన్.చంద్రబాబునాయుడు, కె.చంద్రశేఖర్‌రావులతోపాటు ఇరు రాష్ట్రాల మంత్రులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ విందుకు హాజరయ్యారు. ఆహూతులందరికీ గవర్నర్ నరసింహన్ దంపతులు స్వయంగా స్వాగతం పలికారు. సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఆరున్నర వరకు ఉల్లాసంగా ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. అనంతరం గవర్నర్ ఇద్దరు సీఎంలతో కలసి దాదాపు గంటన్నరకు పైగా భేటి అయ్యారు.

ఉల్లాసంగా కార్యక్రమం

కార్యక్రమంలో ఇద్దరు సీఎంలు గవర్నర్ నరసింహన్‌కు చెరోవైపు కూర్చున్నారు. మధ్యలో ఒకసారి గవర్నర్ లేచి వెళ్లగా సీఎం కేసీఆర్ తన సీట్లోంచి లేచివచ్చి చంద్రబాబు పక్కన కూర్చుని కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. ఇక కార్యక్రమంలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి, పవన్ కల్యాణ్, ఇతర నేతలు ముచ్చటించుకుంటూ కనిపించారు. మాజీ సీఎం రోశయ్యతో చంద్రబాబు కొద్దిసేపు మాట్లాడారు. గవర్నర్ నరసింహన్ ప్రత్యేకంగా ఆహ్వానించిన మేరకు జనసేన పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు పవన్‌కల్యాణ్ కూడా ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగిశాక ఇద్దరు సీఎంలను తీసుకుని గవర్నర్ రాజ్‌భవన్‌లోకి వెళ్లగా.. సుమారు ఐదు నిమిషాల తర్వాత పవన్ కల్యాణ్ కూడా లోనికి వెళ్లారు. సీఎంలతో గవర్నర్ భేటీ సమయంలో పవన్ అక్కడే ఉన్నట్లు సమాచారం. కేసీఆర్, చంద్రబాబు వెళ్లిపోయిన అనంతరం గవర్నర్‌తో పవన్ కొంతసేపు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే అటు సీఎంల భేటీ అంశాలుగానీ, పవన్‌తో భేటీ విషయాలు కానీ బయటికి రాలేదు. ఎట్‌హోం కార్యక్రమంలో కేంద్రమంత్రులు దత్తాత్రేయ, సుజనా చౌదరి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, తెలంగాణ డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఈటల రాజేందర్, సీఎల్పీ నేత జానారెడ్డి, షబ్బీర్ అలీ, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, డీఎస్, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ మాజీ సీఎస్ రాజీవ్‌శర్మ, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

అపరిష్కృత అంశాలపై చర్చ?

రాష్ట్ర విభజన జరిగి మూడున్నరేళ్లు కావొస్తోంది. పునర్విభజన చట్టం మేరకు జరగాల్సిన వివిధ సంస్థల విభజన, ఉద్యోగుల విభజన వంటి అంశాలెన్నో ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. విభజన చట్టం 9, 10 షెడ్యూళ్లలోని పలు అంశాలు, కార్పొరేషన్లు, హైకోర్టు విభజన తదితర ప్రక్రియలేవీ ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం గవర్నర్ వద్ద సుదీర్ఘంగా జరిగిన భేటీలో చంద్రబాబు, కేసీఆర్‌లు సాగునీటి పంపకాలు సహా పలు అపరిష్కృత అంశాలపై చర్చించారని తెలుస్తోంది. ఇక ముందు కూడా ముఖ్యమంత్రుల స్థాయిలో ఇలాంటి భేటి జరపాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఉత్కంఠకు నేడు తెర

కాకినాడ ఎన్నికలపై నేడు హైకోర్టు తీర్పు • అభ్యర్థుల్లో టెన్షన్



కాకినాడ కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలపై నెలకున్న గందరగోళం బుధవారం తొలగనుంది. ఒకవైపు నేడు నామినేషన్ల ఉపసంహరణ గడువు, మరోవైపు రిజర్వులో ఉన్న తీర్పు వెల్లడి నేపథ్యంలో అభ్యర్థులంతా టెన్షన్ పడుతున్నారు. తమ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో ఎన్నికలంటేనే టీడీపీ నేతలు హడలిపోతున్న నేపథ్యంలో ఆకస్మికంగా కాకినాడ కార్పొరేషన్ నోటిఫికేషన్ వచ్చేసింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలను ఎదుర్కోలేమన్న అభద్రతా భావంతో ఎలాగైనా కార్పొరేషన్ ఎన్నికలను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆమేరకు తమ అనుయాయుల చేత సాంకేతిక కారణాలు చూపించి హైకోర్టులో ప్రజావ్యాజ్యాలు వేయించారు. ఆ కేసుల్లో ఈ నెల 10వ తేదీన వాదనలు కూడా ముగిశాయి. 16న వెల్లడిస్తామని తీర్పును హైకోర్టులో రిజర్వులో ఉంచింది. ఇప్పుడా సమయం రావడంతో కాకినాడలో టెన్షన్ వాతావరణం నెలకుంది.

అధికారుల తప్పిదమే కారణం...

విలీనం చేసిన మూడు గ్రామ పంచాయతీలపై కోర్టు స్టే కొనసాగుతున్న నేపథ్యంలో వాటిని విలీనం చేసి ఎన్నికలకు సిద్ధం కావడం అధికారులు చేసిన తప్పిదంగా భావిస్తున్నారు. కోర్టు స్టే తొలగకుండానే ఎన్నికలకు సిద్ధమైన తీరే ఈ సమస్యకు కారణమని అభిప్రాయపడుతున్నారు. 48 డివిజన్లకు ఎన్నికలు జరిపి, మిగిలిన రెండు డివిజన్లు నిలుపుదల చేస్తే మరో కొత్త సమస్య వచ్చే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

టెన్షన్‌లో అభ్యర్థులు...

నేటితో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియనుంది. అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో పార్టీల నుంచి టిక్కెట్లు ఖరారైన వారంతా మిగతా వారిని ఉపసంహరించుకునేలా చేసుకోవాల్సి ఉంది. ఈమేరకు వారితో సంప్రదింపులు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. ఇంతా చేశాక ఎన్నికలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇస్తే ఇంతవరకు పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణలో ఘనంగా పంద్రాగస్టు పండుగ

గోల్కొండపై జెండా ఎగరేసిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాజన్న ఒగ్గుడోలు.. షేరీ బ్యాండు.. మర్ఫా.. బంజారా నృత్యాలు.. కొమ్ము బూరల సందడి.. పేరిణి శివతాండవం.. ముగ్రా, గుజరాతీ దాండియా.. పంజాబీ భాంగ్రా.. ఒక్కటేమిటీ భిన్న సాంస్కృతిక సౌరభాలు గుభాలిస్తుండగా మంగళవారం హైదరాబాద్ గోల్కొండ కోటలో 71వ స్వాతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి. కోట గోడలపై సైనికుల దుస్తుల్లో యువకుల కవాతు, అడుగడుగునా అలంకరణలు గోల్కొండకు కొత్త అందాలు తెచ్చిపెట్టాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వరసగా నాలుగో పంద్రాగస్టు వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ నిర్వహించింది. మంగళవారం ఉదయం పెరేడ్‌మైదానంలో అమర జవాన్లకు నివాళులర్పించిన తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు 10 గంటలకు గోల్కొండ కోటకు చేరుకున్నారు. ఐపీఎస్ అధికారి అపూర్వరావు ఆధ్వర్యంలో కోట ప్రధాన ద్వారం వద్ద సీఎంకు స్వాగతం పలికారు. అక్కడ్నుంచి కాన్వాయ్‌లో ప్రధాన వేదిక వద్దకు చేరుకున్న సీఎం జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రసంగించారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. నార్సింగి సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థినులు త్రివర్ణ దుస్తులు ధరించి చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కవి సుద్దాల అశోక్ తేజ, గాయకుడు జయరాజ్, సాహితీవేత్త భాష్యం విజయసారథిలను సీఎం సన్మానించారు. తర్వాత ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు.

దేశవాళీ పంటల సాగుకు ఉద్యమిద్దాం

నటుడు కమల్ హాసన్ పిలుపు



'నానుం ఒరు వ్యవసాయి' అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నటుడు కమల్‌హాసన్

పెరంబూరు (చెన్నై): దేశవాళీ పంటల సాగుకు నడుం బిగించాలని సినీనటుడు కమల్‌హాసన్ పిలుపునిచ్చారు. 70 శాతం దేశవాళీ పంటలు తెరమరుగయ్యాయని, 30 శాతమే సాగవుతున్నాయని పేర్కొన్నారు. వీటినైనా కాపాడుకోవాలిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తాను కూడా ఇంటి పై భాగంలో దేశవాళీ కూరగాయలు పండించుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రకృతి పరమైన పంటలు పండించే విధంగా విప్లవాన్ని తీసుకొద్దామని ఆయన పిలుపునిచ్చారు. నటుడు ఆరి 'మారువోం మాట్రువోం' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా 'నానుమ్ ఒరు వ్యవసాయి' పేరుతో దేశవాళీ పంటలపై అవగాహన కలిగించే విధంగా గిన్నిస్ రికార్డు కోసం నిర్వహించనున్న ప్రదర్శనకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను సోమవారం కమల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 26న దిండివనం సమీపంలోని ఆవనీపూర్ గ్రామంలో నిర్వహించనున్నారు. ఇందులో విద్యార్థులు, సినీ ప్రముఖులు, రైతులు, సామాజిక కార్యకర్తలు 5 వేల మంది పాల్గొననున్నారు.

బరిలోకి బలమైన అభ్యర్థులు

కాకినాడలో పూర్తైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపిక

- విజయసాయి రెడ్డి, ధర్మాన, బొత్స సమక్షంలో ఎంపిక కసరత్తు
- ఆశావహులందరితోనూ సమావేశమైన ముఖ్యనేతలు



అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు విజయసాయిరెడ్డి, ధర్మాన, బొత్స, చెవిరెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తయింది. రెండు రోజులుగా చేసిన కసరత్తు మంగళవారం కొలిక్కి వచ్చింది. అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థులను ముఖ్యనేతలు ఎంపిక చేశారు. ప్రతి డివిజన్‌లో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో సుదీర్ఘంగా చర్చించారు. బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు నిర్ణయించారు. రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సమక్షంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. కార్పొరేషన్‌లోని 48 డివిజన్లకు జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసేందుకు ఇప్పటికే 168 మంది నామినేషన్లు వేశారు. ప్రజాదరణ ఉన్న వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తే విజయం తథ్యమన్న ధీమాతో ఆశావహులంతా పోటీ పడ్డారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ఉన్న నేపథ్యంలో వీరి నుంచి బలమైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు జిల్లా నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. నామినేషన్ వేసిన ప్రతి ఆశావహుని బలబలాలను తెప్పించుకుని తుది నిర్ణయానికి వచ్చారు.

నామినేషన్లు వేసిన వారందరినీ పిలిపించుకుని ఎంపిక చేసిన అభ్యర్థికి టిక్కెట్ ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో వివరించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయాలకు అంతా సానుకూలత కనబరిచారు. 40మంది పేర్లతో కూడిన అభ్యర్థుల జాబితాను రాత్రి వైఎస్సార్ సీపీ నేతలు విడుదల చేశారు. అభ్యర్థుల ఎంపిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, దాడిశెట్టి రాజా, వంతల రాజేశ్వరి, మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, ముత్తా గోపాలకృష్ణ, పార్లమెంట్ కోఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ కో ఆర్డినేటర్లు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ముత్తా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రంగానికి ప్రాముఖ్యత ఇవ్వాలి

మంత్రి యనమల



జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి యనమల

లబ్బీపేట (విజయవాడ తూర్పు): వ్యవసాయరంగానికి దీటుగా ఉద్యానరంగానికి ప్రాముఖ్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. అప్పుడే రైతులకు ఆదాయం పెరిగి నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విజయవాడలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రియ, నర్సరీ ఎక్స్‌పో–2017ను యనమల మంగళవారం ప్రారంభించారు. యనమల ప్రసంగిస్తుండగా, ఓ రైతు కుర్చీలో నుంచి లేచి మేము పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే చాలని, ఇవన్నీ మాకు అవసరం లేదని పేర్కొన్నారు. దీంతో అధికారులు ఆ రైతు వద్దకు వెళ్లి మాట్లాడవద్దని సూచించారు. దీంతో మరో రైతు నిల్చుని మీరు చెప్పేవి మేము వినడమే కానీ, మేము చెప్పింది పట్టించుకోరంటూ వారిద్దరూ కలిసి సభా ప్రాంగణం నుంచి బయటకు నడిచారు.

వైఎస్సార్ జిల్లా ఉపాధ్యాయుడికి రాష్ట్రపతి అవార్డు

- తెలుగు రాష్ట్రాల నుంచి ఒకే ఒక్కడు
- వచ్చే నెల 5న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం



ఉపాధ్యాయుడు కంభం వెంకటేశు

ప్రొద్దుటూరు: కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తున్న వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె హైస్కూల్‌కు చెందిన గణిత ఉపాధ్యాయుడు కంభం వెంకటేశు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ద్వారా ఎంపిక చేసే జాతీయ అవార్డుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఈయన ఒక్కరే ఎంపిక కావడం విశేషం. వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన కంభం వెంకటేశు ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసి 1996లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధుల్లో చేరారు. 2000 సంవత్సరంలో పదోన్నతిపై చాపాడు మండలం చిన్నగురువలూరు జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. ఇటీవల దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆయన 'తెలుగు మ్యాథ్స్ డాట్ వీబ్లీ డాట్ కామ్' అనే వెబ్‌సైట్‌ను రూపొందించి విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధిస్తున్నారు. అలాగే యూట్యూబ్‌లో వెంకీస్ మ్యాథ్స్ పేరుతో చానల్ నిర్వహిస్తున్నారు.

షార్ నుంచి మరో నాలుగు ప్రయోగాలు

షార్ డైరెక్టర్ పి.కున్హికృష్ణన్



శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి డిసెంబర్ చివరి నాటికి మరో నాలుగు ప్రయోగాలు చేయనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.కున్హికృష్ణన్ తెలిపారు. మంగళవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 31న పీఎస్ఎల్వీ సీ–39 శాటిలైట్‌ను ప్రయోగించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం సిరీస్‌లో ఐఆర్ఎన్ఎస్ఎస్– 1హెచ్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపుతున్నట్లు తెలిపారు. 2013లో ప్రయోగించిన ఐఆర్ఎన్ఎస్ఎస్– 1 ఏ ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తడంతో పనిచేయట్లేదని, దాని స్థానంలో ఐఆర్ఎన్ఎస్ఎస్– 1హెచ్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం రెండు పీఎస్ఎల్వీ రాకెట్లు, ఒక జీఎస్ఎల్వీ మార్క్– 2 ప్రయోగాలు ఉంటాయని వివరించారు. 2018 ప్రథమార్థంలో చంద్రయాన్–2 ప్రాజెక్ట్ ఉంటుందని తెలిపారు. డిసెంబర్ నాటికి రెండో రాకెట్ అనుసంధాన భవనం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. షార్‌కు మరో రెండు కొత్త ప్రాజెక్టులు రానున్నట్లు కున్హికృష్ణన్ తెలిపారు. అలాగే సుమారు రూ. 630 కోట్లతో నిర్మిస్తున్న వరల్డ్ క్లాస్ సెకండ్ వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ నిర్మాణం ఈ ఏడాది చివరికి పూర్తవుతుందని తెలిపారు. ఏటా అక్టోబర్ 4 నుంచి 10 వరకు నిర్వహించే అంతరిక్ష వారోత్సవాలను ఇకపై రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరింపజేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట గ్రూప్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ, పీఆర్ఓ విశ్వనాథశర్మ ఉన్నారు.

హైదరాబాద్‌కు విదేశీ 'దమ్ము'

- భారీగా విదేశీ సిగరెట్ల అక్రమ రవాణా
- ఓ ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: బంగారం... ఎలక్ట్రానిక్ వస్తువులు... మాదకద్రవ్యాలు... అక్రమ రవాణా పేరు చెప్పగానే ఇవే గుర్తుకొస్తాయి. నగరానికి చెందిన కొన్ని ముఠాలు మాత్రం కొన్నాళ్లుగా సిగరెట్లను స్మగ్లింగ్ చేస్తున్నాయి. ఏటా రూ.వందల కోట్ల విలువైన సరుకు 'దిగుమతి'చేసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఇలాంటి ఓ ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్టు డీసీపీ బి.లింబారెడ్డి వెల్లడించారు. వీరి నుంచి రూ.19 లక్షల విలువైన బంగ్లాదేశ్ తయారీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బంగ్లాదేశ్ టు సిటీ వయా మెట్రోస్...

హైదరాబాద్‌కు అక్రమ రవాణా అవుతున్న సిగరెట్లలో ప్యారిస్ బ్రాండ్‌కు చెందినవి ఎక్కువగా ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఇవి తయారవుతున్నది బంగ్లాదేశ్‌లో. అక్కడ నుంచి నేరుగా కాకుండా... కోల్‌కతా, ఢిల్లీల మీదుగా రైలు మార్గంలో హైదరాబాద్‌కు వచ్చిపడుతున్నాయి. బేగంబజార్‌కు చెందిన మహ్మద్ హస్‌నుద్దీన్ ఈ అక్రమ సిగరెట్ల దందాలో ఆరితేరాడు. ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి నుంచి వీటిని ఖరీదు చేస్తున్నాడు. వివిధ రకాల పేర్లతో రైళ్లలో పార్సిల్ అవుతున్న వీటిని తన ఏజెంట్లు ఎజాజ్ అలీ, అలీ రజాల ద్వారా నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి బేగంబజార్‌కు తెప్పించుకుంటున్నాడు. ఒక్కో ప్యాకెట్ రూ.20కి ఖరీదు చేస్తున్న హస్‌నుద్దీన్... మార్కెట్‌లో రూ.30కి విక్రయిస్తుండగా... వినియోగదారులకు రూ.40కు చేరుతోంది. ఎక్కడా బిల్లులు లేకుండా ఈ దందా సాగడంతో ప్రభుత్వానికి పన్ను రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

కోచ్ పోస్టులు ఆంధ్రలో.. ఇంటర్వ్యూలు తెలంగాణలో

- అభ్యర్థులకు తెలిసేలా ఎటువంటి ప్రకటన చేయని శాప్
- ఇదేం ఖర్మంటూ విస్మయం వ్యక్తం చేస్తున్న క్రీడా వర్గాలు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో క్రీడా శిక్షకుల (కోచ్‌లు) నియామకానికి తెలంగాణ రాష్ట్రం భద్రాది కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈమేరకు పర్‌ఫెక్ట్ ఔట్‌సోర్సింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సంస్థపేరుతో ఓ పత్రికలో మంగళవారం ప్రకటన వచ్చింది. ప్రకటన ఇచ్చిన రోజు నుంచే అంటే ఈనెల 15 నుంచి 18వ తేదీలోగా పాల్వంచలోని ఆ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు పొందాలి. ఈనెల 19, 20 తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల కోసం, తరువాత ఇంటర్వ్యూలకు ఇలా రెండు సార్లు రాష్ట్రంలో ఇటు చిత్తూరు జిల్లా, అటు శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎవరైనా సరే అభ్యర్థులు పాల్వంచ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నియామకాలకు సంబంధించి సొంత రాష్ట్రంలో అభ్యర్థులకు తెలిసేలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కూడా ఎటువంటి పత్రికా ప్రకటన గాని, తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచకపోవడంపై క్రీడా వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకు ముందు కొన్ని కోచ్‌ల పోస్టుల నియామక దరఖాస్తుల స్క్రూటినీ పేరుతో స్టార్‌హోటల్‌లో జరిపిన కార్యకలాపాలపై పత్రికల్లో వార్తలు వచ్చిన విషయం విదితమే. ఇప్పుడు ఇచ్చిన ప్రకటనలో ఏయే క్రీడాంశంలో ఎన్ని కోచ్‌ల పోస్టులు, వాటికి సంబంధించిన వివరాలు ఏమిటని ప్రకటనలో ఇచ్చిన ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించగా, కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని సదరు సంస్థకు వచ్చి తెలుసుకోవాల్సిందేనని సంస్థ ప్రతినిధులు పేర్కొనడం గమనార్హం. మరిన్ని వివరాల కోసం 9866998599, 9966880055 నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.